మీడియాకు సంబంధించిన అన్ని విషయాల కోసం 9246213493
సహాయ
మీడియా సర్వీసు రి.
3-7-255,మన్సూరాబాద్,ఎల్బీనగర్,హైదరాబాద్-68

www.navabhoomi.in | epaper.navabhoomi.in | RNI No:TELTEL:82083

అనుక్షణం
# నవభూమి
ANUKSHANAM
NAVABHOOMI TELUGU DAILY
నవతరం తెలుగు దినపత్రిక

Published from Hyderabad and Vijayawada
ఎడిటర్ : అజీద్

హైదరాబాద్ | 08 మంగళవారం | అక్టోబర్ 2024 | పేజీలు 8-12 | వెల: రూ.6 | సంపుటి:3 సంచిక: 22

Navabhoomi daily fallows..

ANU FURNITURE®
HYDERABAD | BENGALURU
Call: +91 9100913033, 8688003033



# మాల్దీవులకు అండ

◆ కష్టాల్లో ఉన్న మాల్దీవులను ఆదుకునేందుకు భారత్ సాయం
◆ 400 మిలియన్ డాలర్ల (సుమారు రూ.3,360 కోట్లు) కరెన్సీ స్వాప్ డీల్
◆ అమెరికా డాలర్లలో కాకుండా స్థానిక కరెన్సీలలో వ్యాపారం చేయగలిగే మరొక 3 వేల కోట్ల రూపాయల ఒప్పందం
◆ మాల్దీవుల అధ్యక్షులు మొహమ్మద్ మయిజ్జు ఐదురోజుల భారత పర్యటన



**న్యూదిల్లీ-నవభూమిబ్యూరో**
'మా ఆర్థిక పరిస్థితి భారత్‌కు తెలుసు' అంటూ వచ్చిన మాల్దీవుల అధ్యక్షుడికి మోదీ భారీ సహాయం
భారత పర్యటన సందర్భంగా సోమవారం చర్చలు జరిపిన మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు, భారత ప్రధాని నరేంద్ర మోదీ.కష్టాలలో ఉన్న మాల్దీవుల ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఆ దేశానికి ఆర్థిక సహాయాన్ని అందించడానికి భారత్ అంగీకరించింది.
మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు తన ఐదు రోజుల భారత పర్యటన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీతో చర్చలు జరిపిన అనంతరం ఈ విషయాన్ని ప్రకటించారు.
400 మిలియన్ డాలర్ల (సుమారు రూ.3,360 కోట్లు) కరెన్సీ స్వాప్ డీల్, అమెరికా డాలర్లలో కాకుండా స్థానిక కరెన్సీలలో వ్యాపారం చేయగలిగే మరొక 3 వేల కోట్ల రూపాయల ఒప్పందం ఈ సహాయంలో భాగం.
ఇటీవలి కాలంలో రెండు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నప్పటికీ మాల్దీవుల అధ్యక్షుడికి ఈ పర్యటనలో గొప్ప ఆతిథ్యం లభించింది.
మోదీ.. మాల్దీవుల అధ్యక్షుడి పర్యటనను రెండు దేశాల సంబంధాలలో నూతన అధ్యాయంగా పేర్కొన్నారు.
మాల్దీవుల ప్రజల పురోభివృద్ధికి, శ్రేయస్సుకు భారత్ ఎప్పుడూ తోడుగా ఉంటుందని మోదీ అన్నారు.
**మోదీ ప్రకటనలు, అందిస్తున్న ఆర్థిక ప్యాకేజీ..**
2023 నవంబర్‌లో ముయిజ్జు అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు దేశాల మధ్య సంబంధాలలో గణనీయమైన అభివృద్ధిని సూచిస్తున్నాయి.

# లడ్డూ కల్తీ నిజమేనా!

● సీఎం చంద్రబాబును ప్రధాని మోడీ ప్రశ్న?
● అసలేం జరిగిందంటూ గుచ్చిగుచ్చి ప్రశ్నించిన మోదీ
● గుజరాత్ ఎన్‌డీడీబీ బోర్డు నివేదికను అందించిన సీఎం ఈ సందర్భంగా తాజా శ్రీవారి లడ్డూల అందజేత
● వందరోజుల పాలన బాగుందంటూ సీఎంకు పీఎం కితాబు



**న్యూదిల్లీ-నవభూమిబ్యూరో**
టీడీపీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు తాజాగా ఢిల్లీలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం సాయంత్రం 5 గంటల సమయంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోడీతో భేటీ అయ్యారు.ఈ సందర్భంగా ఆయన రాష్ట్రానికి సంబం ధించిన పలు అంశాలపై ప్రధానితో చర్చించిన ట్టు తెలిసింది. ముఖ్యంగా చంద్రబాబు కంటే ఎక్కువగా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంపై ఆరా తీసినట్టు జాతీయ మీడియా వర్గాలు చెబుతున్నా యి. "అసలేం జరిగింది?" అని చంద్రబాబును గుచ్చి గుచ్చి ప్రశ్నించినట్టు సమాచారం.దీనిపై చంద్రబాబు కూడా ఎన్‌డీడీబీ(నేషనల్ డెయిరీ డెవలప్ మెంట్ బోర్డు-గుజరాత్) ఇచ్చిన నివేదికను కూడా ప్రధానికి అందించా రు. ఈ సంస్థ ఇచ్చిన రిపోర్టులో నెయ్యి కల్తీ జరిగిందని పేర్కొందని.. దీనినే తాను మీడియా ముందు చెప్పుకొచ్చానని చంద్రబాబు వివరించి నట్టు జాతీయ మీడియా వర్గాలు చెబుతున్నా యి. ఇదేసమయంలో తిరుమల పవిత్రతను, రోజుకు ఎంత మంది భక్తులు వస్తున్నారు? ఎంత మందికి లడ్డూ ప్రసాదం పంపిణీ చేస్తున్నారు? అసలు లడ్డూ ప్రాదాన్యం.. ఇలా అన్ని విషయాలను కూడా చంద్రబాబు వివరించినట్టు తెలిసింది. వైసీపీ హయాంలో జరిగిన కొన్ని లోపాలు.. చేసిన నిర్ణయాల కారణంగానే ఇలా తక్కువ ధరలకు నెయ్యిని కొన్నారని.. దీని వల్లే కల్తీ జరిగి ఉంటుందని తాము అభిప్రాయపడు తున్నా మని ప్రధానికి చంద్రబాబు వివరించి నట్టు తెలిసింది. ఇదిలా వుంటే.. పోలవరం ప్రాజె క్టుకు సంబంధించి బడ్జెట్‌లో కేటాయిం చిన 12 వేల కోట్ల రూపాయల్లో 6 వేల కోట్లను తక్షణం విడుదల చేయాలని కూడా అభ్యర్థించారు. అదేవిధంగా వరద సాయం పై నా చంద్రబాబు చర్చించినట్టు పార్టీ వర్గాలు తెలిపారు. గడిచిన 100 రోజులపాలన కూడా బాగుందని ప్రధాని మోడీ సందర్భంగా చంద్రబాబును ప్రశంసించినట్టు టీడీపీ ఎంపీలు తెలిపారు.

# వరద సాయం పెంచండి

◆ ఇచ్చిన నిధులు ఎంతమాత్రం సరిపోవు..
◆ అమిత్ షాకు సీఎం రేవంత్ విన్నపం
◆ భారీ వరదలకు నష్టం రూ. 11,713.49 కోట్లు
◆ తక్షణ సాయంగా రూ. 5,438 కోట్లను ఇవ్వాల్సిందిగా కేంద్రానికి లేఖ రాశామన్న సీఎం

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:** రాష్ట్రంలో గత నెల ఫస్ట్ వీక్‌లో కురిసిన భారీ వర్షాలు, వచ్చిన వరదలతో జరిగిన నష్టం రూ. 11,713.49 మేర ఉన్నదని, సత్వరమే ఈ మేరకు నిధుల్ని కేటాయించాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా కు సీఎం రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.
ఢిల్లీ పర్యటనలో భాగంగా వామపక్ష తీవ్రవాద సమస్యలపై జరిగిన సమావేశం అనంతరం కేంద్ర మంత్రితో సీఎం ప్రత్యేకంగా అరగంట పాటు భేటీ అయిన సందర్భంగా ఈ రిక్వెస్టు చేశారు. వారం రోజులకు పైగా కురిసిన వర్షాలు, వరదలతో కాల్వలు తెగిపోయాయని, వేలాది కుటుంబాలు నిరాశ్రయులయ్యాయని, 37 మంది చనిపోయారని వివరించారు. నాలుగున్నర లక్షల ఎకరాల్లో పంట నష్టం జరిగిందని, లక్షల సంఖ్యల పశువులు, మేకలు చనిపోయాయని తెలిపారు. రోడ్లు, కల్వర్టులు, కాల్వలు దెబ్బతినడంతో తక్షణ రిపేర్ పనులు చేశామని, ఇంకా చేయాల్సి ఉన్నదన్నారు. తక్షణ సాయంగా రూ. 5,438 కోట్లను ఇవ్వాల్సిందిగా గత నెల సెకండ్ వీక్‌లో లేఖ రాశామని గుర్తుచేశారు. ఇప్పుడైనా నిధులను విడుదల చేస్తే పనులను పూర్తి చేస్తామని వివరించారు.
మౌలిక వసతుల పునరుద్ధరణ, మరమ్మతు పనులను తాము వెంటనే చేపట్టామని వివరించారు. రాష్ట్రంలో పంట, ఇతర నష్టాలపై కేంద్ర బృందం పర్యటించి మౌలిక వసతుల పునరుద్ధరణ, మరమ్మతులకు రూ. 11,713 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు సెప్టెంబరు 30న నివేదిక సమర్పించిందని సీఎం తెలిపారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులు పునరుద్ధరణ, మరమ్మతుల పనులకు ఎంతమాత్రం సరిపోవన్నారు. ఇప్పటివరకు ఆ నిధులను విడుదల చేయనందున వెంటనే రిలీజ్ చేయాలని కోరారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి ఎస్‌డీఆర్ఎఫ్ మొదటి, రెండో విడతల కింద తెలంగాణకు రూ. 416.80 కోట్లను కేంద్రం విడుదల చేసిందని కేంద్ర మంత్రికి తెలియజేశారు. పునరుద్ధరణ, మరమ్మతు పనులకు విడుదల చేసే నిధులను గతంలో ఎస్‌డీఆర్ఎఫ్ పనులకు సంబంధించిన నిధులు ఉపయోగానికి ముడిపెట్టవద్దని కోరారు. ఎస్‌డీఆర్ఎఫ్‌కు సంబంధించిన నిధులను ఈ ఆర్థిక సంవత్సరంలోనే వ్యయం చేస్తామని కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ తెలిపారు.
**అదనంగా 29 ఐపీఎస్ పోస్టుల్ని ఇవ్వండి :**

# విన్నపాలు వినవలె

● ప్రధాని మోడీకి చంద్రబాబు వినతులివే
● గంట భేటీలో కీలక అంశాలపై చర్చ..!



**న్యూదిల్లీ-నవభూమిబ్యూరో**
ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమవారం 2 రోజుల ఢిల్లీ పర్యటనకు వెళ్లారు. సాయంత్రం ఢిల్లీ చేరుకున్న చంద్రబాబు నేరుగా ప్రధాని మోడీతో భేటీ అయ్యారు.రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక అంశాలపై ప్రధాని మోడీతో ఆయన చర్చలు జరిపారు. దాదాపు గంటసేపు జరిగిన చర్చల తర్వాత చంద్రబాబు ఇతర కేంద్రమంత్రుల్ని కలిసేందుకు బయలుదేరి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా ప్రధాని మోడీకి - మిగతా 2లో

# ఏపీలో కొత్త జిల్లాలు?

◆ కొత్త జిల్లాలపై సోషల్ మీడియాలో జోరుగా ప్రచారం
◆ ఇది ఫేక్ ప్రచారంగా కొట్టివేసిన ఏపీ రాష్ట్ర ప్రభుత్వం

**అమరావతి-నవభూమిబ్యూరో:** ఆంధ్రప్రదేశ్‌లో మరోసారి జిల్లాల పునర్విభజన చేయనున్నారా?. కొత్తగా జిల్లాలను ఏర్పాటు చేయనున్నారా?. ప్రస్తుతం ఉన్న జిల్లాలకు పేర్లను మార్చనున్నారా?.. ప్రస్తుతం ఇదే విషయమై జోరుగా చర్చ జరుగుతున్నది. గత వైసీపీ ప్రభుత్వం ఏపీలో 13గా జిల్లాల సంఖ్యను 26కు పెంచింది. అయితే అప్పుడే కొన్ని జిల్లాల ఏర్పాటుపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. మరికొన్ని జిల్లాలను ఏర్పాటు చేయాలనే డిమాండ్ వచ్చింది. ఇదే విషయమై టీడీపీ కూటమి హామీలు కూడా ఇచ్చింది. -మిగతా 2లో

# సైకిలెక్కనున్న ముగ్గురు ఎమ్మెల్యేలు?

◆ స్థానిక ఎన్నికలు జరిగే తరుణంలోబీఆర్ఎస్ పార్టీకి భారీ షాక్
◆ మాజీ మంత్రి,ఎమ్మెల్యే మల్లారెడ్డి,మర్రి రాజశేఖర్‌రెడ్డితో పాటు
◆ మాధవరం కృష్ణారావు టీడీపీలో చేరేందుకు సన్నద్ధం
◆ ఇప్పటికే టీడీపీ అధినేత చంద్రబాబుతో మల్లారెడ్డి,రాజశేఖర్‌రెడ్డి భేటీ
◆ మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి టీడీపీలో చేరుతున్నట్లు ప్రకటన

2



**హైదరాబాద్-నవభూమిబ్యూరో:**తెలంగాణ రాజకీయాల్లో మరో సంచలన పరిణామం చోటు చేసుకుంది. బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి తిరిగి టీడీపీలో చేరబోతున్నట్లు ప్రకటించారు.
సోమవారం హైదరాబాద్ లో టీడీపీ అధినేత, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుతో తీగల కృష్ణారెడ్డి, ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్ రెడ్డి భేటీ అయ్యారు. ఈ భేటీ అనంతరం మీడియాతో మాట్లాడిన తీగల.. తాను నూటికి నూరు శాతం టీడీపీలో చేరబోతున్నట్లు స్పష్టం చేశారు. తెలంగాణలో తెలుగుదేశం పార్టీకి పూర్వవైభం తీసుకువచ్చేందుకు చంద్రబాబును కలిశామని చెప్పారు. మరోసారి పిలిచి మాతో మాట్లాడుతానని చంద్రబాబు చెప్పారన్నారు. నాతో పాటు చాలా మంది నాయకులు టీడీపీలో చేరుతారని ప్రకటించారు. టీడీపీ వల్లే హైదరాబాద్ అభివృద్ధి చెందిందని, రాష్ట్రంలో చాలా మంది ఎన్టీఆర్, టీడీపీ అభిమానులు ఉన్నారని వారందరిని ఏకతాటిపైకి తీసుకువస్తామన్నారు. దీంతో తీగల బాటలో ఎవరెవరు టీడీపీ గూటికి చేరబోతున్నారనేది సర్వత్రా సస్పెన్స్ గా మారింది.
మల్లారెడ్డిపై ఊహాగానాలు:
నిజానికి గత కొంత కాలంగా మల్లారెడ్డి టీడీపీలో చేరుతానే ఊహాగానాలు జోరుగా వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో బీఆర్ఎస్ అధికారం కోల్పోయాక మల్లారెడ్డి కాంగ్రెస్ లో చేరేందుకు ప్రయత్నాలు చేశారని ఇందులో భాగంగానే గతంలో కర్నాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ ను సైతం కలిశారనే ప్రచారం

# మద్యం షాపులపై ఎమ్మెల్యేల కన్ను

● మద్యం దుకాణాలన్నీ మాకే..ఎమ్మెల్యేల డిమాండ్లు
● చంద్రబాబు సర్కార్‌కు ఊహించని షాక్!
● ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి
● 961 మద్యం దుకాణాలకు ఒక్క అప్లికేషన్‌లేదు
● దరఖాస్తులు పెట్టవద్దంటూ ఎమ్మెల్యేల హుకుం

2



**అమరావతి-నవభూమిబ్యూరో**
రాష్ట్ర ప్రభుత్వం నూతన మద్యం పాలసీకి ఇటీవల నోటిఫికేషన్ రిలీజ్ చేసింది. మొత్తం 3,396 మద్యం దుకాణాలకు లైసెన్సుల జారీ కోసం దరఖాస్తులు కోరుతోంది.
దీనిని 2 ఏళ్ల కాలపరిమితిని నిర్ణయించింది. 2024 అక్టోబర్ 12 నుంచి 2026 సెప్టెంబర్ 30 వరకు ఈ నూతన మద్యం పాలసీ విధానం ఉంటుందని తెలిపింది. నూతన మద్యం పాలసీ అమలుకు మూడు విధాలుగా ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చని ప్రభుత్వం నోటిఫికేషన్లో పేర్కొంది. కాగా మంగళవారం నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మొదలైనట్లు ఎక్సైజ్, ప్రొహిబిషన్ శాఖ డైరెక్టర్ నిషాంత్ కుమార్ తెలిపారు.
12వ తేదీ నాటికి ప్రైవేటు మద్యం షాపులు అందుబాటులోకి వస్తాయని అన్నారు. అక్టోబర్ 11న మద్యం దుకాణాల వేలం పాట జరగనుంది. అయితే లైసెన్స్ కోసం ఒకే వ్యక్తి ఎన్ని అప్లికేషన్లు అయినా పెట్టుకోవచ్చు. ఒక్కో దరఖాస్తుకు సుమారు రూ.2 లక్షల చొప్పున నాన్ రిఫండబుల్ అప్లికేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏంటంటే.. ఇందులో లైసెన్స్ దక్కినా, దక్కకపోయినా దరఖాస్తు రుసుము మాత్రం తిరిగి ఇవ్వరు. లైసెన్స్ దక్కించుకున్న వారికి అక్టోబర్ 12 నుంచి నూతన దుకాణాలు నడుపుకోవచ్చు.
**ప్రభుత్వ ఆదాయానికి గండి**
రాష్ట్రంలో 961 మద్యం దుకాణాలకు ఇప్పటి వరకు ఒక్క అప్లికేషన్ కూడా రాలేదని తెలుస్తోంది. దీని కారణం ప్రభుత్వ ఆదాయానికి గండికొట్టేలా కొందరు ఎమ్మెల్యేలు వ్యవహరిస్తున్నట్లు సమాచారం. తమ నియోజకవర్గాల పరిధిలో ఉన్న మద్యం దుకాణాలకు ఎవరూ దరఖాస్తులు పెట్టవద్దని

# గుఢాచారి రా..బంధు!


◆ భారీ ఎన్‌కౌంటర్‌కు ముందు రాబంధు సంచారం
◆ రాబంధు కాళ్లకు ట్యాగ్,జీపీఎస్ ట్రాకర్.కెమెరాలు
◆ రాబంధు ద్వారానే నక్సలైట్ల ఆచూకీ లభ్యం
◆ ఆ తర్వాతే నక్సల్స్ హతమైనట్లుగా ప్రచారం
◆ ప్రజల ఫిర్యాదుతో రాబంధును పట్టుకొన్న అటవీ శాఖ

2



**చర్ల-నవభూమి ప్రతినిధి:** ఆ పక్షిని చర్ల మండలంలోని ఓ పాఠశాల దగ్గర స్థానికులు గుర్తించారు. వెంటనే దానికి కోడి మాంసం పెట్టారు. కాస్త ఆహారం అందించారు. ఆ తర్వాత ఆ రాబందును అటవీశాఖ అధికారులు స్వాధీనం చేసుకొని.. తమ పర్యవేక్షణలో ఉంచారు. ఆ సంఘటన జరిగిన రెండు రోజుల తర్వాత నక్సల్స్ పై కేంద్ర బలగాలు విరుచుకుపడ్డాయి. చరిత్రలో తొలిసారిగా మావోయిస్టులను హతమార్చాయి. దట్టమైన అడవిలో ఓ సురక్షిత ప్రాంతంలో మావోయిస్టులు తల దాచుకున్నారు. అప్పటికే భారీగా వర్షం కురుస్తోంది. ఆ ప్రాంతంలో సెల్ఫోన్ సిగ్నల్స్ ఉండవు. కనీసం వాహనాలు వెళ్లడానికి సరైన దారి కూడా ఉండదు. అలాంటి ప్రాంతంలో పోలీసులు ఎంట్రీ ఇచ్చారు. మావోయిస్టులకు పారిపోయే అవకాశం ఇవ్వకుండా ఆపరేషన్ చేపట్టారు. ఈ ఘటన చత్తీస్ గడ్ రాష్ట్రంలోని దులి తులి అటవీ ప్రాంతంలో జరిగింది. ఈ ఘటన జరగడానికి ముందు చర్ల మండలంలోని ఏకలవ్య పాఠశాల నిర్మాణ ప్రాంతానికి ఒక రాబందు వచ్చింది. దాని కాళ్లకు కెమెరా,

# వైద్య రంగంలో అమెరికా శాస్త్రవేత్తలకు నోబెల్ ప్రైజ్



**న్యూయార్కు-నవభూమి:**అమెరికా శాస్త్రవేత్తలు విక్టర్ ఆంబ్రోస్, గ్యారీ రువ్ కున్ ఈ ఏడాది వైద్య రంగంలో నోబెల్ ప్రైజ్ గెలుచుకున్నారు. జన్యు క్రమబద్ధీకరణలో మైక్రో ఆర్ఎన్ఏ పాత్రను అత్యంత విపులమైన రీతిలో ఆవిష్కరించినందుకు గాను వారు ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారానికి ఎంపికయ్యారు. విక్టర్ ఆంబ్రోస్, గ్యారీ రువ్ కున్ తమ పరిశోధనల ద్వారా జన్యు క్రియాశీలత ఎలా క్రమబద్ధీకరించబడు తుందో చెప్పే ఒక ప్రాథమిక సిద్ధాంతానికి రూపం కల్పించారు. కాగా, నోబెల్ పురస్కారం కింద వీరిద్దరికీ రూ.9.23 కోట్ల నగదు బహుమతి అందించనున్నారు.విక్టర్ ఆంబ్రోస్ ప్రస్తుతం మసాచుసెట్స్ మెడికల్ స్కూల్ యూనివర్సిటీలో లో నేచురల్ సైన్స్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్నారు. గ్యారీ రువ్ కున్ హార్వర్డ్ మెడికల్ స్కూల్‌లో జెనెటిక్స్ ప్రొఫెసర్‌గా కొనసాగుతున్నారు.

# కాంగ్రెస్‌కు జై కొట్టిన హరియాణా

◆ అన్ని ఎగ్జిట్ పోల్స్‌ల్లోనూ కాంగ్రెస్‌దే హవా
◆ హరియాణా సీఎం కుమారి సెల్జానా, భూపిందర్‌నా?

**న్యూదిల్లీ-నవభూమి:**శనివారం ఒకే విడతలో హరియాణా అసెంబ్లీ ఎన్నికలు ముగిశాయి. అయితే ఆరోజే వెల్లడైన ఎగ్జిట్ పోల్స్ అన్నీ దాదాపు హరియాణా పీఠం హస్తం పార్టీదేనని పేర్కొన్నాయి.ఇక ఫలితాలు మంగళవారం వెలువడనుండగా.. కాంగ్రెస్ పార్టీ నేతలు మాత్రం విజయవం తమదేననే సంతోషంలో మునిగితేలుతున్నారు. ఈ క్రమంలోనే ఒకవేళ కాంగ్రెస్ పార్టీ హరియాణాలో గెలుపొందితే ముఖ్యమంత్రి ఎవరు అనేది ప్రస్తుతం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇక హరియాణా కాంగ్రెస్ పార్టీలో పలువురి పేర్లు సీఎం రేసులో ఉండగా.. వాళ్లు మాత్రం ఎవరికి వారు ధీమాగా తమదే ముఖ్యమంత్రి పీఠం అని చెబుతున్నారు.



# బతుకమ్మ, దసరా పండుగలకు 6304 ప్రత్యేక బస్సులు : టీజీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్

**హైదరాబాద్-నవభూమి:** సద్దుల బతుకమ్మ, దసరా పండుగలకు ప్రయాణికులను క్షేమంగా సొంతూళ్లకు చేర్చేందుకు సహకరించాలని పోలీసు, రవాణా శాఖ అధికారులను టీజీఎస్ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ కోరారు. మహాలక్ష్మీ పథకం అమలు కారణంగా గత ఏడాది దసరాతో పోలిస్తే ఈ సారి ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో గత ఏడాదితో పోలిస్తే అదనంగా 600 ప్రత్యేక బస్సులను నడపాలని నిర్ణయించినట్లుగా తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 6304 ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 9వ తేదీ నుంచి 12వ తేదీ వరకు ఈ ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంటాయని అన్నారు. శాఖ అధికారులతో టీజీఎస్ఆర్టీసీ ఎండీ సజ్జనార్ సమావేశమయ్యారు. దసరాకు ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సులు, రద్దీ ప్రాంతాల్లో తీసుకోవాల్సిన చర్యలపై ఆర్టీసీ అధికారులకు వివరించారు. దసరా సందర్భంగా హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్, జేబీఎస్, ఉప్పల్ క్రాస్ రోడ్స్, ఎల్బీనగర్, ఆరాంఘర్, కూకట్ పల్లి, గచ్చిబౌలి, బోయిన్ పల్లి, జగద్గిరిగుట్ట, సుచిత్ర, ఐఎస్ సదన్, బొరబండ, శంషాబాద్ లలో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉంటుందని సజ్జనార్ తెలిపారు. ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక క్యాంప్‌లను ఏర్పాటు చేసి ప్రయాణికులకు అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నామని చెప్పారు. ప్రతి రద్దీ ప్రాంతం వద్ద పర్యవేక్షణ అధికారులను నియమించామన్నారు. ప్రయాణికుల రద్దీని బట్టి వారు ప్రత్యేక బస్సులు అందుబాటులో ఉంచుతారని తెలిపారు. ప్రయాణికులకు సమాచారం అందించేందుకు ప్రత్యేకంగా వాలంటీర్లనూ నియమించామని తెలిపారు.



## దువ్వాడ ఉత్సవం... జంటగా హుషారుగా !



**హైదరాబాద్-నవభూమి:** వైసీపీ ఎమ్మెల్సీ శ్రీకాకుళం జిల్లా టెక్కలికి చెందిన కీలక నేత దువ్వాడ శ్రీనివాస్ కో సరికొత్త ఉత్సాహం కనిపిస్తోంది. ఆయన తన అనుచరు రాలు వైసీపీ మహిళా నేత మాధురితో కలసి శ్రీవారి బ్రహ్మోత్సవాలకు హాజరయ్యారు. ఏడుకొండల స్వామిని ఈ జంట దర్శించుకున్నారు. వీరి వెంట టెక్కలికి చెందిన వైసీపీ నేతలు కూడా ఉన్నారు ఈ సందర్భంగా మీడియాకు ఎదురుపడి వారి ముందు చిరునవ్వులు చిందిస్తూ దువ్వాడ శ్రీనివాస్ కనిపించారు. దువ్వాడ శ్రీనివాస్ ఎపిసోడ్ రెండు నెలల క్రితం ఎలా సాగిందో అందరికీ తెలిసిందే. తన భార్య వాణి కుమార్తెతో ఆయన విభేదించిన తీరుతో పాటు ఆయన టెక్కలి హైవే మీద కట్టిన కొత్త ఇల్లు తమదే అంటూ వారు రచ్చ చేయడంతో కొన్నాళ్ళ పాటు మీడియాకు అదే వార్త అయింది అయితే మాధురికి తాను రెండు కోట్ల రూపాయలు బాకీ పడ్డాను అని ఆ ఇంటికి ఆమె పేరున శ్రీనివాస్ రిజిస్ట్రేషన్ చేయించడంతో ఆ ఇల్లు ఆమె పరం అయింది. దాంతో ఆ వివాదం ఆగిపోయింది. మరో వైపు చూస్తే తన భార్యకు విడాకులు ఇవ్వాలని అనుకుంటున్నట్లుగా ఆయన మీడియా ముందే ప్రకటించారు. సో ఆ విషయం పక్కన పెడితే వైసీపీ మహిళా నేత మాధురితో కలసి ఆయన తాజాగా మీడియా ముందు కనిపించడంతో ఆయన సంచలనంగా మారారు. రానున్న రోజులలో కీలక వార్త ఏదైనా చెబుతారా అన్న చర్చ కూడా వస్తోంది. ఇక వైసీపీ నేత దువ్వాడ డేరింగ్ లీడర్ అని మహిళా నాయకురాలు మాధురి చెబుతూ ఉంటారు. ఆయనని హీరోగా పెట్టి ఆమె వాలంటీర్ అన్న సినిమా ఇటీవల తీశారు అని అంటున్నారు. ఇలా దువ్వాడ శ్రీనివాస్ మాధురితో కలసి బయటకు రావడం ఆయన భార్య కుమార్తెలు ఈ ఇష్యూ విషయంలో ఒక లాజికల్ ఎండింగ్ కోసం చూస్తున్నట్లుగా సైలెంట్ కావడం జరిగింది. దువ్వాడ శ్రీనివాస్ ఈ ఇష్యూలో ఓపెన్ అయ్యారని అందుకే మీడియా ముందుకు వచ్చారని అంటున్నారు. మరో వైపు చూస్తే వైసీపీ అధినాయకత్వం కూడా దువ్వాడ శ్రీనివాస్ విషయంలో కఠినంగా వ్యవహరించడం లేదు. ఆయనను టెక్కలి ఇన్చార్జి పదవి నుంచి మాత్రమే తప్పించింది. ఆయన ఎమ్మెల్సీ పదవి అలాగే ఉంది. ఆయన ఈ మధ్య వైసీపీ నిర్వహించిన జిల్లా స్థాయి పార్టీ సమీక్షా సమావేశానికి హాజరయ్యారు. దాంతో రానున్న రోజులలో ఆయన పార్టీ పరంగా మళ్లీ కీలకం కానున్నారు అని అంటున్నారు. ఏది ఏమైనా దువ్వాడ శ్రీనివాస్ పొలిటికల్ గా దూకుడు కలిగిన నాయకుడు. ఆయన ఇటీవల కాలంలో వ్యక్తిగత వివాదాల్లో పడి కాస్తా పొలిటికల్ గా వెనకబడ్డారు ఇపుడు మరీ సరికొత్త ఉత్సాహంతో కనిపిస్తూ మీడియాకు వచ్చారు. రానున్న రోజులలో ఆయన యధా ప్రకారం వైసీపీ తరఫున తన సత్తాను చూపుతారు అని అభిమానులు అంటున్నారు. ఏది ఏమైనా ఆరు పదుల వయసులో ఉన్నా నవ యువకుడిగా దువ్వాడ కనిపిస్తున్నారు అని ఆయన ఫ్యాన్స్ అంటోంది. ఆయనలో ఉత్సాహం హుషారుని వారు ఆస్వాదిస్తున్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిష్కరిస్తాం: కలెక్టర్

**హైదరాబాద్-నవభూమి:** ప్రజావాణిలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించే దిశగా కృషిచేస్తామని కలెక్టర్



వెంకటేష్‌దోత్రే అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ దీపక్ తివారి, దాసరి వేణుతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తు లను స్వీకరించారు. ఆసిఫాబాద్ పట్టణం బజార్‌వాడీ, సందీప్ నగర్, బ్రాహ్మణవాడకు చెందిన ప్రజలు మున్సిపాలిటీ పరిధిలో వ్యాపారం నిర్వహిం చుకొనుటకు అనుమతి మంజూరు చేయా లని దరఖాస్తు అందజేశారు. దహెగాం మండలం మొట్లగూడ గ్రామా నికి చెందిన సంచిత తాను కంప్యూటర్‌లో పీజీడీసీఏ చేశానని తనకు ఉపాధి కల్పించాలని, ఆసిఫాబాద్ మండలం బూర్గుడకు చెందిన రాజయ్య తనకు వృద్ధాప్యపెన్షన్ మంజూరు చేయాలని దరఖాస్తు అందజేశారు. వాంకిడి మండలం లంజన్‌వీర గ్రామానికి చెందిన మోతీరాం తన కుటుంబసభ్యులలో భూ సంబంధిత వివాదంలో న్యాయం చేయాలని దరఖాస్తులు అందజేశారు. వాంకిడి మండలం పునుగూడ గ్రామానికి చెందిన గిర్జుబాయి తనభర్త పేరున ఖమాన గ్రామశివారులో పట్టాభూమి ఉందని, ఆయన మరణించడంతో తనపేరిట విరా సత్‌చేసి పట్టా ఇప్పించాలని అర్జీ సమర్పించారు. వాంకిడి మండలం సరండి గ్రామానికి చెందిన నారాయణ తనపేరిట గల పట్టాభూమి వివరాలు నమోదుచేసి నూతన పట్టాపాసు పుస్తకం మంజూరు చేయాలని దరఖాస్తు చేసుకు న్నారు. కెరమెరి మండలం కరంజివాడ గ్రామా నికి చెందిన శ్రీనివాస్ తనపేరిటగల ఆర్‌వో ఎఫ్ఆర్ పట్టా భూమికి సంబంధిం చిన రైతు భరోసా డబ్బులు ఇప్పించాలని దరఖాస్తు అందజేశారు. దహెగాం మండలం చంద్రపల్లి గ్రామానికి చెందిన మారుతి తాను ల్యాబ్ టెక్నీషియన్ కోర్సు పూర్తిచేసి ఉన్నందున వైద్యకళాశాలలో ఉపాధి కల్పించాలని అర్జీ సమర్పించారు. ఆసిఫాబాద్ మండలం ఇప్పల్ నవేగాం గ్రామానికి చెందిన విద్యాసాగర్ తనకు దివ్యాంగ పెన్షన్ ఇప్పించాలని దరఖాస్తు అందజేశారు. డీఎస్సీ-2024లో ఎంపికైన అభ్యర్థులు ఈనెల 9న హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి చేతుల మీదుగా నియామకపత్రాలు అందుకోను న్నందున అభ్యర్థులను తీసుకెళ్లేందుకు పూర్తిఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఎస్పీ డీవీ శ్రీనివాస్‌రావు, అదనపుకలెక్టర్ దీపక్‌తివారితో కలిసి టెలీకాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహిం చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లానుంచి అభ్యర్థులను తీసుకెళ్లేందుకు కండీషన్‌లో ఉన్న ఏడు బస్సులను సిద్ధంగా ఉంచాలని ఆర్టీసీ డిపోమేనేజర్‌ను ఆదేశించారు. అభ్యర్థులు అందరూ ముందురోజు 8వతేదీన సాయంత్రం వరకు జిల్లాకేంద్రానికి చేరుకునేలా చూడాలని జిల్లా గిరిజనాభివృద్ధి, విద్యాశాఖాధికారిని ఆదేశించారు. 9న ఉదయం 4గంటలకు బస్సులు బయలు దేరాలని ఆదేశించారు. అభ్యర్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సురక్షితంగా హైదరాబాద్‌కు తీసు కెళ్లి నియామకపత్రాలు తీసుకున్న తరువాత తిరిగి ఇంటికి చేరుకునేలా చూడాలన్నారు.

# బీఆరెస్స్, నాగార్జున, సమంతపై బీజేపీ ఎంపీ సంచలన వ్యాఖ్యలు!



**హైదరాబాద్-నవభూమి:** హైడ్రా అధికారులు ఎన్-కన్వెషన్ కూల్చి వేసినప్పటి నుంచి తెలంగాణ రాజకీయా ల్లో అక్కినేని ఫ్యామిలీ, బీఆరెస్స్ పార్టీ, కాంగ్రెస్ పార్టీ, బీజేపీ నేతల మధ్య ఆసక్తికర చర్చ జరుగుతున్న సంగతి తెలిసిందే. ప్రధానంగా కేటీఆర్ పై విమర్శలు గుప్పించే క్రమంలో సమంత-నాగ చైతన్య మధ్య విడాకుల అంశాన్ని కొండా సురేఖ ప్రస్తావించడంతో ఈ వ్యవహారం రకరకాల టర్న్ తీసుకుంటుంది! ఇలా కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలపై అటు సినీ, రాజకీయ ప్రముఖులు స్ట్రాంగ్ గా రియాక్ట్ అయ్యారు. ఈ వ్యవహారం ఇప్పుడు కోర్టుకుని చేరుకున్న పరిస్థితి. ఈ నేపథ్యంలో... బీజేపీ ఎంపీ రఘునందన్ రావు తాజాగా గత బీఆరెస్స్ ప్రభుత్వం, అక్కినేని కుటుంబం, సమంత తెలంగాణ చేనేతకు బ్రాండ్ అంబాసిడర్ గా ఉండటం మొదలైన విషయాలపై స్పందించారు! అవును... ఇప్పటికే బీఆరెస్స్ వర్కింగ్ ప్రెసిడెంట్, అక్కినేని కుటుంబంపై మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యల వ్యవహారం తీవ్ర చర్చనీయాంశం అవుతున్న నేపథ్యంలో... బీజేపీ నేత రఘునందన్ రావుకు సంబంధించిన వీడియో ఒకటి ఇప్పుడు నెట్టింట వైరల్ గా మారింది. ఈ సందర్భంగా స్పందించిన రఘునందన్ రావు... నాగార్జున కుటుంబానికి చెందిన ఎన్-కన్వెషన్ సెంటర్ ను హైడ్రా కూల్చివేయడంపై మాట్లాడారు. ఇందులో భాగంగా... తుమ్మిడి కుంట చెరువులోని 3 ఎకరాల 30 కుంటలను ఆక్రమించి నిర్మాణం చేపట్టారని హైడ్రా ఆరోపిస్తుందని అన్నారు! అనంతరం... తెలంగాణలో పదేళ్ల పాటు అధికారంలో ఉన్న బీఆరెస్స్ పార్టీ ఎన్-కన్వెషన్ ఆక్రమణలపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఎన్-కన్వెషన్ ఉన్న ప్రాంతాన్ని సర్వే చేయాలని ఉమ్మడి ఏపీ హైకోర్టు 2014లోనే చెప్పిందని.. హెచ్.ఎం.డీ.ఏ. 2016లో ఈ మేరకు నివేదికను సమర్పించిందని.. 2016 నుంచి నేటి వరకూ ఎన్-కన్వెషన్ ను ఎందుకు కూలగొట్టలేదని అడిగారు! ఇంతలో నాగార్జున మాజీ కోడలు చేనేతకు బ్రాండ్ అంబాసిడర్ అయ్యిందని.. ఆమెకు చేనేత తెలియదు, చీర తెలియదని రఘునందన్ కామెంట్ చేశారు. ఆ సంబంధాలు ఏమిటో వాళ్లే చెప్పాలని.. వాళ్లకు ఆ రంగుల లోకంతో ఉన్న రక్త సంబంధం ఏంటో వాళ్లు చెబితేనే బాగుంటుందని ఆయన వ్యాఖ్యానించారు.

## బాబుకు విన్నపం: చేతులెత్తేయడం కాదు.. చేతల్లో చూపించాలి..!

**హైదరాబాద్-నవభూమి:** గత రెండు రోజులుగా రాష్ట్రంలో విద్యుత్ ధరలు పెరుగుతున్నాయని.. దీనికి కారణం వైసీపీ పాలనేనని పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. రెండు రకాలుగా విద్యుత్ చార్జీలు పెరగబోతున్నాయని ప్రభుత్వ అనుకూల మీడియా సంస్థలే వెల్లడిస్తున్నాయి. ఒకటి డిజిటల్ మీటర్ల కోసం చేసుకున్న ఒప్పందం మేరకు భారం పడుతోందని అంటున్నారు. అదేసమయంలో సౌర విద్యుత్‌కు సంబంధించి కూడా జగన్ సర్కారు ఒప్పందం చేసుకుంది. అంటే.. ఇటు జల విద్యుత్‌కు, అటు సౌర విద్యుత్‌కు సంబంధించి కూడా వినియోగదారులపై వచ్చే రోజుల్లో భారం పడనుందన్నది అందరూ చెబుతున్న మాట. అయితే.. దీనిని జగన్‌పై తోసేసి.. గత సర్కారు చేసుకున్న ఒప్పందాల ఫలితంగానే ఇప్పుడు ప్రజలపై భారం పడుతోందని కూటమి సర్కారు చెబుతుండడమే విరుద్ధంగా ఉంది. ఎందుకంటే.. ఎలాం టి ఒప్పందం అయినా.. సమీ క్షించేందుకు ప్రతి ప్రభుత్వా నికీ అవకాశం ఉంది. ఒకవేళ అలా కూడా అవకా శం లేకపోతే.. కోర్టులకు వెళ్లొచ్చు. ట్రైబ్యునళ్లకు కూ డా వెళ్లచ్చు. కానీ, అసలు ఈ భారం నుంచి ప్రజలకు విముక్తి కల్పించేలా చర్యలు తీసుకోకుండా.. కేవలం వైసీపీపై నెపం నెట్టేస్తుం డడమే ఇక్కడ చర్చకు దారి తీస్తున్న విషయం. అసలు రెండు ఒప్పందాలు ఏంటి..? 1)



డిజిటల్ మీటర్లను ఏర్పాటు చేయడం: ఈ ఒప్పందం గత వైసీపీ హయాం లోనే జరిగింది. ప్రముఖ వ్యాపార వేత్త అదానీ తోనే ఈ ఒప్పందం చేసుకున్నారు. ఆయన విదే శీయుడు కాదు. భారతీయుడు. పైగా.. దేశంలో అనేక వ్యాపారాలు కూడా ఉన్నాయి. మన రాష్ట్రంలోనే అనేక పోర్టులు కూడా ఆయన నిర్వ హణలోనే ఉన్నాయి. వీటిని కేంద్రమే అప్పగిం చింది. అలాంటప్పుడు డిజిటల్ మీటర్ల వల్ల ప్రజ లకు నష్టం వస్తున్నప్పుడు.. ఆయనను కూర్చో బెట్టి.. ఒప్పందాన్ని సమీక్షించు కునే అవకాశం ప్రభుత్వానికి లేదా? అంటే.. ఖచ్చితంగా ఉంటుంది. ఒకవేళ లేకపోయినా.. న్యాయ స్థానాన్ని ఆశ్రయించుకుని రద్దు చేసుకోవచ్చు. లేదా.. మార్పులు చేసుకోవచ్చు. ప్రజలపై భారం తగ్గించవచ్చు. కానీ.. సర్కారు ఆ దిశగా అడుగులు వేయలేదు. 2) సౌర విద్యుత్: వైసీపీ హయాంలోనే ఈ ఒప్పందం కూడా జరిగింది. ఇది పూర్తిగా సౌర విద్యుత్‌కు సంబంధించిన ఒప్పందం. దీనిని నేరుగా ప్రభుత్వ రంగ సంస్థ సోలార్ ఎనర్జీ కార్పొరేషన్‌తోనే జగన్ ఒప్పందం చేసుకున్నారు. ఆదిలో ఈ సంస్థ తక్కువ ధరలకే సౌర విద్యుత్ ఇస్తామని అందరికీ చెప్పింది. ఏపీతోపాటు తమిళనాడు, కర్ణాటక, కేరళ రాష్ట్రాలు కూడా ఒప్పందం చేసుకున్నాయి. అయితే.. మధ్యలో కేంద్రం ఈ విధానాన్ని సమీక్షించి.. జీఎస్టీ విధించింది. అదేవిధంగా మిగులు పరికరాల ఖర్చును కూడా మోపింది. దీంతో యూనిట్ రూ.2.65 నుంచి రూ.6.4 వరకు పెరిగింది. సో.. ఇది కూడా ఏపీ ప్రజలకు భారమే అయితే.. దీనిని రద్దు చేసుకునే అవకాశం ఉంది. కేంద్ర ప్రభుత్వంతో చర్చించి.. మాకు ఈ ధరలకు అవసరం లేదు.. అని చెప్పడం ద్వారా అవకాశం ఉన్నప్పటికీ చేయడం లేదు. ఎందుకు..? జల విద్యుత్ డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో ఇప్పుడు సౌర విద్యుత్ ఒప్పందం రద్దు చేసుకునే పరిస్థితి లేదు. ఇదొక కారణం. ఇక, డిజిటల్ మీటర్లను పెట్టుకుంటే.. కేంద్రం అప్పుల రూపంలో ఇచ్చే వెసులు బాటు వచ్చే 25 సంవత్సరాల వరకు వినియోగిం చుకునే అవకాశం ఉంది. ఈ రెండు కారణాలే.. అప్పుడు జగన్‌కైనా.. ఇప్పుడు కూటమికైనా కలిసి వస్తున్నాయి. ఇదే సమయంలో జగన్‌పై నెట్టేయడం ద్వారా కూటమికి రాజకీయ ప్రయోజనం కూడా దక్కనుంది.

# సైకిలెక్కనున్న ముగ్గురు ఎమ్మెల్యేలు?

**(1వపేజీ తరువాయి)**జరిగింది. ఇక బీజేపీతో నూ మంతనాలు జరిపినా ఆ పార్టీ నుంచి రూట్ క్లియర్ కాకపోవడంతో ఆయన ఆగిపోయారనే టాక్ వినిపించింది. ఈ నేపథ్యంలో ఏపీలో చంద్రబాబు ముఖ్యమంత్రి కావడం, తాను గతంలో టీడీపీ నుంచే ఎంపీగా గెలవడంతో చంద్రబాబుతో ఉన్న పరిచయం కారణంగా ఆయన పార్టీలో చేరేందుకు ప్రయత్నాలు సాగిస్తున్నట్లు ప్రచారం చాలా రోజులుగా జరుగుతోంది. ఈ వాదనకు బలం చేకూరేలా ఇవాళ తన అల్లుడితో పాటు చంద్రబాబుతో భేటీ కావడం, మల్లారెడ్డి సమక్షంలోనే తీగల తాను పార్టీ మారబోతున్నట్లు ప్రకటించడం సంచలనంగా మారింది. అయితే మూడు రోజుల క్రితమే మల్లారెడ్డి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తో భేటీ అయ్యారు. తాజాగా తన అల్లుడితో కలిసి టీడీపీ అధినేతను కలిసి తన మనవరాలి వివాహానికి ఆహ్వానించారు. ఈ క్రమంలోనే తాను వెడ్డింగ్ కార్డు ఇచ్చేందుకే చంద్రబాబుతో భేటీ అయ్యానని మల్లారెడ్డి క్లారిటీ ఇచ్చారు. అయితే రాష్ట్రంలో ఉన్న రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో ఇంట్లో జరగబోయే శుభకార్యం అనంతం మల్లారెడ్డి రాజకీయంగా ఏదైనా సంచలన నిర్ణయం తీసుకోబోతున్నారా? అనేది పొలిటికల్ కారిడార్ లో చర్చగా మారింది.

**'స్థానిక' ఎన్నికల వేళ సంచలన పరిణామం:**
గత కొంత కాలంగా తెలంగాణ రాజకీయాల్లో ట్రయాంగిల్ ఫైట్ నడుస్తోంది. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీలు నువ్వా నేనా అన్నట్లుగా వ్యూహాలు రచిస్తున్నాయి. ఈ క్రమంలో తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో టీడీపీ పోటీ చేయబోతున్నదని ఇందుకు శ్రేణులంతా సిద్ధంగా ఉండాలని గత జూన్ లోనే పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు క్లారిటీ ఇచ్చారు. తెలంగాణలోని పార్టీ నేతలతో సమావేశమైన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. త్వరలోనే టీ టీడీపీకి అధ్యక్షుడిని నియమిస్తానని పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ నేపథ్యంలో పలువురు కీలక నేతలు టీడీపీ వైపు చూస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇంతలో గత కొంత కాలంగా బీఆర్ఎస్ లో అసంతృప్త రాగం ఆలపిస్తున్న తీగల కృష్ణారెడ్డి తాను టీడీపీలో చేరుతానని ప్రకటించడం, మల్లారెడ్డి వంటి నేతలు సైతం పార్టీ మారుతారనే ప్రచారం జరుగుతుండటంతో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల వేళ తెలంగాణ రాజకీయాల్లో అనేక సంచలనాలు నమోదు కాబోతున్నాయనే చర్చ జోరందుకుంది.

# గుఢాచారి రా..బంధు!

**(1వపేజీ తరువాయి)**జిపిఎస్ ట్రాకర్ ఉన్నాయి. దాని ద్వారానే పోలీసులు మావోయిస్టుల జాడ పసిగట్టాయని మానవ హక్కుల సంఘం నేతలు ఆరోపిస్తున్నారు. అయితే అప్పట్లో రాబందు ఫోటో సోషల్ మీడియాలో సంచలనంగా మారింది. చర్లలో సంచరిస్తున్న సమయంలో అటవీశాఖ అధికారులు దాన్ని పట్టుకున్నారు. ఆ తర్వాత దానిని గిరిజనులకు అప్పగించారు. గిరిజనులు దాన్ని విడిచిపెట్టారు. ఆ పక్షిని పట్టుకోడానికి అటవీ, పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు అనేక రకాల ఇబ్బందులు పడ్డారు. అయితే ఆ రాబందు మధ్యప్రదేశ్లోని పెన్నా టైగర్ జోన్ లోని వల్చర్ పాయింట్ నుంచి ఈ ప్రాంతానికి వచ్చినట్టు తెలుస్తోంది.
సాధారణంగా రాబందు మృతదేహాల కోసం అన్వేషణ సాగిస్తూ ఉంటుంది. మృతదేహం దొరికితే అది ఆహారం సేకరిస్తూ ఉంటుంది. కానీ రాబందు చర్లలోని ఏకలవ్య పాఠశాల నిర్మాణం జరుగుతున్న ప్రాంతం వద్దే ఉండడం అనుమానాలు వ్యక్తమవుతున్నాయని మానవ హక్కుల సంఘం నాయకులు చెబుతున్నారు. మావోయిస్టుల జాడ పసిగట్టడానికే భద్రత దళాలు ఆ రాబందుకు కెమెరా, జిపిఎస్ ట్రాకర్ ఏర్పాటు చేశారని పౌరహక్కుల సంఘాల నాయకులు అనుమానిస్తున్నారు. చర్ల మండలంలో రాబందు ప్రత్యక్షం కావడం ఒక్కసారిగా సంచలనంగా మారింది. అయితే ఆ రాబందు ఫోటోను పోలీసులు, పౌర హక్కుల సంఘాల నాయకులు జాగ్రత్తగా పరిశీలించడంతో అనేక విషయాలు తెరపైకి వచ్చాయి. ఇక దండకారణ్యంలో మావోయిస్టుల ఏరివేత లక్ష్యంగా కేంద్ర బలగాలు జల్లుల పడుతున్నాయి. గతంలో మావోయిస్టులు ఏర్పాటు చేసిన ల్యాండ్ మైన్ ల వల్ల కేంద్ర బలగాలు భారీగా నష్టపోయాయి. అయితే ఈసారి మావోయిస్టుల ట్రాప్ లో పడకుండా సరికొత్త విధానాలను కేంద్ర బలగాలు అమలు చేస్తున్నాయి. ఇందులో భాగంగా అత్యధిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నాయి. డ్రోన్ ల ద్వారా అడవుల్లో మావోయిస్టుల కదలికలను పసిగడుతున్నాయి. ఇక తాజా ఎన్ కౌంటర్ ద్వారా మావోయిస్టులు భయపడిపోతున్నారు. అయితే మావోయిస్టుల వద్ద సరైన సమాచార వ్యవస్థ లేదు. గూడచార వనరులు కూడా లేవు. అందువల్లే ఇటీవలి ఎన్కౌంటర్లో 31 మంది మావోయిస్టులు చనిపోయారు. గడచిన 11 రోజుల్లో ఇది మూడవ ఎన్కౌంటర్ కావడం విశేషం. సెప్టెంబర్ 24న కూడా సుకుమార్ జిల్లాలో ఎదురు కాల్పులు చోటు చేసుకున్నాయి. ఈ ఘటనలో ఇద్దరు మావోయిస్టులు చనిపోయారు. అయితే వారి మృతదేహాలను సహచర మావోయిస్టులు ఎత్తుకెళ్లారని తెలుస్తోంది. వాస్తవానికి మావోయిస్టులు అడవుల్లో సమావేశాలు నిర్వహిస్తున్నప్పుడు.. ముప్పును ముందే పసిగడతారు. అయితే భారీగా వర్షం కురవడంతో పర్వతం మీద ఆగారని తెలుస్తోంది.. వర్షం తగ్గే వరకు అక్కడే ఉన్నారని సమాచారం. అంతటి వర్షం కురుస్తున్నప్పటికీ మావోయిస్టులు పహారా విషయంలో జాగ్రత్తగా ఉంటారు. మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న శత్రువుని సైతం పసిగడతారు. అయితే 10 కిలోమీటర్ల చిత్తడి నేలలు విస్తరించిన ప్రాంతంలో 1500 మందికి పైగా బలగాలు అందులోకి ప్రవేశించాయంటే.. పకడ్బందీ సమాచారంతోనే వారు అక్కడికి వెళ్లి ఉంటారని పౌర హక్కుల సంఘాల ప్రతినిధులు చెబుతున్నారు.

## వరద సాయం పెంచండి

**(1వపేజీ తరువాయి)** రాష్ట్ర విభజన సమయంలో తెలంగాణకు 76 ఐపీఎస్ పోస్టుల్ని కేంద్రం (ప్రత్యూష్ సిన్హా కమిటీ) అలాట్ చేసిందని, ప్రస్తుత అవసరాలకు ఈ సంఖ్య సరిపోదని, అదనంగా 29 ఐపీఎస్ పోస్టుల్ని కేటాయించాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. ఐపీఎస్ క్యాడర్‌పై రివ్యూ చేపట్టాలని గతంలోనే కోరామని, అది పెండింగ్‌లోనే ఉన్నదని తెలిపారు. ఇప్పుడైనా రివ్యూ చేసి అవసరాలకు అనుగుణంగా 29 ఐపీఎస్ పోస్టుల్ని కేటాయించాలన్నారు. ఈ సమావేశంలో నల్లగొండ ఎంపీ రఘువీర్ రెడ్డి, ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి జితేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి శేషాద్రి, డీజీపీ జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

**పునర్విభజన సమస్యలను వెంటనే సాల్వ్ చేయండి :**
పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర పునర్విభజన సమస్యల పరిష్కారానికి సహకరించాలని కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. చట్టంలోని తొమ్మిదవ షెడ్యూల్‌లోని (53, 68, 71 సెక్షన్లు) ప్రభుత్వ భవనాలు, కార్పొరేషన్ల పంపిణీ, షెడ్యూల్ పదిలోని సంస్థల వివాదం (75 సెక్షన్) సామరస్యపూర్వక పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. పునర్విభజన చట్టంలో ఎక్కడా పేర్కొనని ఆస్తులు, సంస్థలను ఆంధ్రప్రదేశ్ క్లెయిమ్ చేసుకుంటున్నందున, వాటిలో తెలంగాణకు న్యాయం జరిగేలా చూడాలని విజ్ఞప్తి చేశారు.

## విన్నపాలు వినవలె

**(1వపేజీ తరువాయి)** చంద్రబాబు తిరుమల లడ్డూను అందించారు. రాష్ట్రంలో ప్రస్తుతం పెండింగ్ సమస్యలుగా ఉన్న అమరావతికి ప్రపంచ బ్యాంకు రుణం, పోలవరం జాతీయ ప్రాజెక్టుకు సాయం, విశాఖ స్టీల్ ప్లాంట్ ను సెయిల్ లో విలీనం చేసే ప్రతిపాదనపై ప్రధాని మోడీతో చంద్రబాబు చర్చించారు. ప్రపంచ బ్యాంక్ రుణంపై సూత్రప్రాయంగా ఆమోదం లభించిన నేపథ్యంలో కేంద్రం వైపు నుంచి తీసుకోవాల్సిన ఇతర చర్యలపై చంద్రబాబు చర్చించారు. అలాగే పోలవరం ప్రాజెక్టుకు తాజాగా ప్రతిపాదించిన రీయింబర్స్ మెంట్ మొత్తం విడుదలపైనా చర్చలు జరిగాయని తెలుస్తోంది. దీంతో పాటు విశాఖ స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటీకరణ కాకుండా సెయిల్ లో విలీనం చేసేందుకు వచ్చిన ప్రతిపాదనల్ని ఆమోదించేలా చంద్రబాబు ప్రధాని మోడీని కోరినట్లు తెలుస్తోంది. అయితే దీనిపై త్వరలో కేంద్రం ఓ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. మరోవైపు రాష్ట్రంలో ఇన్ ఫ్రా ప్రాజెక్టులకు కావాల్సిన సాయంపైనా చంద్రబాబు ప్రధాని మోడీ ముందు ప్రతిపాదనలు పెట్టినట్లు తెలుస్తోంది. వీటిపై ఇతర కేంద్రమంత్రులతో మాట్లాడాలని ప్రధాని మోడీ సూచించినట్లు సమాచారం. రేపు కూడా చంద్రబాబు ఢిల్లీలోనే ఉండి పలువురు కేంద్రమంత్రులతో భేటీ అవుతారు.

## ఏపీలో కొత్త జిల్లాలు?

**(1వపేజీ తరువాయి)** ఈ నేపథ్యంలో కొత్త జిల్లాల ఏర్పాటుతోపాటు ప్రస్తుతం ఉన్న జిల్లాల్లో మార్పులు చేయబోతున్నట్లు ప్రచారం జరుగుతున్నది. కొత్తగా మరో నాలుగు జిల్లాను ఏర్పాటు చేసి రాష్ట్రాన్ని 30 జిల్లాలుగా పునర్నిర్మాణం చేస్తారని సోషల్ మీడియాలో ఓ పోస్టు జోరుగా సర్కులేట్ అవుతున్నది. దాని ప్రకారం పలాస, నాగావళి, నూజివీడు, తెనాలి, అమరరామ, మార్కాపురం, మదనపల్లి, హిందూపురం, ఆదోని జిల్లాలను కొత్తగా ఏర్పాటు చేయనున్నారు. ఎన్టీఆర్ స్వస్థలం నిమ్మకూరు ఉన్న ప్రాంతానికి ఎన్టీఆర్ మచిలీపట్నం జిల్లాగా మార్చనున్నారని, ప్రస్తుతం ఉన్న ఎన్టీఆర్ జిల్లా ఇకపై కృష్ణా జిల్లా, వైఎస్సాఆర్ జిల్లాకు వైఎస్సార్ కడప జిల్లాగా పేరు మార్చనున్నారు. రాష్ట్రాన్ని ఐదు క్లస్టర్లుగా విభజించనున్నట్లు అందులో ప్రస్తావించారు. అయితే కొత్త జిల్లాల ఏర్పాటు, ప్రస్తుతం ఉన్న జిల్లాలను రద్దు చేస్తారనే ప్రచారంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున ఫ్యాక్ట్ చెక్ టీమ్ స్పందించింది. 'ఒక సామాన్యుడు ఇచ్చిన సలహాని, ప్రభుత్వ నిర్ణయంగా ప్రకటిస్తూ, సమాజంలో అశాంతి రేపడానికి కొంత మంది అల్లరి మూకలు తప్పుడు ప్రచారం చేస్తున్నారు. అనకాపల్లి జిల్లా రద్దు చేస్తున్నారు అనేది పూర్తిగా అవాస్తవం' అంటూ ఎక్స్ వేదికగా ట్వీట్ చేసింది. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న డాక్యుమెంట్‌ను ఎవరూ నమ్మొద్దని కోరింది. ఈ జిల్లాల అంశంలో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని వెల్లడించింది.

## మద్యం షాపులపై ఎమ్మెల్యేల కన్ను

**(1వపేజీ తరువాయి)**కొందరు ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు వ్యాపారులకు హెచ్చరిస్తున్నట్లు తెలుస్తోంది. మరికొందరైతే తాము ఒక్క రూపాయి కూడా పెట్టుబడి పెట్టమని.. కానీ తమకు వాటా మాత్రం కావాలని అంటున్నారట. దానికి ఒకే అయితేనే దరఖాస్తు పెట్టుకోవాలని చెబుతున్నారట. అలా కాదూ.. కూడదు అనుకుంటే మాత్రం.. తర్వాత పరిణామాలు చాలా దారుణంగా ఉంటాయని హెచ్చరిస్తూ బెదిరిస్తున్నారని సమాచారం.


**ఈ జిల్లాలో షాపులకు ఒక్క దరఖాస్తు కూడా రాలేదు**
దీని కారణంగానే ఇప్పటి వరకు కొన్ని షాపులకు ఒక్క అర్జీ కూడా రాలేదని తెలుస్తోంది. వీటిలో తిరుపతి జిల్లాలోని 133 దుకాణాలకు గానూ ఒక్క దరఖాస్తు రాలేదు. అలాగే నెల్లూరులో 84, ప్రకాశంలో 60, విశాఖపట్నంలో 60, కాకినాడలో 58, సత్యసాయి జిల్లాలో 60 దుకాణాలకు గానూ ఒక్కటంటే ఒక్క దరఖాస్తు రాలేదు.

ఈ జిల్లాలో దరఖాస్తులు అధికం
విజయనగరం జిల్లాలో మొత్తం 153 దుకాణాలు ఉన్నాయి. అందులో 5 మినహా మిగతా వాటికి రాష్ట్రంలోనే అత్యధికంగా 855 అప్లికేషన్లు వచ్చాయి. అలాగే ఏలూరు జిల్లాలో 144 షాపులు ఉండగా.. 706 అర్జీలు వచ్చాయి. అందులో 16 షాపులకు ఒక్క అప్లికేషన్ కూడా రాలేదు. ఇంకా ఎన్టీఆర్ జిల్లాలో 113 దుకాణాలు ఉండగా.. 613 అర్జీలు అందాయి.

**అంచనా లక్ష.. వచ్చింది 8,274 మాత్రమే..**
రాష్ట్రంలో 3,396 మద్యం షాపులకు ప్రభుత్వం లైసెన్సుల జారీ కోసం నోటిఫికేషన్ రిలీజ్ చేసింది. అందులో ఒక్కో షాపుకి సగటున 30 చొప్పున సుమారు 1లక్షకు పైగా అప్లికేషన్లు వస్తాయని ప్రభుత్వం భావించింది. అదే సమయంలో నాన్ రిఫండబుల్ ఫీజుల రూపంలో దాదాపు రూ.2000 కోట్ల వరకూ ఆదాయం వచ్చే అవకాశం ఉందని అంచనా వేసింది. కానీ ప్రభుత్వ అంచనాలు తలకిందులయ్యాయి.

భూమి అమ్మకం
షాద్‌నగర్ సమీపంలో 110 ఎకరాల భూమి అమ్మకానికి కలదు. క్లియర్ టైటిల్.
ఆసక్తి ఉన్న వారు వెంటనే సంప్రదించండి
9 2 4 6 2 1 3 4 9 3

నవభూమి
www.navabhoomi.in
www.epaper.navabhoomi.in
3 హైదరాబాద్ మంగళవారం 08 । అక్టోబర్ । 2024



## జార్కండ్‌లో ఎన్నార్సీని అమలు చేస్తాం: కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్



**రాంచీ-నవభూమి:** జార్కండ్‌లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్నాయి. దీంతో రాజకీయం వేడెక్కుతోంది. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర ఇన్‌ఛార్జ్ శివరాజ్ సింగ్ చౌహాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. జాతీయ పౌర రిజిస్టర్ (ఎన్నార్సీ)ను జార్కండ్‌లో అమలు చేస్తామని తెలిపారు. సీఎం హేమంత్ సోరెన్ నేతృత్వంలోని ప్రభుత్వం చొరబాటుదారులకు అనుకూలంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. సోమవారం శివరాజ్ సింగ్ చౌహాన్ ఏఎన్ఐ వార్తా సంస్థతో మాట్లాడారు. జార్కండ్‌లో ఎన్నికల మేనిఫెస్టోను బీజేపీ విడుదల చేయనున్నట్లు తెలిపారు. 'రోటీ, మాటి ఔర్ భేటీ' ని రక్షించాలని తాము నిర్ణయించినట్లు చెప్పారు.కాగా, ఒకరిని సీఎం చేయడమో లేక అధికారంలోకి రావడం కోసమో జార్కండ్ అసెంబ్లీ ఎన్నికలు కాదని శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. జార్కండ్‌ను రక్షించడం కోసమేనని అన్నారు. బంగ్లాదేశ్ నుంచి చొరబాటుదారుల కారణంగా ఈ రాష్ట్ర జనాభా వేగంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో సంతాల్ ప్రాంతంలో గిరిజన జనాభా 44 శాతానికి పైగా ఉండేదని తెలిపారు. అయితే చొరబాటుదారుల ప్రభావం వల్ల గిరిజన జనాభా 28 శాతానికి పడిపోయిందని చెప్పారు.మరోవైపు సీఎం హేమంత్ సోరెన్ చొరబాటుదారులకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారని శివరాజ్ సింగ్ చౌహాన్ ఆరోపించారు. 'హేమంత్ సోరెన్ ప్రభుత్వం ఓటు బ్యాంకు రాజకీయాల కోసం చొరబాటుదారులకు అనుకూలంగా ఉంది. అందుకే జార్కండ్‌లో ఎన్నార్సీని మేం అమలు చేస్తాం. దీనిలో స్థానిక నివాసితులను నమోదు చేస్తాం.

## 'బీజేపీతో చేతులు కలిపి నాటకాలాడుతున్నారు'..

### ప్రభుత్వం ఏర్పాటు చేయవద్దన్న రషీద్‌పై ఒమర్ అబ్దుల్లా మండిపాటు



**శ్రీనగర్: -నవభూమి:** జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించే వరకు ప్రభుత్వ ఏర్పాటును బహిష్కరించాలన్న అవామీ ఇత్తెహాద్ పార్టీ (ఏఐపీ) అధ్యక్షుడు షేక్ అబ్దుల్ రషీద్ పిలుపుపై నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ) నేత ఒమర్ అబ్దుల్లా మండిపడ్డారు. రషీద్ బీజేపీతో చేతులు కలిపి నాటకాలాడుతున్నారని విమర్శించారు. జమ్ముకశ్మీర్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేయకపోతే కేంద్ర పాలనను బీజేపీ పొడిగిస్తుందని అన్నారు. ఇంజినీర్ రషీద్‌గా పిలిచే బారాముల్లా ఎంపీ మీడియా సమావేశంపై ఒమర్ అబ్దుల్లా స్పందించారు. బీజేపీతో చేతులు కలిపి ఆయన నాటకాలాడుతున్నారని ఎక్స్‌లో విమర్శించారు. 'ఆ వ్యక్తి (రషీద్) 24 గంటలపాటు ఢిల్లీకి వెళ్లాడు. నేరుగా బీజేపీతో చేతులు కలిపి నాటకాలు ఆడేందుకు ఇక్కడి తిరిగి వచ్చాడు. తాము ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే స్థితిలో లేనట్లయితే, జమ్ముకశ్మీర్‌లో కేంద్ర పాలనను పొడిగించడం కంటే బీజేపీకి ఇంకేమీ ఇష్టం లేదు' అని ఆ ట్వీట్‌లో పేర్కొన్నారు.
కాగా, జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370ను 2019 ఆగస్ట్ 5న కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడంతోపాటు ఆ రాష్ట్రాన్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించింది. ఇది జరిగిన తర్వాత తొలిసారి, అలాగే పదేళ్ల విరామం తర్వాత జమ్ముకశ్మీర్ అసెంబ్లీకి ఎన్నికలు జరిగాయి. మరోవైపు జమ్ముకశ్మీర్‌తోపాటు హర్యానా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు మంగళవారం వెల్లడికానున్నాయి.

## ఆసుపత్రుల్లో వచ్చే బ్యాక్టీరియా ఇన్ ఫెక్షన్లు ఎంత డేంజరంటే?

**న్యూఢిల్లీ-నవభూమి:** ఆసుపత్రులకు వెళ్లే వేళ.. చిన్నపిల్లల్ని వెంట తీసుకెళ్లొద్దం టూ చెబుతుంటారు. కానీ.. కొందరు మాత్రం ఆ మాటల్ని పెద్దగా పట్టించు కోరు. అయితే.. ఆసుపత్రుల్లో బ్యాక్టీరి యా ఎంత డేంజర్ అన్న విషయం తాజాగా విడుదలైన భారత వైద్య పరిశోధన మండలి (ఐసీఎంఆర్) అధ్యయనం చెప్పేసింది.



ఆసుపత్రుల్లో వచ్చే బ్యాక్టీరియా ఇన్ ఫెక్షన్లు మొండిగా తయారవుతున్న విషయాన్ని వెల్లడించింది. భారతదేశంలోని ఆసుపత్రుల్లో ఇలాంటి పరిస్థితి ఉందని పేర్కొన్నారు. ఈ బ్యాక్టీరియాలు యాంటీబయాటిక్స్ చికిత్సకు సైతం లొంగట్లేదన్న నిజం వెల్లడైంది. రక్తంలో ఇన్ ఫెక్షన్లకు ప్రధానంగా కారణమయ్యేది క్లెబ్సియెల్లా నిమోనియే అని పేర్కొన్నారు. ఆసుపత్రుల్లో చేరిన 48 గంటల తర్వాత రోగులకు ఏదైనా ఇన్ ఫెక్షన్ తలెత్తితే దాన్ని సదరు ఆసుపత్రి కేంద్రంతో ముడిపడి ఉన్న ఇన్ ఫెక్షన్ గా పేర్కొంటారు. మనదేశంలోని 39 ఆసుపత్రులను పరిశీలించిన అనంతరం ఐసీఎంఆర్ ఒక రిపోర్టును తయారు చేసింది. ఇందులో బీఎస్ఐ.. మూత్రాశయ ఇన్ ఫెక్షన్లు.. వెంటిలేటర్ తో ముడిపడిన నిమోనియా లాంటి వ్యాధుల తీరు తెన్నులపై ఫోకస్ చేశారు. 'ఆ రోజు' వారిది కాదు.. దానికి ఏడాది గుర్తుగా క్షిపణుల వాన దీని ప్రకారం కొన్ని బ్యాక్టీరియాలు ఎంత ప్రమాదకరమైనవన్న విషయాన్ని గుర్తించారు. ఈకోలి బ్యాక్టీరియాతో వచ్చే రక్త సంబంధ ఇన్ ఫెక్షన్లకు చికిత్స చేయటానికి పిపెరాసిలిన్ - టాజో బయాక్టమ్ లాంటి యాంటీ బయాటిక్స్ ను వాడుతున్నారు. అయితే.. ఏడేళ్లుగా అవి ఆసుపత్రుల్లోని రోగులపై పని చేయటం లేదన్న విషయాన్ని గుర్తించారు. నిమోనియాకు యాసినెటోబ్యాక్టర్ ఎస్ పీపీ అనే బ్యాక్టీరియా కారణంగా తేల్చారు. మూత్రాశయ ఇన్ ఫెక్షన్లకు కారణమయ్యే ఈకోలి.. క్లెబ్సియెల్లా నిమోనియే.. యాసినెటోబ్యాక్టర్ బౌమానైల్లో యాంటీ బయాటిక్ నిరోధకత ఎక్కువగా కనిపిస్తోందని తేల్చారు. ఇవి కార్బాపెనెమ్ ఫ్లోరోక్వినోలోన్స్.. థర్డ్ జనరేషన్ సెఫాలో స్పోరిన్ అనే యాంటీబయాటిక్స్ కు లొంగట్లేదన్న విషయాన్ని గుర్తించారు. సో.. ఆసుపత్రులకు ఎంతో అవసరం తప్పించి.. వెళ్లొద్దు. ఒక వేళ వెళ్లినా తగిన జాగ్రత్తలు తీసుకోవటం మరవొద్దు.

## ఆ వ్యాపారవేత్త ఉదంతం విషాదాంతం.. ఎట్టకేలకు నదిలో దొరికిన మృతదేహం..!

**న్యూఢిల్లీ-నవభూమి:** కర్ణాటకలోని మంగళూరు నియోజకవర్గంలో అదృశ్యమైన ప్రముఖ వ్యాపారవేత్త బీఎం ముంతాజ్ అలీ (52) ఉదంతం విషాదాంతమైంది. ఫాల్గుణ నదిలో దాదాపు 12 గంటల గాలింపు అనంతరం కులూర్ వంతెన కింద ఆయన మృతదేహం లభ్యమైంది. ఆదివారం తెల్లవారుజామున కారులో ఇంటి నుంచి బయలుదేరిన ఆయన తిరిగి రాకపోవడం, ఉదయం కులూర్ వంతెనపైన ఆయన కారు పార్క్ చేసి ఉండటం, ఆ కారు ముందు భాగం డ్యామేజ్ అయ్యి ఉండటంతో.. కుటుంబసభ్యుల పోలీసులకు ఫిర్యాదు చేశారు.మంగళూరు మాజీ ఎమ్మెల్యే మెయిదీన్ బవ సోదరుడైన ముంతాజ్ ఆదివారం తెల్లవారుజామున తన కారులో ఇంటి నుంచి బయలుదేరాడు. ఆ తర్వాత ఇంటికి తిరిగిరాలేదు. ఫోన్ చేస్తే లిఫ్ట్ చేయలేదు. దాంతో కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులకు కులూరు వంతెన సమీపంలో ముంతాజ్ అలీకి చెందిన కారు ఉన్నట్లు సమాచారం వచ్చింది. దాంతో ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులకు ఆయన ఆచూకీ దొరకలేదు.దాంతో ఆయన నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడి ఉంటాడని అనుమానించారు. ఆ మేరకు ఫాల్గుణి నదిలిలో గాలింపు ఆపరేషన్ నిర్వహించారు. అలీ అదృశ్యంపై కావూరు పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు. అతడిని డబ్బుల కోసం బెదిరించడం, బ్లాక్‌మెయిల్ చేసిన ఆరోపణలపై ఓ మహిళతోపాటు ఆరుగురిని నిందితులుగా పేర్కొన్నారు. సోమవారం అలీ మృతదేహాన్ని వెలికితీసినట్లు మంగళూరు పోలీస్ కమిషనర్ అనుపమ్ అగర్వాల్ తెలిపారు.

## 'ఆ రోజు' వారిది కాదు.. దానికి ఏడాది గుర్తుగా క్షిపణుల వాన



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రపంచంలో టెక్నాలజీ పరంగా అత్యంత శక్తిమంతమైన ఆర్మీ ఉన్న దేశం అది.. శత్రెవు ఎక్కడ ఉన్నా పసిగట్టి హతమార్చే నిఘా వ్యవస్థ ఉన్న దేశం అది.. చుట్టూ ఎప్పుడూ ముప్పు పొంచి ఉన్నప్పటికీ.. ఎన్నో యుద్ధాల్లో గెలిచిన గొప్పదనం ఆ దేశానిది.. కానీ, ఆ రోజు మాత్రం వారిది కాలేకపోయింది. ఫలితంగా ఏడాది నుంచి రణరంగం సాగుతోంది. ఇదంతా ఇజ్రాయెల్ గురించి.. ఆ దేశం హమాస్-హెజ్బొల్లా-ఇరాన్ లపై సాగిస్తున్న యుద్ధం గురించి. గత ఏడాది అక్టోబరు 7న ఇజ్రాయెల్ లోకి గాజా నుంచి చొరబడిన హమాస్ ఉగ్రవాదులు అత్యంత పాశవికంగా దాడికి తెగబడిన సంగతి తెలిసిందే. ఆ తర్వాత రోజు నుంచి ఇజ్రాయెల్.. గాజాను లక్ష్యంగా చేసుకుంది. అయితే, హమాస్ పని పడుతున్నవారికి లెబనాన్ నుంచి హెజ్బొల్లాలు పెద్ద తలనొప్పిగా మారారు. ఈ రెండింటికి మద్దతు ఇస్తున్న ఇరాన్ పైనా పోరాటం చేయాల్సిన పరిస్థితి. యుద్ధం మొదలై ఏడాది అయిన సందర్భంగా ఇజ్రాయెల్ దాడుల తీవ్రత పెంచింది. అయితే, హెజ్‌బొల్లా కూడా క్షిపణులు ప్రయోగించింది. దీంతో ఇజ్రాయెల్ లో పలువురు గాయపడ్డారు. హైఫాపై మెరుపుదాడి ఇజ్రాయెల్ లోని మూడో అతిపెద్ద నగరం హైఫా. ఇది తీర నగరం. దీనిపై సోమవారం తెల్లవారుజామున.. హెజ్‌బొల్లా 'ఫాది 1' క్షిపణులను వింది. ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్ (ఐడీఎఫ్) స్థావరాన్ని లక్ష్యంగా చేసుకుంది. ఐదు రాకెట్లు వచ్చినట్లు ఇజ్రాయెల్ సైన్యం ధ్రువీకరించింది. మెయిన్ రోడ్డు, రెస్టారెంట్, ఇల్లు దెబ్బతిన్నట్లు వెల్లడించింది. మరోవైపు లెబనాన్ నుంచి ఆదివారం రాత్రి 130 పైగా రాకెట్లు ఇజ్రాయెల్ పైకి వచ్చాయి. వీటిని అడ్డుకున్నట్లు ఐడీఎఫ్ చెప్పింది. కాగా, బీరుట్ పై ఇజ్రాయెల్ సైన్యం విరుచుకుపడుతూనే ఉంది. ఆదివారం రాత్రి నుంచి 30 పైగా ప్రాంతాల్లో దాడులు చేసింది. కమలా హారిస్ సంచలన వ్యాఖ్యలు! అది వైఫల్యమే.. గత ఏడాది అక్టోబరు 7న హమాస్ దాడిని పసిగట్టడంలో విఫలమైనట్లు ఇజ్రాయెల్ సైన్యం అంగీకరించింది. ఆర్మీ చీఫ్ హెర్జి హలెవీ సోమవారం ఈ మేరకు ప్రత్యేక సందేశం విడుదల చేశారు. యుద్ధాన్ని సుదీర్ఘమైనది అభివర్ణించారు. సైనిక సామర్థ్యాన్ని.. మానసిక శక్తిని పరీక్షిస్తుందన్నారు. రోజు, వారం, నెల గడిచేకొద్దీ శత్రువుల పరిస్థితి ఘోరంగా మారుతోందని పేర్కొన్నారు. హమాస్ సైనిక విభాగాన్ని పూర్తిగా ఓడించామని.. హెజ్‌బొల్లా సీనియర్ నాయకత్వాన్ని తుడిచిపెట్టేశామని తెలిపారు. బందీల్లో మిగిలింది 97 మందే.. నిరుడు దాడి అనంతరం హమాస్ 200 మందిపైగా ఇజ్రాయెలీ, ఇతర దేశాల పౌరులను అపహరించింది. వారిలో కొందరిని విడుదల చేయగా.. 97 మంది మాత్రమే బతికి ఉన్నారని తెలిసింది. మరోవైపు గాజాలో 17 వేలమంది హమాస్ ఆపరేటివ్ లు, ఇజ్రాయెల్ లో వెయ్యి మంది ఉగ్రవాదులను హతమార్చినట్లు ప్రకటించింది. హమాస్ ను నాశనం చేశామని పేర్కొంది. గాజాలో 40,300 లక్ష్యాలపై దాడులు చేశామని తెలిపింది. 4,700 సొరంగ ప్రవేశమార్గాలను ధ్వంసం చేసినట్లు పేర్కొంది. ఈ నెల 8 నుంచి లెబనాన్ లోని హెజ్‌బొల్లా కూడా తమపై దాడులు మొదలుపెట్టిందని ఇజ్రాయెల్ సైన్యం చెప్పింది. ఎదురుదాడుల్లో ఆ సంస్థకు చెందిన 800 మందిని మట్టుబెట్టామని.. వీరిలో 90 మంది టాప్ కమాండర్లు ఉన్నట్లు తెలిపింది. 11 వేల హెజ్‌బొల్లా స్థావరాలను పేల్చేశామంది.

## కంటేనే అమ్మ అని అంటే ఎలా?... కమలా హారిస్ సంచలన వ్యాఖ్యలు!



**న్యూఢిల్లీ-నవభూమి:** అమెరికా అధ్యక్ష ఎన్నికలు సమీపిస్తున్న వేళ ప్రచార కార్యక్రమాలతో అగ్రరాజ్యం హోరెత్తిపోతుంది. విమర్శలు, ప్రతివిమర్శలతో రాజకీయ వాతావరణం వేడెక్కుతోంది. ఈ క్రమంలో సంతానం విషయంలో హారిస్ పై ఆర్కాన్సాస్ గవర్నర్ సారా హుకాబీ శాండర్స్ కీలక వ్యాఖ్యలు చేశారు. దీనికి వైస్ ప్రెసిడెంట్ కమలా హారిస్ స్ట్రాంగ్ రిప్లై ఇచ్చారు. అవును... హ్యారిస్ కు పిల్లలు లేరని, అందుకు ఆమె అణకువగా ఉండరని ఆర్కాన్సాస్ గవర్నర్ సారా హకబీ శాండర్స్ వ్యాఖ్యనించారు. దీనిపై కమలా హారిస్ ఎదురాడి చేశారు. ఇందులో భాగంగా... ఇక్కడ చాలా మంది మహిళలు ఉన్నారనే విషయం సారా అర్థం చేసుకొలేకపోయినట్లు తాను భావిస్తున్నానని అన్నారు. ఇది 1950ల నాటి కాలం కాదని.. కుటుంబం అనేది రకరకాలుగా ఏర్పడుతుందని.. కాల్ హర్ డాడీ పోడ్ కాట్ హోస్ట్ అలెక్స్ కూపర్ తో హారిస్ అన్నారు. ఆదివారం ప్రసారమైన టేప్ చేసిన ఇంటర్వ్యూలో ఆమె ఈ మేరకు స్పందించారు. మనం రక్తం ద్వారా కుటుంబాన్ని కలిగి ఉన్నామని, ప్రేమ ద్వారా కూడా కలిగి ఉన్నామని.. తనకు రెండూ ఉన్నాయని హారిస్ స్పష్టం చేశారు. తన భర్త డగ్ ఎమ్ హోఫ్ కు ఉన్న ఇద్దరు పిల్లలకు సవతి తల్లి అయిన తాను దానిని నిజమైన ఆశీర్వాదం భావిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆ ఇద్దరు పిల్లలు కోల్, ఎల్లా లతో తన సంబంధాన్ని హారిస్ వివరించారు. వారి తన భర్త మొదటి వివాహం నుంచి వచ్చిన జీవసంబంధ పిల్లలని.. "వారు నా పిల్లలు, నేను మరణం వరకూ వారిని ప్రేమిస్తాను" అని హారిస్ తెలిపారు. దానికి ఏడాది గుర్తుగా క్షిపణుల వాన కాగా... ట్రంప్ సహచరుడు ఓహియోకు చెందిన జేడీ వాన్స్ కూడా ఇదే ప్రతిపాదికన మహిళలపై కామెంట్లు చేశారు. ఇందులో భాగంగా... 2021లో జీవసంబంధమైన పిల్లలు లేని డెమోక్రట్ లు " పిల్లలు లేని పిల్లి స్త్రీల సమూహం" అంటూ కామెంట్ చేశారు. ఈ వ్యాఖ్యలపైనా ఘాటుగా స్పందించారు కమల హారిస్. ఇందులో భాగంగా... సహజంగా గర్భం దాల్చలేని, పిల్లలను కనలేని మహిళలకు వాన్స్ వ్యాఖ్యలు ఏమి సందేహం పంపాయో చెప్పాలని అడిగారు. ఇవి నీచమైన వ్యాఖ్యలుగా తాను భావిస్తున్నట్లు పేర్కొన్నారు.

## ఏపీలో ఎమ్మెల్యేలు...మద్యం దుకాణానికి బెదిరింపులు ?



**న్యూఢిల్లీ-నవభూమి:** గత ప్రభుత్వం మద్యం వ్యాపారం చేసింది. తానే స్వయంగా మద్యం దుకాణాలను పెట్టించి తమకు నచ్చిన బ్రాండ్లు తెచ్చి మరీ కొనిపించి తాగించింది. ఇక్కడ వేల కోట్ల వ్యాపారం జరిగింది అని ఖజానాకు చేరకుండా మధ్యలో నొక్కేశారు అన్న విమర్శలు నాడు విపక్షాలు చేశాయి. దానికి కారణం డిజిటల్ పేమెంట్లు లేకుండా కరెన్సీ తో కథ అంతా నడిపించారు. దాంతో ఖజానాకు నికరంగా ఎంత మొత్తం చేరింది అన్నది లెక్కలేదు, దీనినే ఏపీ లిక్కర్ స్కాం అంటూ విపక్షాలు పెద్ద నోరు చేశాయి. ఒక వైపు గత ప్రభుత్వం లిక్కర్ స్కాం మీద దర్యాప్తు చేపడతామని చెబుతూ టీడీపీ కూటమి ప్రభుత్వం కొత్త పాలసీని తెచ్చింది. నిజానికి ఇది పాత పాలసీయే. ప్రభుత్వం మద్యం షాపులకు వేలం వేయడం పాట పాడుకున్న ప్రైవేట్ వ్యాపారులు వాటిని నిర్వహించడం అన్న మాట. ఇది ఎప్పటి నుంచో సాగుతున్న విధానమే. అయితే ఇందులోనూ స్కాములు స్కీములూ బోలెడు ఉన్నాయి. ఇక ఈసారి చూస్తే ఇంకా వేలం పాటలకు దరఖాస్తుల దగ్గరే మ్యాటర్ సీరియస్ అవుతోంది. ఏ ఏరియాకు ఆ ఏరియాలో ఎమ్మెల్యేలు వారి అనుచరులు దందాలు చేస్తూ మద్యం దుకాణాల కోసం దరఖాస్తు చేద్దామనుకుంటున్న వ్యాపారులను బెదిరిస్తున్నారు అని ప్రచారం అయితే గట్టిగా సాగుతోంది. మా ఏరియాలో మద్యం వ్యాపారం చేయాలి అంటే ముడుపులు ముందుగా మాకే చెల్లించుకోండి. ఆ మీదట నీ వ్యాపారం చేసుకో అన్న బెదిరింపులు ఒక ఎత్తు అయితే మద్యం వ్యాపారంలో షేర్లు ఇవ్వాల్సిందే అన్నది మరో కండిషన్. ఇంకో వైపు చూస్తే అసలు మీరు ఎవరు దరఖాస్తు చేయడానికి మా వాళ్ళు అన్నీ చూసుకుంటారులే మీరు గమ్మున ఉండండి అని ఒక సీటేస్ట్ హాటెస్ట్ వార్నింగ్ కూడా వెళ్తోందిట. దాంతో మద్యం వ్యాపారులు దరఖాస్తులు చేసేందుకే జంకుతున్నారు అని అంటున్నారు. అసలే వేలం పాటల రూపంలో సర్కార్ భారీ ఎత్తున ఒక్కో ఏరియాకు ఇంత అంటూ రేటు పెంచేసింది. ఆ మీదట బిజినెస్ చేయాలి అంటే లాభం ఉండాలి కదా. ఈ మధ్యలో అందరికీ ముడుపులు కడుతూ పోతే నెత్తిన కొంగేసుకోవడమే అని ఏ లెక్కా కట్టకుండానే అర్థం అయిన వారు అంతా గప్ చుప్ అని సైడ్ అయిపోతున్నారుట. మరో వైపు చూస్తే తమకు మద్యం వ్యాపారాలలో మెలకువలు తెలుసు. లాభం ఎలా గడించాలో కూడా తెలుసు. వ్యాపారం చేయాలన్న ఆసక్తి ఉంది. కానీ ఈ బెదిరింపులేంటి అన్నదే వారిని మధన పెడుతోందిట. ఇపుడే ఇలా ఉంటే తీరా బిజినెస్ స్టార్ట్ చేస్తే ప్రతీ రోజూ ఈ దందాల తలనొప్పి ఎవరు పడతారురా బాబూ అని వారు కూడా సైలెంట్ అవుతున్నారుట. ఇక ఎమ్మెల్యేల దందా ఎలా ఉంది అంటే ప్రతీ మద్యం షాప్ నుంచి తమకు యాభై శాతం షేర్ ఇవ్వాలని ఒక కండిషన్ పెట్టేసారుట. అంటే ఏ కష్టం లేకుండా వచ్చిన వ్యాపారంలో సగానికి సగం అన్న మాట. మరి వారికే అంత ఇచ్చేస్తే ఇక మిగిలేది ఏముంటుంది అనుకుంటూ ఎందుకొచ్చిన తంటారా బాబూ అని కూడా మద్యం వ్యాపారాలు ఆలోచనలో పడ్డారుట. ఇక చాలా జిల్లాలలో చూస్తే మా వాళ్ళే దరకాస్తు చేస్తారులే మీరు అలా గమ్మున ఉండండే అని కూడా ఎమ్మెల్యే స్థాయి నుంచి ఒక హుకుం జారీ చేస్తున్నారుట. దాంతో మాకొద్దీ మద్యం వ్యాపారం అని చేతులు కట్టేసుకునే సీన్ అనేక జిల్లాలలో ఉంది అని అంటున్నారు. వైసీపీ ప్రభుత్వంలో అయిదేళ్ళ పాటు ఏ పనీ పాటా లేకుండా మద్యం వ్యాపారులు గడిపారు.తమకు విలువైన కాలం పోయింది అని చింతించారు. వారే కూటమి సర్కార్ ని నెత్తిన పెట్టుకుని మరీ అధికారంలోకి తెచ్చారు. తమ ఏరియాల్లో ఎమ్మెల్యేలను కూడా గెలిపించుకున్నారు. తీరా చూస్తే కనుక ఎమ్మెల్యేలు ఇలా రివర్స్ అవుతూ దందాలు చేయడంతో మొత్తం పాయే వ్యాపారం అంతా పాయే అనుకుంటూ తెగ ఫీల్ అవుతున్నారుట. ఇదిలా ఉంటే ఏపీలోని మొత్తం 3396 మద్యం దుకాణాలకు గానూ ఏకంగా లక్షకు పైగా దరఖాస్తులు రెండు వేల కోట్లకు పైగా సొమ్ము వచ్చి పడుతుందని ఖజానా కళకళలాడుతుందని సర్కార్ పెద్దలు అనుకుంటే మొత్తం సీన్ రివర్స్ అయింది. దానికి కారణం గ్రౌండ్ లెవెల్ లో కూటమి ఎమ్మెల్యేలు అంతా చేరి కుంపటి పెట్టడమే అని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మొత్తానికి మ్యాటర్ మాత్రం ఇదీ. దీనిని ఎలా సెట్ రైట్ చేసుకుంటూ సర్కార్ ముందుకు వెళ్తుంది అన్నది చూడాల్సిందే.

## జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరించే వరకు.. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయవద్దు: ఇంజినీర్ రషీద్



**శ్రీనగర్: -నవభూమి:** జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరించే వరకు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయవద్దని అవామీ ఇతిహాద్ పార్టీ (ఏఐపీ) అధ్యక్షుడు, ఎంపీ షేక్ అబ్దుల్ రషీద్ అలియాస్ ఇంజినీర్ రషీద్ డిమాండ్ చేశారు. కేంద్ర పాలిత ప్రాంతమైన జమ్ముకశ్మీర్‌లోని అన్ని రాజకీయ పార్టీలకు ఈ మేరకు ఆయన విజ్ఞప్తి చేశారు. సోమవారం శ్రీనగర్‌లో మీడియాతో రషీద్ మాట్లాడారు. మంగళవారం ఓట్ల లెక్కింపు తర్వాత ఏ రాజకీయ పార్టీ లేదా రాజకీయ పార్టీల సమూహం మెజారిటీ సాధించినప్పటికీ ప్రభుత్వం ఏర్పాటు చేయవద్దని కోరారు. రాజకీయాలకు అతీతంగా ఆ పార్టీలు ఎదగాలని అన్నారు. తమకు ఓటు వేసిన ప్రజల పెద్ద ప్రయోజనాల కోసం ఏకం కావాలని పిలుపునిచ్చారు. నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్సీ), పీపుల్స్ డెమోక్రటిక్ (పీడీపీ)తో సహా అన్ని ప్రధాన రాజకీయ పార్టీలకు తాను విజ్ఞప్తి చేస్తున్నానని అన్నారు.
కాగా, కేంద్రపాలిత ప్రాంతంలో ఎన్నికైన ప్రభుత్వానికి మున్సిపల్ కార్పొరేషన్ కంటే తక్కువ అధికారాలు ఉంటాయన్న ఒమర్ అబ్దుల్లా మాటలను రషీద్ గుర్తు చేశారు. రాష్ట్ర హోదా పునరుద్ధరిస్తే తప్ప ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయకూడదని నిర్ణయించున్న వారికి తన పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందని తెలిపారు. ఎన్నికైన ప్రతినిధులు రాష్ట్ర హోదా పునరుద్ధరణకు ఢిల్లీపై ఒత్తిడి తెస్తే వారికి (కేంద్రానికి) వేరే మార్గం ఉండదని చెప్పారు. 'మోదీ ఇప్పటికే గోల్‌పోస్ట్‌ను మార్చారు. జమ్ముకశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరించేలా ఐక్య ఫ్రంట్‌ను ఏర్పాటు చేయడం ఇప్పుడు మన వంతు' అని అన్నారు.మరోవైపు పీఏజీడీ ఏర్పడిన తర్వాత ప్రాంతీయ రాజకీయ పార్టీలు ఏమీ చేయలేవని రషీద్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఎన్నుకున్న ప్రజలకు ద్రోహం జరగకుండా చూసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని అన్నారు. పాన్-ఇండియా పార్టీగా బలమున్న కాంగ్రెస్ ఇక్కడి ఓట్లు పొందినప్పటికీ ఆర్టికల్ 370పై మౌనంగా ఉందని విమర్శించారు.కాగా, ఢిల్లీలోని కశ్మీర్ హౌస్ ప్రధాన భవనాన్ని లడఖ్ యూటీకి ఇచ్చినట్లు తెలిసి తాను ఆశ్చర్యపోయినట్లు రషీద్ తెలిపారు. లడఖ్ ప్రజలు కూడా తమ సోదరులేనని అన్నారు. అయితే సుమారు రెండు కోట్లు ఉన్న జమ్ముకశ్మీర్ ప్రజలకు కాకుండా, రెండు నుంచి మూడు లక్షలు జనాభా ఉన్న లడఖ్‌కు కశ్మీర్ హౌస్ ప్రధాన భవనం ఇచ్చే నిర్ణయాన్ని ఎలా సమర్థించగలమని ఆయన ప్రశ్నించారు.

## తేజస్వి యాదవ్ ఏసీలు, సోఫాలు ఎత్తుకెళ్లారు.. బీజేపీ సంచలన ఆరోపణలు

**న్యూఢిల్లీ-నవభూమి:** రాష్ట్రీయ జనతాదళ్ నేత, బీహార్ మాజీ ఉప ముఖ్యమంత్రి తేజస్వి యాదవ్ పై బీజేపీ సంచలన ఆరోపణలు చేసింది. అధికారిక నివాసాన్ని ఖాళీ చేసే సమయంలో అందులోని వస్తువులను ఎత్తుకెళ్లారని ఆరోపించింది. ఏసీలు, సోఫాలు, బెడ్ ట్యాప్స్ లాంటివి మిస్సయ్యాయని పేర్కొంది.ఆర్జేడీ-జేడీయూ-కాంగ్రెస్ సంకీర్ణ ప్రభుత్వ హయాంలో తేజస్వి ఉప ముఖ్యమంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత ప్రభుత్వం పడిపోవడంతో డిప్యూటీ సీఎం పదవిని కోల్పోయారు. ఈ క్రమంలోనే పట్నాలోని ఆయన అధికారిక నివాసాన్ని ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరికి కేటాయిస్తూ ఇటీవల నితీశ్ కుమార్ సర్కారు నిర్ణయం తీసుకుంది. దాంతో గత ఆదివారం తేజస్వి ఆ నివాసాన్ని ఖాళీ చేశారు.బంగ్లాను ఖాళీ చేసిన తర్వాత వెళ్లి చూడగా అందులోని పలు వస్తువులు కనిపించకుండా పోయాయని బీజేపీ మీడియా ఇన్‌ఛార్జి దానిశ్ ఇక్బాల్ వెల్లడించారు. ఏసీ, బెడ్, సోఫాలు, మొక్కల కుండీలు, జిమ్ పరికరాలు, వాష్‌రూమ్‌లో నల్లాలు కూడా పట్టుకెళ్లిపోయారని ఆరోపించారు.

**2 అంతస్థుల భవంతి అమ్మకం**

హైదరాబాద్ మన్సూరాబాద్‌లో రెండు అంతస్థుల భవనం అమ్మకానికి కలదు. ప్రస్తుతం 30వేల రూపాయల అద్దె ప్రతినెలా వస్తుంది. వాస్తుప్రకారం నిర్మాణం. ఈస్ట్ ఫేస్. ఆసక్తి ఉన్న వారు దిగువ సెల్ నెంబర్‌లో సంప్రదించండి.9246213493

## డెన్మార్క్‌కు మళ్లిన ఎయిర్ ఇండియా విమానం.. ఎందుకంటే?




**న్యూఢిల్లీ-నవభూమి:** దేశ రాజధాని ఢిల్లీ నుంచి బ్రిటన్ రాజధాని లండన్ వెళ్లాల్సిన ఎయిర్ ఇండియా విమానాన్ని డెన్మార్క్‌కు మళ్లించారు. కోపెన్‌హగాన్ ఎయిర్‌పోర్ట్‌లో ఎమర్జెన్సీగా ల్యాండ్ చేశారు. ఈ మేరకు ఎయిర్ ఇండియా ప్రకటించింది. ఒక ప్రయాణికుడు అస్వస్థతకు గురి కావడం దీనికి కారణమని పేర్కొంది. ఆదివారం ఎయిర్ ఇండియా విమానం ఢిల్లీ నుంచి లండన్‌కు బయలుదేరింది. అయితే విమానం గాలిలో ఉండగా ఒక ప్రయాణికుడి ఆరోగ్యం క్షీణించింది. దీంతో డెన్మార్క్ రాజధాని కోపెన్‌హగాన్‌కు ఆ విమానాన్ని మళ్లించారు. అక్కడి ఎయిర్‌పోర్ట్‌లో ల్యాండ్ చేశారు. అనారోగ్యానికి గురైన ప్రయాణికుడ్ని విమానం నుంచి దించారు. అతడ్ని వెంటనే స్థానిక హాస్పిటల్‌కు తరలించారు.కాగా, మెడికల్ ఎమర్జెన్సీ కారణంగా ఆదివారం ఢిల్లీ నుంచి లండన్ వెళ్లాల్సిన విమానాన్ని కోపెన్‌హగాన్‌కు మళ్లించినట్లు ఎయిర్ ఇండియా అధికారి తెలిపారు. ఇతర ప్రయాణికులకు అసౌకర్యాన్ని తగ్గించడానికి ఎయిర్‌పోర్ట్‌లోని గ్రౌండ్ సిబ్బంది చాలా సహకరించారని చెప్పారు. ఆ తర్వాత విమానం కోపెన్‌హగాన్ నుంచి బయలుదేరి లండన్ చేరుకున్నదని వెల్లడించారు.



## ఆకలి కేకలు

ఏడు దశాబ్దాల స్వతంత్ర భారతదేశంలో నేటికీ అభాగ్యులు, అన్నార్తుల ఆకలికేకలు వినిపిస్తూనే ఉన్నాయి. కడుపు నింపుకోవడానికి పట్టెడు మెతుకులు సైతం కరవై 'అన్నమో రామచంద్రా' అంటూ దీనంగా ఎదురుచూసే బతుకులకు ఆహార భద్రత చట్టం ఎండమావిగానే మిగులుతోంది. దేశంలో ఆహార భద్రత చట్టం అమలు తీరుతెన్నులను సమీక్షించిన సర్వోన్నత న్యాయస్థానం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిష్క్రియాపరత్వంపై ఇటీవల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేయడం పరిస్థితులకు అద్దం పడుతోంది. జాతీయ ఆహారభద్రత చట్టం అమలులో భాగంగా ఏర్పాటైన హరియాణా రాష్ట్ర ఆహార సంఘం కనీస మౌలిక సదుపాయాలను ఏర్పరచుకోవడంలో విఫలమైంది. కేంద్ర ప్రభుత్వం నాలుగేళ్ల క్రితం అమలులోకి తెచ్చిన సంక్షేమ చట్టంపట్ల తన బాధ్యతలు విస్మరించింది. కాలయాపన చేస్తూ నిర్లిప్తంగా ఉండిపోయింది. ఈ వైనంపై న్యాయస్థానం తీవ్రంగా స్పందించి మందలించడం- పేదల ఆకలి కేకలపై మిగిలిన రాష్ట్రాలూ తీరు మార్చుకోవాల్సిన అవసరాల్ని తెలియజెబుతోంది.దారిద్ర్య రేఖకు దిగువనున్న కోట్లాది పేదల ఆకలి బాధలు తీర్చడానికి ఉద్దేశించిన జాతీయ ఆహార భద్రత చట్టాన్ని అమలు చేయడంలో కొన్ని రాష్ట్రాలు తీవ్ర నిర్లక్ష్యం చూపుతున్నాయనీ న్యాయస్థానం ఆక్షేపించింది. ఆ తీర్పులో రెండు తెలుగు రాష్ట్రాల ప్రస్తావనా ఉండటం గమనార్హం. వీటితోపాటు మధ్యప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, గుజరాత్, ఝార్ఖండ్, బిహార్, ఛత్తీస్‌గఢ్‌లూ ఉన్నాయి. రాజ్యాంగంలోని 256 అధికరణాన్నీ న్యాయస్థానం ప్రస్తావించింది. పార్లమెంటు రూపొందించిన శాసనాల అమలుపై రాష్ట్రాలు కఠినంగా వ్యవహరించే విషయంలో వెనకంజ వేయవద్దని కేంద్ర ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమాఖ్య భావన, సమన్వయస్ఫూర్తి ఆవశ్యకతను ఇది వెల్లడిస్తోంది. పార్లమెంటు రూపొందించిన చట్టాలను అమలు చేయడంలో రాష్ట్రాలు కాని, కేంద్రపాలిత ప్రాంతాలు కాని విఫలమైనప్పుడు కేంద్రం తగిన చర్యలకు ఉపక్రమించాలి. అలా కానిపక్షంలో ప్రజల సమస్యలకు పరిష్కారం లభించే మార్గమేమిటన్న విషయాన్ని కేంద్రం ఆలోచించాలి. ఎంత సమున్నత ఆశయంతో రూపొందించిన సంక్షేమ పథకమైనప్పటికీ, దాన్ని అమలు చేయనట్లయితే ప్రయోజనం నెరవేరదు. న్యాయస్థానం ఇప్పటికే పలుమార్లు కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార ప్రజాపంపిణీ, పౌర సరఫరాల మంత్రిత్వశాఖలకు సూచించినప్పటికీ స్పందన లేకపోయింది. దాంతో ఆహార భద్రత చట్టం అమలుకు నిబంధనలు రూపొందించి, ఫిర్యాదుల పరిష్కారానికి స్వతంత్ర అధికారాలున్న యంత్రాంగాన్ని ఏడాదిలోగా ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని తాజాగా ఆదేశించింది. రాష్ట్రాలు సైతం ఏడాదిలోగా యంత్రాంగాలను ఏర్పాటుచేసి తీరాలని న్యాయస్థానం ఆదేశించింది. దరిమిలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొంత హడావుడి పడుతున్నాయి. దీని ఫలితంగానైనా ఆహార భద్రత కల సాకారమవుతుందా అన్నది చూడాలి.దేశంలో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకం, ఐసీడీఎస్, ప్రజాపంపిణీ వ్యవస్థలన్నింటినీ ఒకే గొడుగు కిందకుతెస్తూ 2013లో జాతీయ ఆహార భద్రత చట్టాన్ని అమలులోకి తెచ్చారు. దాని ప్రకారం కిలో మూడు రూపాయల చొప్పున అయిదు కేజీల బియ్యం; రెండు రూపాయలకు గోధుమలు, రూపాయికి చిరుధాన్యాలైన జొన్న, మొక్కజొన్నలు అందజేస్తారు. ప్రజాపంపిణీ వ్యవస్థలో లబ్ధిదారులైన కుటుంబ సభ్యులందరికీ ఇది వర్తిస్తుంది. గర్భిణులు, పాలిచ్చే తల్లులు, చిన్నారులకు రోజూ ఉచితంగా చిరుధాన్యాలు అందిస్తారు. ఈ బిల్లును 2011లో పార్లమెంటులో ప్రవేశపెట్టారు. కానీ, 2013 జులైలో రాష్ట్రపతి అత్యవసరాదేశం(ఆర్డినెన్సు) రూపంలో సెప్టెంబరు 12 నుంచి అమలులోకి వచ్చింది. చట్టం అమలుకు 2014 అక్టోబరు వరకు రాష్ట్రాలకు కేంద్రం గడువు విధించింది. కేవలం 11 రాష్ట్రాల్లోనే అది అమలులోకి వచ్చింది. నేడు దేశంలోని 75 శాతం గ్రామీణులకు, 50 శాతం పట్టణ జనాభాకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా అయ్యే ఆహార ధాన్యాలు, చిరుధాన్యాలే ఆసరాగా ఉన్నాయి.

పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పంటల సాగు విస్తీర్ణం దిగుబడులు పెరగకపోవడంతో ఆహారపంపిణీలో వ్యత్యాసాలు తలెత్తుతున్నాయి. ఆహారధాన్యాల అందుబాటు అనేది కుటుంబం నివసిస్తున్న స్థానిక మార్కెట్ ధరలకు అనుగుణంగా కొనుగోలు చేసే సామర్థ్యం మీద, చాలినన్ని ధాన్యాలు పండించుకునేంత భూమి, ఇతర సేద్యపు వనరుల మీద ఆధారపడి ఉంటుంది. ఆకలికి, పౌష్టికాహార లోపానికి కారణం, ఆహార కొరత మాత్రమే కాదు... పేదరికం వల్ల దాన్ని పొందలేని స్థితి కూడా అని ఐక్యరాజ్య సమితికి చెందిన సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక హక్కుల సంఘం స్పష్టీకరిస్తోంది! ఆహారధాన్యాల ఉత్పత్తిని వర్షపాతం, ఉష్ణోగ్రతల్లోని వ్యత్యాసాలు ప్రభావితం చేస్తుంటాయి. అననుకూల పరిస్థితుల్లో పంటల దిగుబడి గణనీయంగా తగ్గిపోతుంది. వర్షాభావం వల్ల నేలలు ఎడారులుగా మారుతున్నాయి. లవణీయత పెరుగుతోంది. అవి క్రమక్షయానికి గురవుతున్నాయి. పట్టణీకరణ వల్ల వ్యవసాయ భూములు నిరుపయోగంగా పడిఉంటున్నాయి. మరోవైపు సాగునీటి కొరత తీవ్రంగా ఇబ్బంది పెడుతోంది. భారత్ సహా అనేక దేశాలను ఆహారం అందుబాటు, సరఫరా సమస్యలు తరుముతున్నాయి. భూగర్భ జలాలను విపరీతంగా తోడివేయడం సరికొత్త సమస్యలకు ఆజ్యం పోస్తోంది. చైనా, అమెరికా అఫ్గానిస్థాన్, ఇరాన్ తదితర దేశాల్లోనూ దాదాపు ఇదే దుస్థితి తాండవిస్తోంది. అల్జీరియా, ఈజిప్ట్, ఇరాన్, మెక్సికో దేశాలూ నీటిఎద్దడి కారణంగా ఆహార ధాన్యాలను అధికంగా దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ఆహార ధాన్యాల ఉత్పత్తిలో స్వయంసమృద్ధి సాధించిన పాకిస్థాన్ సైతం ఏటా పెరుగుతున్న జనాభా కారణంగా దిగుమతులను ఆశ్రయించక తప్పడం లేదు. ప్రపంచాన్ని ప్రాంతాలవారీగా పరిశీలిస్తే మధ్య సహారా ఆఫ్రికాలోని అత్యధిక దేశాలు నీటిఎద్దడితో కొట్టుమిట్టాడుతున్నాయి. ఆఫ్రికా మొత్తంలో 80 కోట్ల ప్రజలుంటే, అందులో 30 కోట్లమంది నీటి ఎద్దడి ఉన్న ప్రాంతాల్లోనే నివసిస్తున్నారు. పరిస్థితులు ఇలాగే కొనసాగితే, 2030 నాటికి 7.5 కోట్ల నుంచి 25 కోట్ల ప్రజలు తీవ్ర నీటి ఎద్దడికి గురవుతారని అంచనా. అధిక దిగుబడుల కోసం సాగు భూములపై పెరుగుతున్న ఒత్తిడి, నేలలు నిస్సారం కావడానికి కారణమవుతోంది. దీనివల్ల కూడా పంటల ఉత్పాదకత దెబ్బతింటోంది. ప్రపంచంలోని మొత్తం సేద్యయోగ్యమైన భూమిలో దాదాపు 40 శాతం నిరుపయోగంగా మారిందని అంచనా. మరోపక్క వాతావరణంలో తీవ్ర మార్పులు వస్తున్నాయి. అవి పర్యావరణ సమస్యలకు అంటుకడుతున్నాయి. పర్యవసానంగా వరదలు, కరవు కాటకాలు ఏర్పడుతున్నాయి. భూతాపం సైతం పెచ్చరిల్లుతోంది. ఈ విపరిణామాలన్నీ వ్యవసాయంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి.

# బానిసత్వానికి విముక్తి ఎన్నడు?



శ్రమ దోపిడీ ఓ సామాజిక దురాచారం. సాంకేతిక యుగంలోనూ ప్రపంచవ్యాప్తంగా అనేకమంది శ్రమ దోపిడీకి గురవుతున్నారు. శ్రమకు తగ్గ వేతనాలు అందక.. ఎక్కువ సమయం పని చేస్తూ యజమానుల చేతుల్లో బానిసలుగా మారుతున్నారు. వారి చేతుల్లో బందీలుగా మారిపోయి వెట్టిచాకిరి బాధితులుగా మిగిలిపోతున్న వారు కోకొల్లలు.

ఉపాధి నిమిత్తం ఇతర రాష్ట్రాలు, ప్రాంతాలకు వలసపోతున్న వారిలో అత్యధికులు వెట్టిచాకిరి బారిన పడుతున్నారు. ఒక నిర్ణీత సమయం అంటూ లేకుండా వారంతా గొడ్డు చాకిరి చేస్తున్నారు. పొద్దు పొడిచిన దగ్గరి నుంచి పొద్దుపోయే వరకు అహర్నిశలు శ్రమించే వారికి సరైన కూలీ కూడా అందకపోవడం విచారకరం. ఇటుక బట్టీల నుంచి పెద్దపెద్ద పరిశ్రమల వరకు మనకు తారసపడిన వారిని ఒకసారి పలకరిస్తే అసలు విషయం తెలుస్తుంది. వారక్కడ ఇష్టంగా పని చేస్తున్నారా? లేదా బలవంతంగా పని చేయాల్సి వస్తున్నదా? అనేది అవగతం అవుతుంది. అప్పులు, ముందస్తు చెల్లింపుల కారణంగా లక్షల మంది ఇప్పటికీ అయిష్టంగానే వెట్టిచాకిరి చేస్తున్నారు. ఒకరి కింద బానిసలాగా బతకాలని ఎవరికి మాత్రం ఉంటుంది. కానీ, వారి కుటుంబ ఆర్థిక పరిస్థితులు, మన దేశంలో జనాభాకు తగ్గట్టుగా ఉపాధి కల్పన లేకపోవడం తదితర కారణాల వల్ల లక్షల మంది ఈ సామాజిక దురాచారానికి గురవుతున్నారు.రాజ్యాంగంలోని ఆర్టికల్ 23 ప్రకారం బలవంతంగా పని చేయించడం, మానవ అక్రమ రవాణా నేరం. దాన్ని రూపుమాపడం ప్రభుత్వాల బాధ్యత. వెట్టిచాకిరి బాధితులు ఎక్కడ కనిపించినా వారికి విముక్తి కల్పించి పునరావాసం కల్పించాలి. 1978లో తీసుకొచ్చిన చట్టం ప్రకారం బాధితుల పునరావాసం కోసం రూ.4,000 ఆర్థిక సాయం చేయాలి. ఈ మొత్తాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరించాలని చట్టంలో పొందుపరిచారు. మారిన పరిస్థితులకు అనుగుణంగా దీన్ని 2000 సంవత్సరంలో రూ.20 వేలకు, 2022లో రూ.30 వేలకు పెంచారు. ప్రత్యేక పరిస్థితుల్లో పురుషులకు రూ.లక్ష, మహిళలు, బాలలకు రూ. 2 లక్షలు, లైంగిక వేధింపులకు గురైనవారికి రూ.3 లక్షల వరకు పునరావాసం కోసం సాయం చేసేలా జిల్లా కలెక్టర్లకు వెసులుబాటు కల్పించారు. దీంతో పాటు వెట్టిచాకిరి నుంచి విముక్తి పొందినట్టు ఓ ధ్రువీకరణ పత్రాన్ని కూడా జారీ చేయాలి. విముక్తి పొందిన వారికి ధ్రువపత్రాలు జారీ చేస్తున్న ప్రభుత్వాలు.. బాధితులకు పునరావాసం కల్పించడంలో అలసత్వం వహిస్తున్నాయి. ఆర్థిక సాయం చేయాల్సి ఉండటంతో ఈ విషయంలో ప్రభుత్వాలు వెనుకడుగు వేస్తున్నట్టు తెలుస్తున్నది. దీంతో వారంతా కొంతకాలానికి కొత్త ప్రాంతానికి వెళ్లి అక్కడ తిరిగి వెట్టిచాకిరి బాధితులుగా మారుతున్నారు.వెట్టిచాకిరి నుంచి విముక్తి కల్పించి, వారికి పునరావాసం కల్పించే విషయంలో మన ప్రభుత్వాలు విఫలమయ్యాయనే చెప్పాలి. 1978 నుంచి చూసుకుంటే కేంద్ర ప్రభుత్వం లెక్కల ప్రకారం ఇప్పటివరకు 3,15,302 మంది వెట్టిచాకిరి నుంచి విముక్తి పొందారు. వారిలో 2,96,305 మందికి ప్రభుత్వం పునరావాసం కల్పించింది.


2030 నాటికి 1.8 కోట్ల మందిని వెట్టిచాకిరి నుంచి విముక్తి కల్పించాలని కేంద్ర ప్రభుత్వం 2016లో సంకల్పించింది. ఆ నాటి నుంచి చూసుకుంటే 32,873 మందికి మాత్రమే విముక్తి కల్పించడం గమనార్హం. అంటే సరాసరి ఏడాదికి సుమారు 4,696 మంది విముక్తి పొందారు. భారత ప్రభుత్వం నిర్దేశించుకున్న 1.8 కోట్ల లక్ష్యంలో ఇది సుమారు 2 శాతం.ఇప్పటి వరకు విముక్తి పొందిన బాధిత కార్మికులు ఎక్కువగా ఐదు రాష్ట్రాల్లోనే ఉండటం గమనార్హం. కర్ణాటక (66,281), తమిళనాడు (65,573), ఒడిశా (51,441), ఉత్తరప్రదేశ్ (42,279), ఆంధ్రప్రదేశ్ (38,141) ముందు వరుసలో ఉన్నాయి. ఇది 84 శాతం.నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో నివేదిక ప్రకారం వెట్టిచాకిరి వ్యవస్థ నిర్మూలన చట్టం కింద నమోదవుతున్న కేసుల్లో అత్యధిక శాతం ఎస్సీ, ఎస్టీలే బాధితులుగా ఉండటం బాధాకరం. 2019లో ఈ చట్టం కింద 1,155 కేసులు నమోదవగా.. వాటిలో 96 శాతం బాధితులు ఎస్సీ, ఎస్టీలే. 2020లో నమోదైన 1,231 కేసుల్లో 94 శాతం, 2021లో నమోదైన 592 కేసుల్లో 96 శాతం వారే బాధితులు. నమోదైన కేసుల సంఖ్యతో సమానంగా విముక్తి కల్పించిన వారి సంఖ్య లేకపోవడం విచారకరం. విముక్తి కల్పిస్తున్నప్పటికీ వారి వివరాలు బయటికి రావడం లేదనేది ఓ వాదన. ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని, రాజకీయ నేతల హస్తం ఉండటం తదితర కారణాల వల్ల కొన్ని సందర్భాల్లో జిల్లా యంత్రాంగాలు ఈ వివరాలను బయట పెట్టడం లేదని తెలుస్తున్నది.మారుతున్న కాలానికి అనుగుణంగా వెట్టిచాకిరిలోనూ మార్పులు సంభవిస్తున్నాయి. ప్రస్తుత పరిస్థితులకు తగ్గట్టుగా ఆధునిక బానిసత్వం పుట్టుకొచ్చింది. ఈ బానిసత్వంలో అనేకమంది తమ కుటుంబాల కోసం యాజమాన్యాలను ప్రశ్నించకుండా మిన్నకుంటున్నారు. శ్రమకు తగ్గ వేతనాలు లేకపోయినా సర్దుకుపోతున్నారు. వారికి కార్మిక చట్టాలు, శ్రమకు తగ్గ వేతనాలు అమలు కావడం లేదు. ఓ సంస్థ అంచనా ప్రకారం మన దేశంలో 1.1 కోట్ల మంది ఆధునిక బానిసత్వంలో మగ్గుతున్నట్టు తేలింది. వారిలో 83 శాతం మంది ఎస్సీ, ఎస్టీలే ఉండటం ఆందోళన కలిగిస్తున్నది. ఆసియా-పసిఫిక్ రీజియన్‌లో ఇరాన్, దక్షిణ కొరియా, ఉత్తర కొరియా, భారత్‌లో మాత్రమే ఈ ఆధునిక బానిసత్వాన్ని రూపుమాపేందుకు సరైన ప్రణాళికలు లేకపోవడం పరిస్థితికి అద్దం పడుతున్నది.

# మానవాళి పట్ల ప్రాణాంతకంగా మారుతున్న ప్లాస్టిక్



సాంకేతికత అభివృద్ధి చెందుతున్నకొద్దీ అనేక ఆవిష్కరణలు వెలుగుచూస్తున్నాయి. ఇవి రెండు వైపులా పదునున్న కత్తి వలె మానవాళికి ప్రయోజనం చేకూరుస్తూనే ప్రమాదకారిగానూ పరిణమిస్తున్నాయి. 20వ శతాబ్దంలో ఆవిష్కరించిన ప్లాస్టిక్ కూడా ఆ కోవలోనిదే. నిత్య జీవితంలో భాగమైపోయిన ప్లాస్టిక్ రోజురోజుకు మానవాళి పట్ల ప్రాణాంతకంగా మారుతున్నది.

మానవుడి దైనందిన జీవితంలో ప్లాస్టిక్ భాగమైపోయింది. సాంకేతికత సాయంతో మనకు మరింతగా చేరువైన నానో ప్లాస్టిక్, మైక్రోప్లాస్టిక్ మన ప్రాణాలను హరిస్తున్నాయి. కంటికి కనిపించని పరిమాణంలో ఉండే ఇవి నీరు, ఆహారంలో కలిసిపోయి అక్కడి నుంచి మన శరీరంలోకి చేరుతున్నాయి. తాజాగా వెలుగుచూసిన ఓ పరిశోధనలో మన రక్తంలోనూ నానో ప్లాస్టిక్ ఉండటం ఆందోళన కలిగిస్తున్నది. మెదడులోకి చొచ్చుకుపోయి నాడీ వ్యవస్థను ప్లాస్టిక్ దెబ్బతీస్తున్నట్టు అందులో తేలింది. అతి సూక్ష్మ రూపంలో ఉండే ఇవి రక్షణ వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్నాయి.మెదడులోకి చొచ్చుకుపోయిన నానో ప్లాస్టిక్ పార్కిన్సన్ వ్యాధికి కారకమవుతుండటం ఆందోళన కలిగించే విషయం. వాతావరణంలో ఉండే నానో ప్లాస్టిక్ పదార్థాలు ఆల్ఫా సినుక్లిన్ అనే ప్రొటీన్‌తో సంకర్షణ జరుపుతున్నట్టు పరిశోధకులు గుర్తించారు. నాడీ కణాల మధ్య కమ్యూనికేషన్‌కు ఉపయోగపడే ఇవి క్రమంగా పార్కిన్సన్ వ్యాధిగా రూపాంతరం చెందేలా దోహదం చేస్తున్నాయి. పార్కిన్సన్ అనేది ప్రపంచవ్యాప్తంగా అతివేగంగా విస్తరిస్తున్న నాడీ సంబంధిత రుగ్మత. కదలికలను నియంత్రించే నాడీ కణాలను ఈ వ్యాధి నాశనం చేస్తుంది. దీనివల్ల క్రమంగా నాడీ వ్యవస్థ పని చేయడం మానేస్తుంది.ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం 2019లో ప్రపంచవ్యాప్తంగా 85 లక్షల మంది ఈ వ్యాధితో బాధపడుతున్నట్టు తేలింది. అయితే 25 ఏండ్లలో పార్కిన్సన్ బాధితుల సంఖ్య రెట్టింపు కావడం ఆందోళన కలిగించే విషయం. 2019 నాటికి పార్కిన్సన్ కారణంగా సుమారు 58 లక్షల మంది వైకల్యం బారినపడ్డారు. 2000తో పోలిస్తే ఇది 81 శాతం అధికం కావడం గమనార్హం. అదే సమయంలో మరణాలు కూడా భారీగా పెరిగాయి.2019 నాటికి ఈ వ్యాధితో 3,29,000 మంది మృతిచెందారు. 2000తో పోలిస్తే 100 శాతం అధిక మరణాలు నమోదయ్యాయి. మన దేశంలోనూ పార్కిన్సన్‌తో బాధపడుతున్నవారు లక్షల మంది ఉన్నారు. అయితే ప్రపంచవ్యాప్తంగా చూసుకుంటే చైనాలో ఈ వ్యాధి బాధితులు ఎక్కువ మంది ఉన్నట్టు ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కలు చెప్తున్నాయి.పార్కిన్సన్ వ్యాధి వేగంగా విస్తరిస్తున్నా.. ఆయా దేశాలు దీనిపై అంతగా దృష్టి సారించడం లేదు. అందుకే క్రమంగా ఈ వ్యాధి ప్రాణాంతకంగా మారుతున్నట్టు గణాంకాలు చెప్తున్నాయి. సరైన వైద్య సదుపాయాలు లేకపోవడం, చికిత్స అందకపోవడం తదితర కారణాల వల్ల అనేకమంది మృత్యువాతపడుతున్నారు. ముందుగానే వ్యాధిని గుర్తించకపోవడం, సరైన సమయంలో చికిత్స అందకపోవడం మరణాలకు కారణం. తక్కువ ఆదాయం కలిగిన దేశాల్లో న్యూరాలజిస్టులు చాలా తక్కువ సంఖ్యలో ఉండటం ఆందోళనకరం. ఈ దేశాల్లో ప్రతి లక్ష మంది జనాభాకు 0.03 మంది న్యూరాలజిస్టులు మాత్రమే అందుబాటులో ఉన్నారు. అధిక ఆదాయం కలిగిన దేశాల్లో ప్రతి లక్ష మందికి 4.75 మంది న్యూరాలజిస్టులు ఉన్నారు.యావత్ ప్రపంచంలో సమస్త మానవాళి అనారోగ్యం బారిన పడుతున్నా.. ప్లాస్టిక్ వాడకం తగ్గడం లేదు. ఏటా దీని వినియోగం పెరుగుతూనే ఉన్నది. హానికరమైన ఈ ప్లాస్టిక్‌ను ప్రభుత్వాలు నిషేధిస్తున్నట్టు ప్రకటనలు చేస్తూ చేతులు దులుపుకొంటున్నాయి.సరైన రీతిలో చర్యలు చేపట్టకపోవడంతో ప్లాస్టిక్ పెనుభూతంగా మారుతున్నది. 2021 లెక్కల ప్రకారం ప్రపంచవ్యాప్తంగా 400 మెట్రిక్ టన్నుల ప్లాస్టిక్ ఉత్పత్తి అయ్యింది. ఈ మొత్తం కొంతకాలానికి ప్లాస్టిక్ వ్యర్థాలుగా మారి వాతావరణంలో కలిసిపోయి మానవాళికి ప్రాణాంతకంగా పరిణమిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వాలు దీనిపై దృష్టి సారించి ప్లాస్టిక్ వాడకాన్ని గణనీయంగా తగ్గించాల్సిన అవసరం ఉన్నది.



# శాంతి మంత్రం

భక్తి

భారతదేశం శాంతి పరిమళాలు వెదజల్లే పూలతోట వంటిది. ప్రపంచానికి ప్రశాంతతను ప్రబోధించడంలో భారతీయులే ముందుంటారు.

శాంతి సామరస్యాల్ని చాటే వేదమంత్రాలు పూర్వీకుల నుంచి మనకు వారసత్వంగా వచ్చాయి. ప్రాతఃస్మరణీయమైన ఆ వేదఘోష అందరి హృదయాల్లోనూ మారుమోగుతుంటుంది.

కామ క్రోధాల వంటి అరిషడ్వర్గాల నుంచి శమింపజేసేది శాంతం అని 'అమర కోశం' చెబుతుంది. సృష్టి మనుగడ కొనసాగాలంటే పంచభూతాల అనుగ్రహం కావాలి. వాటి ఆగ్రహం ప్రాణికోటికి ముప్పు తెస్తుంది. అందువల్ల పంచభూతాలూ శాంతించాలంటాయి యజుర్వేద మంత్రాలు. సూర్యచంద్రులు, ఇంద్రాది దేవతలు శాంతించాలని తైత్తిరీయోపరిషత్తు కోరుతుంది.

విష్ణువు శాంతాకారుడై, ఆదిశేషుడి మీద శయనించి ఉంటాడని వ్యాసమహర్షి వర్ణించాడు. పరమశివుణ్ని శివస్తోత్రం 'శాంతుడు' అని సంబోధిస్తుంది.

జీవహింస తగదని ప్రవచించిన బుద్ధ భగవానుడు శాంతిమంత్రం జపించాడు. ఖండాంతరాలవారికీ ఆరాధనీయుడయ్యాడు. బుద్ధుడి బోధనలకు అశోక చక్రవర్తి ఎంతగానో ప్రభావితుడయ్యాడు. రణరంగంలో విజయుడైనప్పటికీ శాంతికాముకుడిగా మారి, బౌద్ధాన్ని ప్రపంచమంతటికీ పరిచయం చేశాడు. భారతీయుల ఖ్యాతిని విశ్వవ్యాప్తం చేయగలిగాడు. తోటివారిని కష్టపెడితే శాంతి దూరమవుతుంది. అహింస వల్ల అనంత శాంతి సొంతమవుతుందని గాంధీమహాత్ముడు గ్రహించారు. సత్యం, అహింసల్ని ఆయుధాలుగా చేసుకున్నారు. భారత స్వాతంత్ర్య పోరాట కాలంలో వాటిని ప్రయోగాత్మకంగా అమలుపరచారు. జాతిపితగా, శాంతి ప్రచారకులుగా పేరు గడించారు. దక్షిణాఫ్రికా దేశీయులైన నెల్సన్ మండేలా ఆయన చూపిన శాంతిమార్గంలో నడిచారు. బానిసత్వం నుంచి తన దేశాన్ని విముక్తం చేశారు. మువ్వన్నెల పతాకంలోని శ్వేతవర్ణం భారత శాంతిప్రియత్వాన్ని చాటుతుంది.

పూర్వం ప్రభువుల యుద్ధకాంక్ష కారణంగా ప్రజల్లో అశాంతి, అలజడి రేగాయి. ప్రతి ఒక్కరూ అభద్రతకు గురయ్యేవారు. యుద్ధానికి ప్రత్యామ్నాయంగా నాటి రుషులు అశ్వమేధ, రాజసూయ యాగాలకు రూపకల్పన చేశారు. యుద్ధాన్ని నిరోధించి, సమాజంలో శాంతిభద్రతల్ని కాపాడటమే వాటి పరమార్థం. సహజంగానే భారతీయులు సున్నిత మనస్కులు. దేవతారాధన కోసం మొక్కల నుంచి పూలు తుంచాలన్నా బాధపడతారు. శతకకర్త బద్దెన చాటినట్లు, అపకారికైనా ఉపకారం చేయడమే మిన్న. అప్పుడే శత్రుత్వం తొలగి, రెండు పక్షాల మధ్యనా మైత్రి కలుగుతుంది. ప్రపంచంలో శాంతిస్థాపనకు సంబంధించి, ఇంతకు మించిన మేలు మార్గం మరొకటి ఉండదు. మనిషి కోపం శత్రువుల్ని పెంచుతుంది. శాంతం రక్షణనిస్తుందని పెద్దల మాట. కోపం వల్ల విచక్షణాజ్ఞానం లోపిస్తుంది. ఫలితంగా, అయినవారు సైతం శత్రువులుగా కనిపిస్తారంటుంది భృగుమహర్షి చరిత్ర. ఆయన అరికాలిలో మూడో కన్నుతో జన్మించాడంటారు. ఒకరోజు తన రాకను గమనించలేదన్న కోపంతో బ్రహ్మ, మహేశ్వరులను శపిస్తాడు. విష్ణుమూర్తి హృదయంపై కాలితో తంతాడు. ఆ స్వామి శాంతసముద్రుడు. భృగువు పాదాలు నొక్కుతూనే, అరికాలిలోని కంటిని వేలితో పొడుస్తాడు. రుషి క్రోధం పూర్తిగా శమిస్తుంది. ప్రశాంతచిత్తుడై ఆయన, తన తప్పిదానికి క్షమాపణ చెప్పి వెళ్లిపోతాడు. సత్వగుణ ప్రధానుడైన శ్రీరాముడు శాంతస్వరూపుడుగా వెలుగొందుతాడు. హిరణ్యకశిపుడి వధ కోసం ఉగ్రనరసింహ అవతారమెత్తిన విష్ణుమూర్తి- భక్తప్రహ్లాదుడి స్తోత్ర పఠనంతో తిరిగి శాంతరూపం ధరిస్తాడు.

స్వార్థం శత్రుత్వాన్ని పెంచుతుంది. అంతా తమకే సొంతం కాదని అందరూ గుర్తించాలి. స్వార్థబుద్ధి పూర్తిగా నశిస్తేనే, మనుషుల మధ్య సోదరభావం పెరుగుతుంది. అప్పుడే శాంతి కపోతం విశ్వమంతటా స్వేచ్ఛగా విహరిస్తుంది!



## మెడ బిగుసుకుపోతోందా?

కొంతమంది వాత శరీరుల్లో మెడ బిగుసుకుపోయే సమస్య తరుచూ తలెత్తుతుంది. ఈ సమయంలో వాళ్లు మెడను కదపలేక బాధపడుతుంటారు. అయితే శరీరంలో ఏ వాతమూ లేకుండా కూడా కొందరికి మెడ భాగం ఒక్కటే బిగుసుకుపోతుంది. ఇలాంటి వారికి తక్షణ ఉపశమనం కోసం నీటిలో వావిలాకు వేసి ఉడికించి ఆ నీటిని మెడ మీద ధారగా పోస్తే ఎంతో మేలు కలుగుతుంది.

గృహ ఔషధంగా.... రేకుల్లాంటి రస కర్పూరాన్ని గంటసేపు తేనెలో నానబెట్టి, ఆ తర్వాత ఒక తులానికి, రెండు నిమ్మకాయలంత బెల్లం, అరచెంచా ఇంగువ కలిపి, నూరి, బటానీ గింజలంత మాత్రలు చేసుకుని రోజూ వేడినీటితో వేసుకుంటే మంచి ఫలితం కనిపిస్తుంది.

లేపన తైలం: వాము పూవు, పుదీనా పువ్వు, ముద్ద కర్పూరం, రెండేసి తులాల చొప్పున ఒక సీసాలో వేసి ఉంచాలి. అరగంటలోగా అది ఘాటైన తైలంగా మారుతుంది. ఆ తైలంలో కొద్దిగా సారాయి చేర్చి, నొప్పితో బిగుసుకుపోయిన నరాలపైన ప్రతి రాత్రి గట్టిగా మర్దన చేయాలి. ప్రతి రోజూ ఉద యం వేళ వావిలాకు నీటితో స్నానం కూడా చేయాలి. అప్పటికీ తగ్గకపోతే...వావిలాకు రసం అరగ్లాసు, పెద్దమాను చెక్క కషాయం అరగ్లాసు, దిరిశన చెక్క కషాయం అరగ్లాసు, ములకవేర్ల కషాయం అరగ్లాసు, వేపచెక్కరసం అరగ్లాసు నెమలి చెక్క రసం అరగ్లాసు, వీటికి తేనె చేర్చి అందులో 5 పిడికిళ్ల త్రికటు చూర్ణం, పిడికెడు ఎల్లిపాయల గుజ్జు వేసి కలయబెట్టి బాగా మర్దించి గట్టిపడితే మరింత తేనె చేర్చి ఒక సీసాలో భద్రపరుచుకోవాలి. ఆముదంలో అనిపించే ఈ కల్కాన్ని వేడి నీటిలో మూడు చెంచాలు కలిపేసుకుని ఉదయం, సాయంత్రం అరగ్లాసు చొప్పున 60 రోజులు వాడాలి. దీనితో ఎంతటి తీవ్రమైన మెడనొప్పి అయినా తగ్గిపోతుంది.

# జూట్ జోలే సచ్చాయియా



పావుకిలో పచ్చిమిర్చి కొంటే కవర్. అరకిలో టమాటాలకు ఇంకో కవర్. పాలిథిన్ సంచులు ముంచుతాయని హెచ్చరిస్తున్నా.. పట్టించుకోవడం లేదు. ఇదిలాగే కొనసాగితే.. నేలలో కరగని ప్లాస్టిక్ వ్యర్థాలు.. మనిషి శరీరంలోకి చేరిపోవడం ఖాయం. ఈ దుస్థితి దాపురించొద్దని పర్యావరణహిత ఆంత్రప్రెన్యూర్ అవతారమెత్తారు వైశెట్టి సునీతారాణి. జూట్ బ్యాగులతో పర్యావరణంపై తన సచ్చాయిని చాటుతున్నారు. 'జస్ట్ గ్రీన్ లీఫ్' సంస్థను స్థాపించి బయోడీగ్రేడబుల్,కస్టమైజ్డ్ జనపనార సంచులను ఉత్పత్తి చేస్తున్నారు. వ్యాపారుల అందరి లక్ష్యం లాభార్జనే! వ్యాపారిగా లాభాలు అందుకుంటూనే.. మనిషిగా ప్రకృతిని కాపాడుతున్న సునీతా రాణి స్టార్టప్ స్టోరీ ఆమె **మాటల్లోనే..**

తరాలుగా మానవాళి మనుగడకు ప్రకృతి వెన్నుదన్నుగా నిలుస్తున్నది. ప్రకృతి వనరులే నిచ్చెనగా ఎదిగిన మనిషి.. ప్లాస్టిక్ వ్యర్థాలతో ఆ వరప్రదాయిని గుండెల మీద చిచ్చు రేపుతున్నాడు. దైనందిన జీవితంలో విచ్చలవిడిగా ప్లాస్టిక్ వినియోగిస్తూ.. భూతాపాన్ని పెంచుతున్నాడు. జనాభా పెరిగే కొద్దీ ప్లాస్టిక్ వినియోగం కూడా వృద్ధి చెందుతున్నది. ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా ఇది నియంత్రణలోకి రావడం లేదు. ఈ పరిస్థితిలో మార్పుకోసం నా వంతుగా పర్యావరణహితమైన సంచులు తయారుచేయాలని ఈ రంగంలోకి అడుగుపెట్టాను. పరిశ్రమ నెలకొల్పడానికి ముందు ఎన్నో పరిశోధనలు చేశాను. బ్యాగుల ముడిసరుకు, తయారీ, కస్టమైజేషన్, ప్రింటింగ్ ఇలా అన్ని విభాగాలనూ పరిశీలించాను. నేను చేయగలనన్న నమ్మకం కలిగాక 'జస్ట్ గ్రీన్ లీఫ్' సంస్థను నెలకొల్పి జూట్ బ్యాగుల ఉత్పత్తి ప్రారంభించాను.

**ఉత్పత్తి తక్కువే..**

ప్లాస్టిక్ కారణంగా మానవాళికి జరుగుతున్న నష్టంపై అవగాహన పెరుగుతున్నా.. పాలిథిన్ కవర్లు, ప్లాస్టిక్ బ్యాగుల వినియోగం తగ్గడం లేదు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయమైన ఉత్పత్తులు విస్తృతంగా అందుబాటులో లేకపోవడమే దీనికి కారణం. అందుకే సామాజికంగా, ఆర్థికంగా, పర్యావరణపరంగా అనుకూలమైన విధానాల్లో ఉండేలా బయోడీగ్రేడబుల్ బ్యాగులను అందుబాటులోకి తేవాలని నిశ్చయించుకున్నాను. జనపనార, కూరగాయల నుంచి సేకరించిన ఫైబర్, పత్తితో మన్నికైన జూట్ బ్యాగుల తయారీకి శ్రీకారం చుట్టాను. ఈ రంగంలో విస్తారమైన డిమాండ్ ఉంది. కానీ, అందుకు తగిన మౌలిక వసతులు లేవు. ముడిసరుకు ఖరీదు కూడా అధికంగా ఉండటంతో చౌకగా దొరికే ఉత్పత్తులు తీసుకురావడం సాధ్యం కావడం లేదు. ఇదే మార్కెటింగ్ స్ట్రాటజీగా భావించి డిజైనింగ్, కటింగ్, కుట్టుపని, ప్రింటింగ్, ఉత్పత్తి అన్నిటినీ ఒకే వేదికపైకి తీసుకువచ్చి, ఎకో ఫ్రెండ్లీ బ్యాగుల ఉత్పత్తి మొదలుపెట్టాను.





**అవసరాలకు తగ్గట్టుగా..**

కేవలం జూట్ బ్యాగులను తయారుచేయడం వరకే పరిమితమైతే మార్కెట్లో నిలబడలేం. కస్టమైజ్డ్ ఉత్పత్తులను కూడా తీసుకువస్తున్నాం. గ్రీటింగ్ కార్డులు, డెకరేటివ్ హ్యాంగింగ్స్, కస్టమర్ల అవసరాలకు తగినట్లుగా ఉండే సంచులు, పర్సులను కూడా తయారుచేస్తున్నాం. ప్లాస్టిక్ కవర్లకు బదులుగా ఉండే అన్ని రకాలను 'జస్ట్ గ్రీన్ లీఫ్' మార్కెట్లోకి తీసుకువస్తున్నది. మా ఉత్పత్తులను ఈ కామర్స్ వేదిక ద్వారా విక్రయిస్తున్నాం. పలు ఆలయాలు, స్వచ్ఛంద సంస్థల నుంచి కూడా జూట్ సంచులకు ఆర్డర్‌లు వస్తున్నాయి. విదేశాలకూ ఎగుమతి చేస్తున్నాం. పర్యావరణ హితం కోరుతూ అత్యుత్తమ సేవలు అందిస్తున్నందుకు గానూ మా సంస్థకు ఎన్నో ప్రశంసలు దక్కాయి. 2019లో కాన్ఫడరేషన్ ఆఫ్ ఉమెన్ ఆంత్రప్రెన్యూర్ తెలంగాణ చాప్టర్ సుస్థిరమైన ఉత్పత్తుల సంస్థగా గుర్తించి అవార్డు ప్రకటించింది.

**కడార్ల కిరణ్ ప్రకృతి సంరక్షణి..**

సహజసిద్ధమైన ఫైబర్లను కలిగిన జనపనార ప్రపంచంలోనే అతిచౌకగా దొరికే గట్టిదనం కలిగిన పదార్థం. ప్రస్తుతం దీనికి విపరీతమైన డిమాండ్ ఉన్నప్పటికీ వీటితో తయారైన వస్తువుల వినియోగం పెరగడం లేదు. అధిక ఉష్ణోగ్రతలను కూడా తట్టుకోగలిగే జనపనారతో ఎలాంటి వస్తువులైనా తయారుచేయొచ్చు. అంతేకాదు ఇవి పాతబడిన తర్వాత భూమిలో సులభంగా కలిసిపోయి నేలకు మేలుచేస్తాయే తప్ప.. ఎలాంటి నష్టమూ ఉండదు. ప్రకృతికి రక్షణగా నిలిచే జూట్ అంటే స్వచ్ఛత అని నేను నమ్మతాను. అయితే, మార్కెట్‌లో నిలదొక్కుకోవాలంటే మనకంటూ ఓ ప్రత్యేకత ఉండాలి. అందుకే మా ఉత్పత్తులను నయా డిజైన్లలో అందిస్తున్నాం. ఆధునిక జీవనశైలికి అనువుగా ఉండేలా డిజైనరీ జూట్ బ్యాగులను ఉత్పత్తి చేస్తున్నాం.

# తంగేడు పూలతో రంగులద్దుకొని ముచ్చటగొలిపే బతుకమ్మ



అడవి పూలు కొన్ని! పల్లెసీమలో విరిసిన కుసుమాలు ఇంకొన్ని! ఏ కోణంగి కొప్పులోనూ ఇవి కనిపించవు. ఏ మనోహరుడి మెడలోనో హారమై పరవశించాలని అస్సలు అనుకోవు! వనదేవత ఒడిలో పూసిన ఈ పూలు పూజించడానికో, పాన్పుపై పరుండటానికో పుట్టినవి కావు!! పూజలు అందుకోవడానికి జన్మనెత్తినవి! జీవంతికా దేవిగా కొలువుదీరి ఆడపడుచుల ఆటపాటల అర్చనల్లో మురిసిపోతాయి. గుమ్మడి పూలతో అరుగేసి.. గోరంట పూలతో గోడలు కట్టి.. గునుగు పూలతో గోపురం పెట్టి.. తంగేడు పూలతో రంగులద్దుకొని ముచ్చటగొలిపే బతుకమ్మ వైభవం మన తెలంగాణకు సొంతం.

నిపించేదే! కానీ, పూలనే దేవతగా భావించే పండుగ బతుకమ్మ. ఆ జగజ్జనని అనుగ్రహంతో విరిసిన పూలను శ్రీచక్రాకృతిలో పేర్చి బతుకును అందించిన బతుకమ్మగా భావిస్తారు. అంతగా పరిమళాలు వెదజల్లని పూలకే బతుకమ్మలో పెద్దపీట వేస్తారు. వాసనలు వదులుకోవడమే ఆధ్యాత్మికత అంతిమ లక్ష్యం. ఏ వాసనలూ లేని బతుకమ్మ పూలు ఇదే సత్యాన్ని తెలియజేస్తాయి. అంతేకాదు, ఈ అడవి పూలకు ఓ ప్రత్యేకత ఉంది. వానలు అంతగా కురవకపోయినా శరదృతువు వచ్చేనాటికి తంగేడు పూలు బంగారు కాంతులీనుతూ పుట్టుకొస్తాయి. నేల నెర్రెలు బారినా గునుగు పూలు వెండి వెలుగులు విరజిమ్ముతూ దర్శనమిస్తాయి. గునుగు పూలకు మరో విశేషం కూడా ఉంది! కొమ్మకు పూసిన పూలు మొక్క ఎండిపోయే దాకా అలాగే వాడిపోకుండా ఉండటం వీటి ప్రత్యేకత!

ఈ పూలను పేర్చడం ఓ అందమైన కళ. పదిమందిలో తమ ఇంటి బతుకమ్మ గొప్పగా ఉండాలని సంకల్పించి ఈ క్రతువుకు సిద్ధపడతారు అతివలు. పెద్ద ముత్తయిదువకు చేదోడు వాదోడుగా ఆడబిడ్డలు, వారు కోరింది కోరినట్టు అందించే పని కోడళ్లది. వీళ్లకు బంట్రోతులుగా పిడుగుల్లాంటి పిల్లలు. ఈ పేర్చే కళను మురిపెంగా చూస్తూ.. చలోక్తులు విసిరే పురుషులు. సాయంత్రం బతుకమ్మ ఆటకు.. ఆ అమ్మను తీర్చిదిద్దే సందర్భం నాంది పలుకుతుందన్నమాట! తళతళ మెరిసిపోయే తాంబాలంలో గుమ్మడి ఆకులు పరిచి జీవంతికా దేవికి సుఖాసనం వేస్తారు.ఆపై తంగేడు పూలతో అమ్మపాదాలకు బంగారు పట్టీలు చుడతారు. రకరకాల రంగులద్ది గునుగు పూలను దొంతరలుగా పేరుస్తూ చీర చుడతారు. మధ్యలో చేమంతులు వచ్చి సంతసం పంచుకుంటాయి. మా చోటెక్కడా అని బంతులు ఎగిరి గంతులు వేస్తాయి. బీరిపోతున్న బీరపూలను ఏ ముదితో అందుకొని కట్ల పూల వరుసలో దూరుస్తుంది. గుంభనంగా ఉండే గుమ్మడి పూలను అలంకరించడం అందరి తరం కాదు! వాటిని ఎంత అందంగా అమరిస్తే.. బతుకమ్మ అంతగా ముచ్చటగొలుపుతుంది. గుత్తులుగా దూసిన చల్లగుత్తుల్లో గుంపులుగా ఉండే చిరుచీమలు పెట్టే చికాకును బతుకమ్మ సందడిలో గుర్తించం!! సీతజడ పూలతో అమ్మవారి జడ అలంకరించి%ొ% చివరిగా కొప్పులో గుమ్మడి పువ్వుంచి అందులో పసుపు గౌరమ్మను ప్రతిష్ఠిస్తారు.పూలతో కొలువుదీరిన బతుకమ్మను కీర్తించే పాటల్లోనూ పుష్పాల ప్రస్తావన కనిపిస్తుంది. బతుకమ్మను తీర్చిదిద్దే పాట, గౌరమ్మను గంగ చెంతకు చేరవేసేటప్పుడు మరో పూల పాట.. ఇలా పూల దేవత అర్చనలో పూల సరాగాలు వినిపిస్తూనే ఉంటాయి.

తొమ్మిది రోజులు ఉయ్యాలో..
నమ్మికా తోడుత ఉయ్యాలో..
అలరి గుమ్మడి పూలు ఉయ్యాలో..
అరుగులు వేయించి ఉయ్యాలో..
గోరంట పూలతో ఉయ్యాలో..
గోడలు కట్టించి ఉయ్యాలో..
తామర పూలతో ఉయ్యాలో..
ద్వారాలు వేయించి ఉయ్యాలో..
మొగలి పూలతో ఉయ్యాలో..
మొగరాలు వేయించి ఉయ్యాలో..

ఇలా బతుకమ్మను పూలతో పేర్చే విధానాన్ని పాడుకుంటారు.

బతుకమ్మను సాగనంపే సందర్భంలోనూ ఆ తల్లిని కొలువు దీర్చిన పూల సంగతులన్నీ ఒక్కొక్కటిగా చెబుతూ పాడుకుంటారు.

తంగెడు పూవుల్ల చందమామ..
బతుకమ్మ పోతుంది చందమామ..
పోతె పోతివిగాని చందమామ..
మళ్లెప్పుడొస్తావు చందమామ యాడాదికోసారి చందమామ..
నువ్వొచ్చి పోవమ్మ చందమామ బీరాయి పూవుల్ల చందమామ..
బతుకమ్మ పోతుంది చందమామ కాకర పూవుల్ల చందమామ..
బతుకమ్మ పోతుంది చందమామ..


ఈ విధంగా పండుగలో ప్రతి సన్నివేశంలోనూ పూలను తలుచుకుంటూ ఉంటారు మగువలు. శివుడి ముద్దులగుమ్మగా భావించే ఈ పూలగుత్తుల బొమ్మను తొమ్మిది రోజులు సందడిగా పూజించి పల్లె తెలంగాణం పరవశిస్తుంది. మంత్రోక్త పూజలు రాకున్నా.. పూలతంత్రంతో ఆ తల్లిని మనసారా అర్చిస్తారు. లయబద్ధంగా ఆడుతూ, శ్రుతి తప్పకుండా పాడుతూ.. అందమైన గీతాలతో నాదోపాసన చేస్తారు. ఈ పూల పండుగలో మనమూ భాగమై పరవశిద్దాం.

# దీపాల కాంతిలో పెంచేయొచ్చు!





ఇంట్లో, ఆఫీసు టేబుళ్ల మీద పచ్చదనం పరుచుకుంటే ఆ అందమే వేరు. అలా పెంచుకోగలిగిన మొక్కల్లో రెక్స్ బిగోనియా ఒకటి. తగినంత వెలుతురు అందిస్తే చాలు....సులువుగా ఎదుగుతుందీ మొక్క. అందుకే ఎండ రాకపోయినా కాంతి ఎక్కువగా వచ్చే కిటికీలు, బాల్కనీ వంటి చోట్ల దీన్ని పెంచుకోవచ్చు. పెద్ద పెద్ద ఆకులపై రంగులు చల్లినట్లు చుక్కలు, చారలతో ఈ మొక్క ఆకట్టుకుంటుంది. ఇది సాధారణంగా ఎరుపు, గులాబీ, ఊదా వంటి ఎన్నో రంగుల్లో లభిస్తోంది. వీటికి పూలు వస్తాయి కానీ కాస్త చిన్నగా ఉంటాయి. వీటిని ఇతర మొక్కల మధ్య నాటుకున్నా అందంగా పెరుగుతాయి. ఆకుని కత్తిరించి మట్టిలో నాటుకున్నా సరే... చక్కగా ఎదుగుతుంది. ఈ మొక్కను నాటుకునేటప్పుడు మట్టిలో కోకోపీట్, వర్మికంపోస్ట్, కాస్త ఇసుక కలిపితే చాలు. చక్కగా ఎదుగుతుంది. వీటిని పెంచే చోట గాలిలో తేమ అవసరం. వాతావరణం పొడిగా ఉన్నప్పుడు కాసిని నీళ్లను మొక్క చుట్టూ గాలిలో స్ప్రే చేయాలి. అలాని నీళ్లు ఎక్కువగా పోస్తే మొక్క కుళ్లిపోవచ్చు. రెండువారాలకోసారి నీటిలో కరిగే ఎరువుని మొక్కకు అందిస్తే ఆరోగ్యంగా పెరుగుతుంది.



## మంచూరియా గ్రేవీ..

ఇంట్లో వెజ్ మంచూరియా చేయడం తెలుసు. అయితే దానికి సంబంధించిన గ్రేవీ తయారీ మాత్రం సరిగ్గా కుదరడంలేదు. ఇందుకు ఏమేం జాగ్రత్తలు తీసుకోవాలి?

మంచూరియా గ్రేవీ కోసం సన్నగా తరిగిన ఉల్లికాడలూ, అల్లం, వెల్లుల్లీ, పచ్చిమిర్చీ, సోయా సాస్, వెనిగర్, కూరగాయలు ఉడికించిన నీరూ, మిరియాల పొడీ, తగినంత ఉప్పు తీసుకోవాలి. ప్రత్యేకమైన రుచి కావాలనుకుంటే సాధారణ వెనిగర్‌కు బదులు బాల్సమిక్ వెనిగర్ వాడుకోవచ్చు. మొదట ఉల్లికాడలు, అల్లం, వెల్లుల్లి, పచ్చిమిర్చిని నూనెలో వేయించుకోవాలి. తరవాత నీళ్లూ, సోయాసాస్, ఉప్పు, మిరియాల పొడీ వేసుకోవాలి. తరవాత చెంచా మొక్కజొన్న పిండిని కొద్దిగా నీళ్లలో కలిపి ఈ గ్రేవీలో వేయాలి. ఇది మనకు ఎంత చిక్కగా కావాలనుకునేదాన్ని బట్టి అంతసేపు ఉడికించుకోవాలి. గ్రేవీ రుచికరంగా రావాలంటే నీళ్లకు బదులు కూరగాయలు ఉడికించిన నీరు వాడుకోవచ్చు. ఇది చిక్కగా అయ్యాక ముందుగానే వేయించుకున్న మంచూరియా వేసి, రెండు నిమిషాల పాటు ఉడకనివ్వాలి. ఇప్పుడు చిటికెడు ఉప్పూ, పంచదారతోపాటు చెంచా వెనిగర్ వేసుకుంటే సరిపోతుంది. ఒకవేళ గ్రేవీ పలచబడినట్లు అనిపిస్తే ఇంకొంచెం మొక్కజొన్నపిండిని నీళ్లలో కలిపి అందులో వేస్తే చాలు.

అలాగే మంచూరియా ఉండల తయారీలోనూ కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే మంచిది. సన్నగా తరిగిన కూరగాయ ముక్కలకు రెండు చెంచాల చొప్పున మైదా, మొక్కజొన్నపిండీ, ఉప్పూ, మిరియాల పొడి కలిపి 15 నిమిషాలపాటు పక్కన పెట్టుకోవాలి. కూరగాయల ముక్కల నుంచి వచ్చిన నీటితో చక్కగా ఉండలు చేసుకోవచ్చు. ఒకవేళ మైదా మొక్కజొన్నపిండి తక్కువైతే నీరు ఎక్కువగా వచ్చి ఉండ కట్టడానికి వీలుకాదు. అంతేకాదు ఉండలు నూనెలో వేయగానే విడిపోతాయి. అలాంటి సందేహం ఉన్నప్పుడు కోడిగుడ్డు తెల్లసొన రెండు చెంచాలు కలుపుకోవచ్చు. ఉండలను ఓ అర నిమిషం పెద్ద మంటపై ఉంచి.. తరవాత మంట తగ్గించి వేయించుకుని తీసుకుంటే చాలు.

# బుజ్జాయికి బొజ్జనిండుగా!

పసిపిల్లలకు ఏం పెట్టవచ్చు.. ఏం పెట్టకూడదు అనే విషయంలో బోలెడు సందేహాలు. పెట్టే ఆహారం సరైంది కాకపోతే చిన్నారి ఆరోగ్యానికే ఇబ్బంది. అందుకే వారికి ఏడాది నిండేవరకు ఎప్పుడు ఎలాంటి ఆహారం అందివ్వాలో తెలుసుకోవడం మంచిది. లిపసిపిల్లలకు తల్లిపాలు ఎంత అవసరం. అవి అందనప్పుడు ప్రత్యామ్నాయం ఏంటి? పసిపిల్లలు తల్లిపాలు ఎంత తాగితే అంత తాగించడం మంచిది. ఒకవేళ తల్లిపాలు అందకపోతే వారికి పాల పొడులు ఉత్తమం. గేదె, ఆవు పాలలో ప్రొటీన్, ఫ్యాట్.. ఎక్కువగా ఉంటాయి. నిజానికి వీరికి ప్రొటీన్ మరీ అంత అవసరం ఉండదు. పైగా కొందరు శిశువులకి ప్రొటీన్ అలర్జీ ఉండొచ్చు. జీర్ణవ్యవస్థ సమస్యలు రావచ్చు. అందుకే ఏడాది నిండాకే గేదె, ఆవు పాలు పట్టాలి.

**ఎన్నో నెల నుంచి ఇతర ఆహార పదార్థాలను పెట్టొచ్చు?**

ఆరు నెలల తరవాత ఘన పదార్థాలను ఇవ్వడం మొదలుపెట్టాలి. బియ్యం జావ మొదట అలవాటు చేయాలి. అది తేలిగ్గా అరుగుతుంది. దాన్ని ఎలా తయారు చేయాలంటే... ముందుగా బియ్యాన్ని ఓ ఆరు గంటలు నానబెట్టి... తరువాత నీడలో ఆరబెట్టి పొడి చేయాలి. బియ్యం నానడం వల్ల త్వరగా అరుగుతుంది. ఈ పొడిలో నీళ్లు కలిపి జావలా కాయాలి. ఇది ఎంత పల్చగా ఉంటే అంత మంచిది. ఉగ్గు అనేది ఎనిమిది నెలల తరువాత పెట్టాలి. దీనికోసం మూడు కప్పుల బియ్యానికి కప్పు పప్పు తీసుకోవాలి. వీటిని రాత్రంతా నానబెట్టి ఆతరువాత ఆరబెట్టి పొడి చేసుకోవాలి. దీన్ని ఉడికించి పెట్టొచ్చు. దీంతోపాటు పసిపిల్లలకు రాగులు చాలా మంచివి. వీటిని మొలకలు కట్టించి... కాస్త వేయించి పొడి చేసి జల్లించాలి. దీన్ని జావలా చేసి అందివ్వాలి. ఇలా ఇవ్వడం వల్ల ఆకలి పెంచే ఏఆర్ఎస్ అనే ఎంజైము జీర్ణాశయంలో విడుదలవుతుంది. అలానే చిన్నారులకు ఏ చిరుధాన్యాలు పెట్టినా ఇలానే మొలకలు కట్టించి ఇవ్వాలి. అన్నీ ఒకేసారి కాకుండా ఒకదాని తరువాత మరొకటి పెంచుకుంటే మంచిది. అలానే ఎనిమిదో నెల నుంచీ పొట్టుతీసి సన్నగా తురిమిన బంగాళాదుంప, క్యారెట్ వంటివీ ఈ జావలో కలపొచ్చు. బాగా పండిన అరటి, సపోట, బొప్పాయి మంచివి. ఏడో నెల నుంచి ఈ పండ్లు అలవాటు చేయొచ్చు. తొమ్మిదో నెల రాగానే ఉడికించిన గుడ్డులోని పసుపు సొన పెట్టాలి. తొలిసారి రెండు చెంచాలు తినిపించాలి. వారికి పడుతుందో లేదో ఓ రెండుమూడు రోజులు గమనించాలి. పన్నెండు నెలలు నిండాక పూర్తిగా గుడ్డును పెట్టొచ్చు. అలానే చేపలు కూడా ఏడాది నిండాకే అలవాటు చేయాలి.

**డీహైడ్రేషన్‌ రాకుండా నీళ్లు తాగించమంటారు ఎప్పట్నుంచీ అలవాటు చేయాలి?**

తల్లిపాలు తాగే పిల్లలకు ఆరు నెలల వరకూ నీళ్లేమీ తాగించాల్సిన అవసరం లేదు. పోత పాల పిల్లలకు కాచి చల్లార్చిన నీళ్లు మధ్య మధ్యలో ఇస్తూనే ఉండాలి. ఏడో నెల నుంచైతే ఏ చిన్నారులకైనా పప్పులు, కూరగాయలు ఉడికించిన నీళ్లు తాగించడం అలవాటు చేయాలి. వాటిలో ఎన్నో పోషకాలు ఉంటాయి. వీటిని అంత త్వరగా ఇష్టపడరు కానీ.. తప్పనిసరిగా తాగించాలి.

## దసరా తర్వాత సీఎం రాజీనామా.. బీజేపీ ప్రెసిడెంట్ వ్యాఖ్యలు



**బెంగుళూరు-నవభూమి:** కర్ణాటకలో ముఖ్యమంత్రి సిద్దరామయ్య(రాజీనామాపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బీవై విజయేంద్ర కీలక వ్యాఖ్యలు చేశారు. మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ భూకేటాయింపుల కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న సిద్దరామయ్య దసరా తర్వాత రాజీనామా చేయవచ్చని ఆయన ఆదివారం అన్నారు. మా పాదయాత్ర ముగిసిన వెంటనే, కౌంట్‌డౌన్ ప్రారంభమైందన్నారు. దసరా తర్వాత ముఖ్యమంత్రి ఎప్పుడైనా రాజీనామా చేయవచ్చన్నారు. ముఖ్యమంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ బెంగళూరు నుంచి మైసూర్ వరకు పాదయాత్ర చేపట్టింది. ఈ క్రమంలోనే ముఖ్యమంత్రి రాజీనామా అంశాన్ని ఢిల్లీలోని కాంగ్రెస్ హైకమాండ్ తీవ్రంగా పరిశీలిస్తోందని విజయేంద్ర అన్నారు. ఈ విషయం సిద్దరామయ్యకు కూడా తెలుసని చెప్పారు. అందుకే తానే ముఖ్యమంత్రిగా ఉంటానని సీఎం సిద్దరామయ్య రోజూ మీడియాలో క్లారిటీ ఇస్తున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నారు. కానీ సీనియర్ మంత్రి సతీష్ జార్కిహోలిని ఢిల్లీకి ఎందుకు పంపారని ప్రశ్నించారు. సిద్దరామయ్య నేతృత్వంలోని ఈ అవినీతి కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రానికి శాపంగా మారిందని ఆరోపించారు.




## ఓలా ఎలక్ట్రిక్ షేర్లు డమాల్.. కునాల్ వర్సెస్ భవిష్ అగర్వాల్ సోషల్ మీడియా వార్ కారణమా..?!



**న్యూఢిల్లీ-నవభూమి:** ప్రముఖ కమెడియన్ కునాల్ కమ్రా, ఓలా ఎలక్ట్రిక్ సీఈఓ భవిష్ అగర్వాల్ మధ్య సోషల్ మీడియాలో తలెత్తిన వివాదం.. ఓలా ఎలక్ట్రిక్ షేర్ భారీ పతనానికి కారణమైంది. ఐపీఓ ద్వారా ఇటీవలే దేశీయ స్టాక్ మార్కెట్లలో ఓలా ఎలక్ట్రిక్ లిస్టింగ్ అయింది. కానీ, ఓలా ఎలక్ట్రిక్ తన స్కూటర్ల సర్వీసింగ్ తదితర సేవలపై సోషల్ మీడియాలో కస్టమర్లు చేస్తున్న ఫిర్యాదులపై కునాల్ కమ్రా.. ఎక్స్ (మాజీ ట్విట్టర్)లో పోస్ట్ పెట్టడంతో వివాదం మొదలైంది. ఇటీవల 48 శాతం పతనమైన ఓలా ఎలక్ట్రిక్ షేర్ సోమవారం ఎన్ఎస్ఈలో 8 శాతం నష్టంతో రూ.90.37 వద్ద ట్రేడయింది.%ఓలా ఎలక్ట్రిక్ సంస్థలకు తగినన్ని సర్వీస్ సెంటర్లు లేవని, ఫలితంగా కస్టమర్లు విసుగెత్తి పోతున్నారని కునాల్ కమ్రా చేసిన పోస్టుపై భవిష్ అగర్వాల్ రియాక్టయ్యారు. మీ కామెడీ కెరీర్ పూర్తి కాగానే ఇలా పెయిడ్ పోస్టులు పెడుతున్నావని అంటూ.. తమ ఓలా సర్వీస్ స్టేషన్ వద్ద డ్యూటీ చేస్తే కామెడీ షోలతో వచ్చే ఆదాయం కంటే ఎక్కువ ఇస్తానంటూ ప్రతిగా పోస్టు పెట్టారు. కునాల్ కమ్రా కూడా అసంతృప్తిగా ఉన్న కస్టమర్లకు పూర్తిగా రీఫండ్ చేస్తారా అంటూ.. భవిష్ అగర్వాల్‌ను సవాల్ చేశారు.ఓలా ఎలక్ట్రిక్ సీఈఓ భవిష్ అగర్వాల్, కమెడియన్ కునాల్ కమ్రా మధ్య నెటిజన్లు తమ అభిప్రాయాలు షేర్ చేశారు. కస్టమర్ల ఇబ్బందులను పట్టించుకోకుండా ఓ కమెడియన్‌తో వాదనకు దిగడం సరి కాదంటూ భవిష్ అగర్వాల్ తీరును కొందరు నిరసించారు. కునాల్ కమ్రా వంటి వ్యక్తుల పోస్టులు పట్టించుకోవద్దని మరికొందరు వ్యాఖ్యానించారు.

## ప్రారంభ లాభాలు ఆవిరి.. అమ్మకాల ఒత్తిడితో నష్టాలతో ముగిసిన స్టాక్ మార్కెట్లు.. !



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశీయ స్టాక్ మార్కెట్లు నష్టాల నుంచి బయటకు రాలేదు. వరుసగా ఆరో సెషన్‌లో సోమవారం ఈక్విటీ మార్కెట్లలో ప్రారంభంలో లాభాలు గడించినా.. అన్ని సెక్టార్ల షేర్లు అమ్మకాల ఒత్తిడితో నష్టాలతో ముగిశాయి. దీంతో బీఎస్ఈ ఇండెక్స్ సెన్సెక్స్ 638.45 (0.78 శాతం) పాయింట్లు నష్టపోయి 81,050 పాయింట్ల వద్ద స్థిర పడింది. మరో వైపు ఎన్ఎస్ఈ సూచీ నిఫ్టీ 218.85 (0.89 శాతం) పాయింట్లు నష్టపోయి 24,795.75 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ-50 లో 50 స్టాక్స్‌కు 40 స్టాక్స్ నష్టాలతో ముగిశాయి. అదానీ పోర్ట్స్, బీఈఎల్, ఎన్టీపీసీ, కోల్ ఇండియా, అదానీ ఎంటర్ ప్రైజెస్, తదితర స్టాక్స్ 4.29 శాతం వరకూ నష్టపోయాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ 2.01 శాతం, స్మాల్ క్యాప్ 2.75 శాతం నష్టాలతో ముగిశాయి. ట్రెంట్, మహీంద్రా అండ్ మహీంద్రా, భారతీ ఎయిర్ టెల్, ఐటీసీ, బజాజ్ ఫైనాన్స్ తదితర పది స్టాక్స్ 1.86 శాతం వరకూ లాభ పడ్డాయి.బీఎస్ఈ-30 ఇండెక్స్ సెన్సెక్స్‌లో 30 స్టాక్స్‌కు 23 స్టాక్స్ నష్టాలతో ముగిశాయి. అదానీ పోర్ట్స్, ఎన్టీపీసీ, భారతీయ స్టేట్ బ్యాంక్ (ఎస్బీఐ), పవర్ గ్రిడ్ కార్పొరేషన్ తదితర స్టాక్స్ పతనం అయ్యాయి. మరోవైపు ఐటీసీ, భారతీ ఎయిర్ టెల్, మహీంద్రా అండ్ మహీంద్రా, బజాజ్ ఫైనాన్స్, ఇన్ఫోసిస్, టీసీఎస్, టెక్ మహీంద్రా లాభాలతో ముగిశాయి. నిఫ్టీ ఐటీ ఇండెక్స్ మినహా అన్ని సెక్టార్ల ఇండెక్సులు నష్టాలతో స్థిర పడ్డాయి. పీఎస్‌యూ బ్యాంకు, మీడియా ఇండెక్సులు మూడు శాతం పై చిలుకు చొప్పున దారుణంగా నష్టపోయాయి. కేంద్ర చమురు సంస్థలు, మెటల్ ఇండెక్స్ రెండు శాతానికి పైగా, బ్యాంక్ నిఫ్టీ, ఫైనాన్సియల్ సర్వీసెస్, ప్రైవేట్ బ్యాంక్, రియాల్టీ, కన్జ్యూమర్ డ్యూరబుల్స్ ఒక శాతానికి పైగా నష్టపోయాయి.

## జొమాటో సీఈవోకు చేదు అనుభవం.. మాల్ లిఫ్ట్‌లోకి అనుమతించని సిబ్బంది




**న్యూఢిల్లీ-నవభూమి:** జొమాటో సీఈవో దీపిందర్ గోయల్ డెలివరీ బాయ్ అవతారం ఎత్తారు. విధుల్లో ఉన్న సమయంలో తన డెలివరీ ఏజెంట్లకు ఎదురవుతోన్న ఇబ్బందికర పరిస్థితుల్ని తెలుసుకునేందుకు భార్య గ్రేసియా మనోజ్‌తో కలిసి డెలివరీ ఏజెంట్‌గా విధులు నిర్వర్తించారు. ఈ క్రమంలో ఆయనకు ఓ చేదు అనుభవం ఎదురైంది. ఆర్డర్ కలెక్ట్ చేసుకునేందుకు ఓ మాల్‌కు వెళ్లగా.. అక్కడ ఆయన్ని లిఫ్ట్‌లోకి అనుమతించలేదు. తనకు ఎదురైన ఈ అనుభవం గురించి దీపిందర్ సోషల్ మీడియా ద్వారా పంచుకున్నారు.

# బంగారం కొనాలనుకుంటున్నారా.. ఇదే మంచి సమయం..



**న్యూఢిల్లీ-నవభూమి:** బంగారం అంటే భారతీయులకు ఎంతో ఇష్టం. ఏ మాత్రం డబ్బులు ఉన్నా పసిడి కొన్ని పెట్టుకుందామనుకుంటారు. భవిష్యత్తులో ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా.. మన దగ్గర ఉన్న బంగారమే ఆస్తి అవుతుందని చాలా మంది పేద, మధ్య తరగతి ప్రజలు సైతం బంగారం (కొనేందుకు ఆసక్తి చూపిస్తుంటారు. ముఖ్యంగా పేద, మధ్య తరగతి ప్రజలు బంగారం కొనేటప్పుడు చూసేది ధర, గతంలో ధర ఎలా ఉంది, భవిష్యత్తులో తగ్గుతుందా, పెరుగుతుందా అని ఆలోచిస్తూ ఉంటారు. ఇలా గత కొద్దిరోజులుగా బంగారం ధరలు ఎలా ఉన్నాయో చూసి పెరిగితే కొద్ది రోజులు ఆగుదామని, ధర తగ్గితే వెంటనే కొనుగోలు చేస్తుంటారు. మరి ఈరోజు (7 అక్టోబర్ 2024) బంగారం, వెండి ధరలు తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలతో సహా, దేశంలోని ప్రధాన నగరాల్లో ఏ విధంగా ఉన్నాయో చూద్దాం.

బంగారం ధరలు ద్రవ్యోల్బణం, అంతర్జాతీయ పరిస్థితుల్లో మార్పు, సెంట్రల్ బ్యాంక్ గోల్డ్ రిజర్వ్, వడ్డీ రేట్లలో హెచ్చుతగ్గులు, నగల మార్కెట్‌లతో సహా అనేక పరిణామాల ప్రభావం బంగారం, వెండి ధరలపై ఆధారపడి ఉంటాయి.హైదరాబాలో 22 క్యారెట్ల బంగారం ధర చూసుకుంటే అక్టోబర్ 6 ఆదివారం ధరతో పోలిస్తే అక్టోబర్ 7 సోమవారం బంగారం ధర స్వల్పంగా తగ్గింది. గ్రాముకు ఒక రూపాయి ధర తగ్గింది. గ్రాము బంగారం ధర రూ.7,119గా ఉండగా, పది గ్రాముల బంగారం ధర రూ.71,190గా ఉంది. 24 క్యారెట్ల బంగారం ధర గ్రాము 7,766గా ఉండగా, పది గ్రాముల బంగారం ధర రూ.77,660గా ఉంది. ఇవే ధరలు తెలుగు రాష్ట్రాల్లో ప్రధాన నగరాలైన విజయవాడ, విశాఖ పట్నంతో పాటు తెలంగాణలోని వరంగల్ లో కూడా కొనసాగుతున్నాయి.

**వివిధ నగరాల్లో బంగారం ధరలు**

దేశ రాజధాని ఢిల్లీలో 22, 24 క్యారెట్ల బంగారానికి సంబంధించి ఆదివారంతో పోలిస్తే సోమవారం గ్రాముకు రూపాయి తగ్గింది. 22 క్యారెట్ల గ్రాము బంగారం ధర రూ. 7,134గా ఉంది. పది గ్రాముల బంగారం ధర రూ.71,340గా ఉంది. 24 క్యారెట్ల బంగారం గ్రాము ధర ఢిల్లీలో రూ.7,781గా ఉంది. అదే పది గ్రాముల బంగారం అయితే రూ.77,810గా ఉంది.

దేశ ఆర్థిక రాజధాని ముంబైలో 22 క్యారెట్ల బంగారం ధర గ్రాము రూ.7,119గా ఉంది. అదే పది గ్రాముల బంగారం ధర రూ.71,190గా ఉంది. ప్యూర్ గోల్డ్ 24 క్యారెట్ల బంగారం గ్రాము ధర రూ.7,766గా ఉంది. పది గ్రాముల బంగారం ధర రూ.77,660గా ఉంది.

చెన్నైలో 22 క్యారెట్ల గ్రాము బంగారం ధర రూ. 7,119గా ఉండగా, పది గ్రాముల బంగారం ధర రూ.71,190గా ఉంది. అదే 24 క్యారెట్ల బంగారం అయితే గ్రాము ధర రూ.7,766కు చేరుకోగా, పది గ్రాముల బంగారం ధర రూ.77,660గా ఉంది.

దేశంలో వెండి ధరలు

దేశంలోని ప్రధాన నగరాల్లో వెండి ధరలు చూస్తే.. ఆదివారంతో పోలిస్తే సోమవారం స్వల్పంగా ధర తగ్గింది. దీంతో హైదరాబాద్ సహా తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలైన విజయవాడ, విశాఖపట్టణంతో పాటు తెలంగాణలోని వరంగల్ నగరాల్లో నేడు వెండి ధర కిలో రూ.1,02,900గా ఉంది.

## ఐపీఓ ప్రతిపాదన విత్ డ్రా చేసుకున్న హీరో మోటార్స్.. కారణం చెప్పని ఆటోమొబైల్ సంస్థ..!




**న్యూఢిల్లీ-నవభూమి:** ఆటోమొబైల్ విడి భాగాల తయారీ సంస్థ హీరో మోటార్స్ తన ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీఓ) ప్రతిపాదనను ఉపసంహరించుకుంటున్నట్లు తెలిపింది. ఐపీఓకు అనుమతించాలని కోరుతూ సెబీ ముందు దాఖలు చేసిన డ్రాఫ్ట్ రెడ్ హెర్రింగ్ ప్రాస్పెక్టస్ (డీఆర్‌హెచ్‌పీ) పత్రాలను ఈ నెల ఐదో తేదీ (శనివారం) ఉపసంహరించుకున్నది. పవన్ ముంజాల్ సోదరుడి కుమారుడు పంకజ్ ముంజాల్ సారథ్యంలోని హీరో మోటో కార్ప్ అనుబంధ సంస్థ హీరో మోటార్స్ గత ఆగస్టులో సెబీ ముందు ఐపీఓకు అనుమతి కోరుతూ డీఆర్‌హెచ్‌పీ దాఖలు చేసింది.


రూ.500 కోట్ల నిధుల సేకరణ లక్ష్యంతో ఐపీఓకు వెళ్లాలని హీరో మోటార్స్ (%ఎవతీశీ వీశీశీతీం%) తొలుత నిర్ణయించింది. మరో రూ.400 కోట్ల విలువైన షేర్లు గల ఓపీ ముంజాల్ హోల్డింగ్స్, భాగ్యోదయ్ ఇన్వెస్ట్ మెంట్స్, హీరో సైకిల్స్ వాటాను ఆఫర్ ఫర్ సేల్ ద్వారా విక్రయించాలని యోచించారు. ప్రస్తుతం హీరో మోటార్స్ (%ఎవతీశీ వీశీశీతీం%) ప్రమోటర్లకు సంస్థలో 91.65 శాతం వాటా ఉంది. ఓపీ ముంజాల్ కు హీరో మోటార్స్ లో 71.75 శాతం వాటా, భాగ్యోదయ్ ఇన్వెస్ట్ మెంట్స్ కు 6.28 శాతం, హీరో సైకిల్స్ కు 2.03 శాతం వాటాలు ఉన్నాయి. ఆఫర్ ఫర్ సేల్ ద్వారా ఓపీ ముంజాల్ రూ.250 కోట్ల విలువైన షేర్లు, భాగ్యోదయ్ ఇన్వెస్ట్ మెంట్స్ అండ్ హీరో సైకిల్స్ రూ.75 కోట్ల విలువైన షేర్లు విక్రయించాలని భావించారు.టూ వీలర్స్ ప్రత్యేకించి బీఎండబ్ల్యూ, డుకాటీ, హార్లీ డేవిడ్సన్ వంటి గ్లోబల్ సంస్థలకు ఇంజిన్, ట్రాన్స్ మిషన్ కాంపొనెంట్లను హీరో మోటార్స్ అందిస్తున్నది. గత ఆర్థిక సంవత్సరంలో పవర్ ట్రైన్ సొల్యూషన్స్ ద్వారా 49 శాతం ఆదాయం, అల్లాయ్ అండ్ మెటాలిక్ (ఏ అండ్ ఎం) బిజినెస్ సెగ్మెంట్ ద్వారా 51 శాతం ఆదాయం సంపాదించింది. భారత్ నుంచి 59 శాతం రెవెన్యూ, యూరప్ దేశాల నుంచి 29 శాతం, అమెరికా నుంచి 8 శాతం రెవెన్యూ పొందింది.

## పండుగ ఆఫర్లు భళా




**న్యూఢిల్లీ-నవభూమి:** ఈ పండుగ సీజన్‌ను దృష్టిలో పెట్టుకొని ఖాతాదారులను ఆకట్టుకోవడానికి ప్రముఖ ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంకులు పెద్ద ఎత్తునే ఆఫర్లను తెచ్చాయి. నవరాత్రులు, దుర్గా పూజ, దసరా, దీపావళి, భాయ్ దూజ్ పర్వదినాలుండటంతో రుణాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు (ఎఫ్‌డీ), క్రెడిట్ కార్డు ఖర్చులపై వడ్డీరేట్ల సవరణ, డిస్కౌంట్లను వ్యాపారులతో కలిసి ఆయా బ్యాంకర్లు అందిస్తున్నారు. ఐసీఐసీఐ బ్యాంక్ వార్షిక ఫెస్టివ్ బొనాంజా పేరిట ఎలక్ట్రానిక్స్, మొబైల్స్, ఫ్యాషన్, జ్యుయెల్లరీ, ఫర్నీచర్, ట్రావెల్, ఈ-కామర్స్, డైనింగ్ కొనుగోళ్లపై రూ.40,000 వరకు ఆఫర్లు, డిస్కౌంట్లను ఇస్తున్నది. క్రెడిట్/డెబిట్ కార్డులు, ఇంటర్నెట్ బ్యాంకింగ్‌ల వినియోగం ద్వారా పొందవచ్చు. ఐఫోన్ 16, ఇతర యాపిల్ ఉత్పత్తులపైనా ప్రత్యేక ఆఫర్లున్నాయి. ఇక యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబిల్ స్కోర్ ఆధారంగా 8.35 శాతం వడ్డీకే గృహ రుణాన్ని ఆఫర్ చేస్తున్నది. ప్రాసెసింగ్ ఫీజునూ రద్దు చేసింది. దిల్ సే ఓపెన్ సెలబ్రేషన్స్ పేరుతో యాక్సిస్ బ్యాంక్ ముందుకొచ్చింది. వివిధ రకాల బ్రాండ్లపై క్యాష్‌బ్యాక్ ఆఫర్లను పరిచయం చేసింది. ఆన్‌లైన్ షాపింగ్‌పై 25 శాతం వరకు డిస్కౌంట్‌నూ ప్రకటించింది. అలాగే ఎస్బీఐ డెబిట్ కార్డు వినియోగంపై అమెజాన్ షాపింగ్‌లో 10 శాతం ఇన్‌స్టంట్ డిస్కౌంట్ అందుకోవచ్చు. గృహ, వాహన, గోల్డ్ రుణాలపై ఆకర్షణీయ వడ్డీరేట్లను కెనరా బ్యాంక్ ప్రకటించింది. డాక్యుమెంటేషన్, ప్రాసెసింగ్ ఫీజులను ఎత్తివేసింది. బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రత్యేకంగా 400 రోజుల రిటైల్ టర్మ్ డిపాజిట్‌ను పరిచయం చేసింది. గరిష్ఠ వడ్డీరేటు 8.10 శాతంగా ఉన్నది. కస్టమర్ల కోసం ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ కూడా రకరకాల ఆఫర్లను తీసుకొచ్చింది.

## అనారోగ్యం వార్తలపై స్పందించిన
# రతన్ టాటా.. క్లారిటీ



**న్యూఢిల్లీ-నవభూమి:** దేశంలో ప్రముఖ వ్యాపారవేత్త రతన్ టాటా తీవ్ర అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరారని వార్తలు వచ్చాయి. రక్తపోటు తగ్గిన నేపథ్యంలో %×జఖ%లో నిపుణుల బృందం ఆయన పరిస్థితిని పర్యవేక్షిస్తోందని వెలుగులోకి వచ్చింది. ఈ వార్తలపై టాటా సన్స్ మాజీ ఛైర్మన్ రతన్ నావల్ టాటా (86) స్వయంగా స్పందించారు. ఆయన బాగానే ఉన్నారని, సాధారణ రెగ్యులర్ చెకప్ కోసం ఆసుపత్రికి వెళ్లినట్లు చెప్పారు. తనను ఐసీయూలో చేర్చారనే వాదనలు పుకార్లేనని ఆయన పేర్కొన్నారు. ఏమి చింతించాల్సిన పని లేదని స్పష్టం చేశారు. నేను బాగానే ఉన్నానని, ప్రజలు, మీడియా తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయవద్దని అభ్యర్థిస్తున్నట్లు వెల్లడించారు.

రతన్ టాటా 1937 డిసెంబరు 28న ముంబైలో జన్మించారు. ఆయన టాటా గ్రూప్ వ్యవస్థాపకుడు జామ్‌సెట్‌జీ టాటా మునిమనవడు. 1990 నుంచి 2012 వరకు గ్రూప్ ఛైర్మన్‌గా, అక్టోబర్ 2016 నుంచి ఫిబ్రవరి 2017 వరకు తాత్కాలిక ఛైర్మన్‌గా ఉన్నారు. టాటా గ్రూపు ఛారిటబుల్ ట్రస్టులకు రతన్ అధిపతిగా కొనసాగుతున్నారు. 1962లో టాటా గ్రూప్‌లో చేరినప్పుడే టాటా అసలు కథ మొదలైంది. 1990లో గ్రూప్ ఛైర్మన్ కాకముందు వివిధ పదవులు నిర్వహించి క్రమంగా వ్యాపార మెట్లు ఎక్కారు. ఆయన పదవీ కాలంలో టాటా గ్రూప్ దేశీయంగా, విదేశాలలో గణనీయమైన వృద్ధిని, విస్తరణను సాధించింది. టాటా దూరదృష్టి, వ్యూహాత్మక ఆలోచనలు కంపెనీని టెలికాం, రిటైల్, ఆటో వంటి కొత్త పరిశ్రమలలోకి విస్తరించే స్థాయికి చేరాయి.

నాయకత్వంలో

రతన్ టాటా నాయకత్వంలో టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ పబ్లిక్ ఇష్యూని జారీ చేసింది. టాటా మోటార్స్ న్యూయార్క్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో జాబితా చేయబడింది. 1998లో టాటా మోటార్స్ మొట్టమొదటి ఆల్ ఇండియన్ ప్యాసింజర్ కారు టాటా ఇండికాను పరిచయం చేసింది. తదనంతరం టాటా టీ టెట్లీని కొనుగోలు చేసింది. టాటా మోటార్స్ జాగ్వార్ ల్యాండ్ రోవర్‌ను కొనుగోలు చేసింది. టాటా స్టీల్ కోరస్‌ను కొనుగోలు చేసింది. ఇది భారతీయ పరిశ్రమలో టాటా గ్రూప్ ఖ్యాతిని బాగా పెంచింది. టాటా నానో ప్రపంచంలోనే అత్యంత చౌకైన ప్యాసింజర్ కారు ఇది కూడా రతన్ టాటా ఆలోచన ఫలితమే.

హార్వర్డ్

డిసెంబర్ 28, 2012న ఆయన టాటా గ్రూప్ అన్ని కార్యనిర్వాహక బాధ్యతల నుంచి పదవీ విరమణ చేశారు. టాటా ఇప్పుడు పదవీ విరమణ చేసినప్పటికీ, ఆయన ఇప్పటికీ పనిలో నిమగ్నమై ఉన్నారు. ఇటీవల ఆయన భారతీయ ఇ-కామర్స్ కంపెనీ స్నాప్‌డీల్‌లో తన వ్యక్తిగత పెట్టుబడిని పెట్టాడు. దీంతో పాటు ఆయన మరో ఈ -కామర్స్ కంపెనీ అర్బన్ లాడర్, చైనీస్ మొబైల్ కంపెనీ షియోమీలో కూడా పెట్టుబడి పెట్టారు. రతన్ టాటా హార్వర్డ్ నుంచి చదువుకున్నారు. 2010 సంవత్సరంలో ఆయన హార్వర్డ్‌కు 50 మిలియన్ డాలర్ల మొత్తాన్ని విరాళంగా ఇచ్చారు. దీని కారణంగా అక్కడ ఒక కార్యనిర్వాహక కేంద్రం ప్రారంభించబడింది. దానికి టాటా హాల్ అని పేరు పెట్టారు

అనేక అవార్డులు

టాటా అత్యంత ముఖ్యమైన విజయాలలో ఒకటి 2008లో జాగ్వార్ ల్యాండ్ రోవర్‌ను కొనుగోలు చేయడం. ఇది టాటా గ్రూప్ చరిత్రలో ఒక ముఖ్యమైన నిర్ణయం. రతన్ టాటా తనకు అప్పగించిన వారసత్వాన్ని కొత్త స్థాయికి తీసుకెళ్లారు. ఎయిర్ ఇండియాను తన సామ్రాజ్యంలో చేర్చుకున్నారు. దీంతోపాటు దాతృత్వం, కార్పొరేట్ సామాజిక బాధ్యత పట్ల ఆయనకున్న అంకితభావం భారతదేశ రెండు అత్యున్నత పౌర పురస్కారాలైన పద్మ భూషణ్, పద్మ విభూషణ్‌తో సహా లెక్కలేనన్ని గౌరవాలను దక్కించుకునేలా చేశాయి.

## స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులు పెట్టాలనుకుంటున్నారా.. ఇలా చేస్తే ఆకర్షణీయ లాభాలు

**న్యూఢిల్లీ-నవభూమి:** స్టాక్ మార్కెట్లలో పెట్టుబడులు పెట్టాలనుకునే చాలామందికి సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్లు (సిప్స్) మొదటి ప్రాధాన్యతగా ఉంటా యి. ఇందులో ఎంచుకున్న కాలవ్యవధుల మేరకు మ్యూచువల్ ఫండ్ల ద్వారా నిర్దేశిత మొత్తాలను పెట్టుబడిగా పెడుతూపోవచ్చు. ఉదాహరణకు ప్రతి నెలా 5న రూ.10,000 పెట్టుబడిగా పెట్టాలని నిర్ణయిస్తే.. నెలనెలా 5న అంతే మొత్తం ఇన్వెస్ట్ చేస్తూనే ఉండాలి. మార్కెట్ పరిస్థితులతో సంబంధం లేకుండా ఇది కొనసాగుతుంది. దీర్ఘకాలంలో మీరు అధిక రాబడుల్నే అందుకోవచ్చు. అయితే ఇక్కడ 'స్మార్ట్ సిప్' అనే ఆప్షన్ కూడా ఉన్నది. మార్కెట్ పరిస్థితులనుబట్టి ప్రయోజనం పొందే వెసులుబాటు దీనిలో కనిపిస్తున్నది. ఫలితంగా ఎక్కువ లాభాలను మదుపరులు ఇందులో అందుకునే వీలున్నదని చెప్పవచ్చు.మార్కెట్ పరిస్థితులకు తగ్గట్టు పెట్టుబడులపై ఓ నిర్ణయం తీసుకుంటూ ఆకర్షణీయ లాభాలను ఒడిసి పట్టుకునేలా రూపొందించినదే ఈ స్మార్ట్ సిప్. ఒక్కమాటలో చెప్పాలంటే సంప్రదాయ సిప్‌కు ఇదో అప్‌గ్రేడ్ వెర్షన్. స్టాక్ మార్కెట్లు లాభాల్లో ఉన్నప్పుడు పెట్టుబడులు తగ్గిస్తూ, నష్టాల్లోకి జారుకున్నప్పుడు పెంచుతూపోవచ్చు. తద్వారా రిస్క్‌ను తగ్గించుకోవచ్చని, ఇదే సమయంలో మన పెట్టుబడులపై అధిక రాబడులనూ అందుకోవచ్చని నిపుణులు చెప్తున్నారు.మార్కెట్ వాల్యుయేషన్స్ ఆధారంగా పెట్టుబడి మొత్తాలను సర్దుబాటు చేస్తూ స్మార్ట్ సిప్‌లను మ్యూచువల్ ఫండ్స్ కొనసాగిస్తూ ఉంటాయి. సింపుల్‌గా చెప్పాలంటే తక్కువ కొనడం, ఎక్కువ అమ్మడం వీటి వ్యూహం. స్టాక్ మార్కెట్లు లాభాల్లో పరుగులు పెడుతున్నప్పుడు మీ మంత్లీ సిప్ (నిర్దేశిత నెలవారీ పెట్టుబడి) మొత్తం ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌ల్లోకి సాధారణంగానే వెళ్తుంది. కానీ స్టాక్ మార్కెట్లు నష్టాల్లో నడుస్తున్నప్పుడు మీరు పెట్టే పెట్టుబడులు రెట్టింపవుతాయి. అంటే స్టాక్ మార్కెట్లు అప్ ట్రెండ్‌లో ఉన్నప్పుడు షేర్ల ధర ఎక్కువగా ఉంటుంది. అందుకే అప్పుడు స్మార్ట్ సిప్‌లో షేర్లను మ్యూచువల్ ఫండ్స్ మేనేజర్లు తక్కువగా కొంటుంటారు. లాభాల స్వీకరణకు పెద్దపీట వేసి ఉన్న షేర్లను అమ్మేస్తూ ఉంటారు. మార్కెట్ డౌన్ ట్రెండ్‌లో ఉన్నప్పుడు షేర్ల ధర కూడా తగ్గుతుంది. దీంతో వీలైనంత ఎక్కువగా రకరకాల షేర్లను కొనాలని మేనేజర్లు చూస్తారు. మార్కెట్లు పడుతున్నకొద్దీ ఇలా షేర్లను కొంటూనేపోతుంటారు. అందుకే స్మార్ట్ సిప్‌లో మీరు పెట్టే పెట్టుబడులు రెట్టింపవుతాయి. మార్కెట్ మళ్లీ పుంజుకున్నప్పుడు ఆ షేర్లను ఎక్కువ ధరలకు అమ్ముతారు. దీంతో పెట్టుబడులకు పెద్దగా ఆస్కారం ఉండదు. ఫలితంగా ఇన్వెస్టర్లకు లాభాలు కూడా పెరుగుతాయి. ఒకవేళ మార్కెట్లు అదేపనిగా పెరుగుతూపోతుంటే పెట్టుబడులను ఈక్విటీ స్కీముల్లో కాకుండా లిక్విడ్ ఫండ్స్‌ల్లోకి మ్యూచువల్ ఫండ్ మేనేజర్లు మళ్లిస్తారు.



నవభూమి

www.navabhoomi.in
www.epaper.navabhoomi.in

7 | హైదరాబాద్
మంగళవారం
08 । అక్టోబర్ । 2024


## ఎంవీఏ కీలక అడుగు.. 190 సీట్లలో ఏకాభిప్రాయం




**న్యూఢిల్లీ- నవభూమి:** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ త్వరలోనే వెలువడనుండటంతో విపక్ష 'మహా వికాస్ అఘాడి' కూటమి సీట్ల పంపకాలపై కీలక అడుగు పడింది. కూటమి భాగస్వామ్య పక్షాలైన శివసేన శరద్ పవార్ సారథ్యంలో నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ కాంగ్రెస్ మధ్య సీట్ల పంపకాలకు సంబంధించి మొత్తం 288 అసెంబ్లీ స్థానాల్లో 190 సీట్లలో అవగాహన కుదిరింది. మరో 100 సీట్ల విషయంలో భాగస్వామ్య పార్టీలు చర్చలు కొనసాగించనున్నాయి.
సీట్ల పంపకాలను ఖరారు చేసేందుకు ఎంవీఏ నేతలు ముంబైలోని ట్రిడెంట్ హోటల్‌లో సోమవారంనాడు సమావేశమయ్యారు. సుమారు రెండున్నర గంటల సేపు సమావేశం జరిగింది. కాంగ్రెస్ నేతలు నానా పటోలే, బాలాసాహెబ్ థోరట్, విజయ్ వాడెట్టివార్, శివసేన యూబీటీ నుంచి సంజయ్ రౌత్, అనిల్ దేశాయ్, ఎన్‌సీపీ ఎస్‌పీ నుంచి జయంత్ పాటిల్, జితేంద్ర అవధ్, రాజేష్ తోపె, అనిల్ దేశ్‌ముఖ్ పాల్గొన్నారు. భాగస్వాముల మధ్య తక్కిన సీట్లపై ఈ వారంలోనే మరోసారి సమావేశం కావాలని నేతలు నిర్ణయించారు. విదర్భ, ముంబై-కొంకణ్ ప్రాంతం, మరాఠ్వాడా, నార్త్ మహారాష్ట్రంలోని కొన్ని ప్రాంతాలతో సహా సుమారు 100 సీట్ల వ్యవహారం కొలిక్కి రావాల్సి ఉంది. ఎంవీఏ నేతల మధ్య సీట్ల పంపకాలకు సంబంధించిన చర్చలు సానుకూల వాతావరణంలో జరిగినట్టు సమావేశానంతరం మహారాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు నానా పటోలే చెప్పారు. దసరా తర్వాత కొన్ని సీట్లను ఎంవీఏ ప్రకటించే అవకాశం ఉందన్నారు.

## పట్టాలపై తొలగించిన ఫిష్ ప్లేట్లు.. మరో రైలుకు తప్పిన ప్రమాదం



**న్యూఢిల్లీ-నవభూమి:** రైళ్లను పట్టాలు తప్పించి ప్రమాదాలను సృష్టించేందుకు జరుగుతున్న ప్రయత్నాలు ఇటీవల కాలంలో ఆందోళన కలిగిస్తుండగా ఇదే తరహా ఘటన తాజాగా రాజస్థాన్‌లోని బికనెర్‌లో చోటుచేసుకుంది. అగంతకులు కొందరు రైలు పట్టాలపై ఫిష్‌ప్లేట్లు తొలగించడాన్ని సకాలంలో అధికారులు గుర్తించడంతో ప్రమాదం తప్పింది. బికనెర్ అర్బన్ ప్రాంతంలోని చౌకుంతి ఓవర్‌బ్రిడ్జి కింద నున్న రైల్వే ట్రాక్‌పై ఫిష్ ప్లేట్లు ఊడదీసి కనిపించడాన్ని స్థానికులు గుర్తించడంతో అధికారులు సకాలంలో అక్కడకు చేరుకున్నారు.
కాగా, కొందరు యువకులు ఫిష్ ప్లేట్లను తొలగిస్తుండగా స్థానికులు గమనించి గట్టిగా కేకలు వేయడంతో వారు పారిపోయినట్టు తెలిసింది. అనంతరం రైల్వే అధికారులు, ఆర్‌పీఎఫ్‌కు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలికి చేరుకున్నారు. రైల్వే వర్క్‌షాప్ సిబ్బంది అప్పటికిప్పుడు ఫిష్ ప్లేట్లను గట్టిగా బిగించి ట్రాక్‌పై ఎలాంటి ప్రమాదాలు జరక్కుండా చర్యలు తీసుకున్నారు. షిఫ్ ప్లేట్లు తొలగించిన అగంతకులను ఇంతవరకూ గుర్తించలేదు. అయితే, ఇది ఎలాంటి కుట్ర కాదని, సమీపంలో మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన కొందరు యువకుల పనిగా అనుమానిస్తున్నామని రైల్వే అధికారులు తెలిపారు.

## జమ్మూకశ్మీర్‌లో ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతుపై స్పష్టత ఇచ్చిన పీడీపీ




**న్యూఢిల్లీ- నవభూమి:** జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు మరి కొద్ది గంటల్లోనే వెలువడనుండటంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఏ పార్టీకి కానీ, కూటమికి కానీ ప్రభుత్వం ఏర్పాటుకు అవసరమైన మెజారిటీ రాకపోవచ్చంటూ పలు ఎగ్జిట్ పోల్స్ అంచనా వేయడంతో ప్రభుత్వం ఏర్పాటుకు కలిసొచ్చే కాంబినేషన్లు, ముఖ్యంగా పీపుల్స్ డెమోక్రాటిక్ పార్టీ మద్దతు ఎవరికి ఉండవచ్చనే దానిపై ప్రధానంగా చర్చ జరుగుతోంది. దీనిపై పీడీపీ తాజాగా స్పష్టత ఇచ్చింది. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాతే ఏ సెక్యులర్ పార్టీకి మద్దతు ఇవ్వాలనే దానిపై ఒక నిర్ణయం తీసుకుంటామని ఆ పార్టీ పేర్కొంది.
పీడీపీ చీఫ్ మెహబూబా ముఫ్తీ ఇప్పటికే జమ్మూకశ్మీర్‌లో రాబోయేది సెక్యులర్ ప్రభుత్వమేనని, తమ పార్టీ మద్దతు లేకుండా ఎవరూ ప్రభుత్వం ఏర్పాటు చేయలేరని ప్రకటించారు. దీనిపై మెహబూబా ముఫ్తీ చీఫ్ అడ్వయిజర్ ఇల్తిజా ముఫ్తీ సోమవారంనాడు సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో మరింత స్పష్టత ఇచ్చారు. "ఈ విషయంలో మా పార్టీ చాలా స్పష్టంగా ఉంది. ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాతే మద్దతు విషయంలో నిర్ణయం తీసుకుంటాం. సెక్యులర్ ఫ్రంట్‌కు మాత్రమే మా మద్దతు ఉంటుంది" అని చెప్పారు.

**ఎగ్జిట్ పోల్స్ ఏం చెప్పాయంటే?**

జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్-ఎన్‌సీ కూటమికి అడ్వాంటేజ్ ఉంటుందని మెజారిటీ ఎగ్జిట్ పోల్స్ జోస్యం చెప్పాయి. అయితే నేషనల్ కాన్ఫరెన్స్ ఉపాధ్యక్షుడు ఒమర్ అబ్దుల్లా మాత్రం, ఎగ్జిట్ పోల్స్ కాలక్షేపం కోసమేనని, ఫలితాలు తమ పార్టీకే అనుకూలంగా రానున్నాయని చెప్పారు. ఎన్‌సీ-కాంగ్రెస్ కూటమి అధికారానికి చేరువ వరకూ రావచ్చని, ఏకైక పెద్ద పార్టీగా మాత్రం ఎన్‌సీ నిలుస్తుందని పలు ఎగ్జిట్ పోల్స్ చెప్పాయి. ఎన్సీ-కాంగ్రెస్ కూటమి 45 నుంచి 50 సీట్లు గెలుచుకోవచ్చని, బీజేపీ 23-27 సీట్లతో రెండో పెద్ద పార్టీగా నిలుస్తుందని, పీడీపీ 5-12 సీట్ల వరకూ గెలుచుకోవచ్చని అంచనా వేశాయి. 370 అధికరణ రద్దుకు ముందు జరిగిన 2014 అసెంబ్లీ ఎన్నికల్లో 65.62 శాతం పోలింగ్ నమోదు కాగా, అధికరణ రద్దు తర్వాత తొలిసారి జరిగిన 2024 ఎన్నికల్లో 63.45 శాతం పోలింగ్ నమోదైంది. ఈనెల 8న ఎన్నికల ఫలితాలు వెలువడనున్నాయి.

## బొగ్గు గనిలో పేలుడు, ఏడుగురు దుర్మరణం



**న్యూఢిల్లీ-నవభూమి:** పశ్చిమ బెంగాల్‌లోని బీర్భూమ్ జిల్లాలో సోమవారం ఓ బొగ్గుగనిలో పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఏడుగురు కార్మికులు చనిపోగా, పలువురు గాయపడ్డారు. వీరిలో కొందరి పరిస్థితి ప్రమాదకరంగా ఉంది. క్షతగాత్రులను సమీప ఆసుపత్రికి తరలించారు. గంగారామ్‌చక్ మైనింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కు చెందిన గనిలో బొగ్గు వెలికి తీసేందుకు బాంబులు పెడుతుండగా ఈ పేలుడు సంభవించినట్టు తెలుస్తోంది. పేలుడు శబ్దంతో పరుగులు కార్మికులు పరుగులు తీశారు. ప్రమాదం విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి చేరుకుని సహాయక కార్యక్రమాలు చేపట్టారు. అక్కడే చిక్కుకున్న పలువురు కార్మికులను సురక్షితంగా బయటకు తరలించారు. పేలుడు ధాటికి బొగ్గు గని సమీపంలోని పార్కింగ్ వాహనాలు సైతం ధ్వంసమయ్యాయి. స్థానిక బీజేపీ ఎమ్మెల్యే సైతం సహాయక కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు. ఇంతవరకూ 3 మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని, సహాయక కార్యక్రమాలు కొనసాగుతున్నాయని సీనియర్ పోలీసు అధికారి ఒకరు తెలిపారు.

# పవన్ - తమిళనాడు- బీజేపీ... !



**న్యూఢిల్లీ-నవభూమి:** సనాతన ధర్మాన్ని పరిరక్షిస్తానంటూ.. ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టిన జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. అనూహ్యంగా తమిళనాడుపై దృష్టి పెట్టారు. నిజంగానే ఇది అనూహ్యమైన సంఘటన. ఎవరూ ఊహించలేదు కూడా. సనాతన ధర్మాన్ని వైరస్‌తో పోల్చారంటూ.. ఆ రాష్ట్ర ప్రస్తుత ఉప ముఖ్యమంత్రి ఉదయనిధిని పవన్ నేరుగా టార్గెట్ చేసుకున్నారు. అయితే.. వాస్తవానికి ఆయన తాత, మాజీ సీఎం కరుణానిధి కూడా అనేక సందర్భంగాల్లో రాముడు లేడు.. రాక్షసుడు లేడు.. రామాయణం బూటకం అంటూ వ్యాఖ్యలు చేశారు. ఒక్క తమిళనాడే కాదు.. కర్ణాటక, గోవా, కేరళలోనూ సనాతన ధర్మాన్ని విమర్శించేవారు.. ప్రసాదాన్ని కూడా పలహారంగా భావించే నాయకులు ఉన్నారు. అయితే.. తమిళనాడు మాత్రమే పవన్ ఎందుకు టార్గెట్ చేసుకున్నారన్నది ప్రశ్న. నిరంతరం.. ఆయన ఇటీవల తమిళనాడులో హైందవం విలసిల్లిందని.. రుషులు, యోగుల భూమిగా ఆ రాష్ట్రం వినుతికెక్కిందని చెప్పుకొచ్చారు. ఇలా పవన్ పదే పదే తమిళనా డులో హిందూత్వను ప్రోత్సహించేలా మాట్లాడడం వెనుక రీజనేంటి? అనేది చర్చ. వచ్చే 2026లో తమిళనాడులో అసెంబ్లీ ఎన్నికలు ఉన్నాయి. ఒకవేళ ఈ లోగా జమిలికి రాష్ట్రాలు జై కొడితే.. 2027లో ఎన్నికలు జరగనున్నాయి. ఎలా చూసుకున్నా.. మరో రెండేళ్లలో తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ప్రస్తుతం అక్కడ ప్రధాన ప్రతిపక్షం అన్నాడీఎంకే వీక్‌గా ఉంది. ఈ గ్యాప్‌ను తాము అందిపుచ్చుకునేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది. ఈ క్రమంలోనే మాజీ ఐపీఎస్ అన్నామలైని రంగంలోకి దింపింది. ఆయన ఆయన ఊపు సరిపోవడం లేదు. లౌకిక వాదిగా ఆయన ముద్ర వేసుకున్నారు. దానికి ఏడాది గుర్తుగా క్షిపణుల వాన ఈ నేపథ్యంలో తమ మిత్రపక్షంగా ఉన్న జనసేన అధినేత పవన్‌ను.. లడ్డూ వివాదం నేపథ్యంలో వ్యూహా త్మకంగా బీజేపీ పెద్దలే తమిళనాడును ఫోకస్ చేసేలా.. హిందూత్వను తమకు అనుకూలంగా మార్చుకు నేలా ప్రయత్నిస్తున్నారన్న వాదన వినిపిస్తోంది. పవన్‌కల్యాణ్‌కు అక్కడ పార్టీ లేక పోవచ్చు. ఆయన నేరుగా బీజేపీకి ప్రచారం చేయకపోవచ్చు. కానీ, ఆయన వ్యాఖ్యలు తమకు అంతర్గతంగా తమిళనాడులో ఉపయోగపడతాయన్న ఆలోచనలో కమల నాథులు ఉన్నట్టు తెలుస్తోంది. ఈ కారణంగానే.. పవన్‌ను ఆ దిశగా ప్రోత్సహిస్తున్నారా? అనే చర్చ సాగుతుండడం గమనార్హం.

# వ్యోమగాములకు ఆహారాన్ని సిద్ధం చేయడానికి గ్రహశకలాలు!



**న్యూఢిల్లీ- నవభూమి:** అంతరిక్ష యాత్రలలో ఉండే వ్యోమగాములకు ఆహార భద్రతను నిర్ధారించడానికి శాస్త్రవేత్తలు ఓ ఆసక్తికర విషయాన్ని తెరపైకి తెచ్చారు. ఇందులో భాగంగా... వ్యోమగాములు తమ పోషక అవసరాలను తీర్చుకోవడానికి గ్రహశకలాలను ఉపయోగించవచ్చని సూచిస్తున్నారు. ఈ విషయం ఇప్పుడు సంచలనంగా మారింది. అవును... ది ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ ఆస్ట్రోబయాలజీలో ప్రచురించబడిన ఓ అధ్యయనమంలో.. వ్యోమగాములకు ఆహార అవసరాలను తీర్చడానికి గ్రహశకలాలను ఉపయోగించవచ్చని సూచిస్తున్నారు. అంతరిక్ష శిలల నుంచి కార్బన్ ను సంగ్రహించి.. తినదగిన ఆహారంగా మార్చడం అనేది వీరి ఆలోచన అని చెబుతున్నారు. మిచిగాన్ టెక్నలాజికల్ యూనివర్శిటీ పరిశోధకుల నేతృత్వంలోని అధ్యయనంలో ప్లాస్టిక్ వ్యర్థాలను తినదగిన ఆహారంగా మార్చే ఈ ఆలోచన యూఎస్ డిపార్ట్మెంట్ ఆఫ్ డిఫెన్స్ ప్రాజెక్ట్ నుంచి ప్రేరణ పొందినట్లు చెబుతున్నారు. ప్లాస్టిక్ ను ఘనపదార్థాలు, వాయువు, నూనె గా విచ్ఛిన్నం చేసే ప్రక్రియను పైరోలిసిస్ అంటారు. ఈ నూనె ద్వారా పోషకమైన బయోమాస్ ను ఉత్పత్తి చేస్తారు! ఈ మేరకు అంటారియోలోని వెస్ట్రన్ యూనివర్శిటీ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ జాషువా పియర్స్ వివరించారు! ఓ ప్రత్యేక పరిశోధనలో భూమిపై పడిన ఉల్కల ముక్కలను సూక్ష్మజీవులకు అందించారు. ఆ ఉల్క పదార్థంపై సూక్ష్మజీవులు వృద్ధి చెందాయని గ్రహించారు. ఈ ఆలోచన సక్సెస్ అయితే... 2020లో నాసా సందర్శించిన బెన్నూ లాంటి 500 మీటర్ల వెడల్పు గల గ్రహశకలం.. ఒక సంవత్సరానికి 600 నుంచి 17,000 వ్యోమగాములకు ఆహారం ఇవ్వగలదని పియర్స్ చెప్పారు! అయితే ఈ సమయంలో ఓ క్లిష్టమైన సవాలు మిగిలి ఉంది. ఇందులో భాగంగా... ఈ బయోమాస్ ను వ్యోమగాములు తినడానికి సురక్షితంగా ఉందని నిర్ధారించడానికి విస్తృతమైన పరీక్షలు అవసరం అని శాస్త్రవేత్తలు చెబుతున్నారు!!

## మీకు కష్టమొస్తే ఆదుకోవడంలో ముందుంటాం.. మాల్దీవులకు మోదీ అభయం




**న్యూఢిల్లీ- నవభూమి:** ద్వీప దేశమైన మాల్దీవులకు ఏ కష్టం వచ్చినా ఆదుకునేందుకు భారత్ ముందుంటుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ(అన్నారు. మాల్దీవులతో భారత్‌కు ఉన్న స్నేహం దశాబ్దాల నాటిదని గుర్తు చేశారు. భారతదేశంలో ఐదు రోజుల నరేంద్ర మోదీ, ముయిజ్జులు హైద్రాబాద్ హౌస్ నుంచి పలు ప్రాజెక్టులను వర్చువల్‌గా ప్రారంభించారు. ఇరుదేశాలు కలిసి పనిచేసేందుకు నిర్ణయించుకోవడంతో పాటు పలు ఎంఓయూలపై సంతకాలు చేశారు. మాల్దీవుల్లోని హనిమాధూ అంతర్జాతీయ విమానాశ్రయం రన్‌వేను వర్చువల్‌గా ప్రారంభించడంతో పాటు అధికారికంగా 'రూపీ కార్డ్ 'ను ప్రవేశపెట్టారు. మాల్దీవుల్లో కొద్దిరోజుల క్రితం రూపీ కార్డ్‌ను లాంఛ్ చేశామని, యూపీఐ ద్వారా ఇరుదేశాలు అనుసంధానం కావడానికి ఇప్పుడు సమయం వచ్చిందని ప్రధాని తెలిపారు. మాల్దీవులకు ఎప్పుడు కష్టమొచ్చినా ఆదుకునేందుకు ముందుడే దేశం భారత్ అని సంయుక్త సమావేశంలో మోదీ పేర్కొన్నారు. కోవిడ్ వ్యాక్సిన్ సరఫరా, మౌలిక సదుపాయల ప్రాజెక్టులకు తాము చేసిన సహాయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. మాల్దీవులు అధ్యక్షుడు, ఆయన ప్రతినిధి బృందానికి సాదర స్వాగతం చెబుతున్నానని, ఇరుదేశాల మధ్య సంబంధాలు దశాబ్దాల నాటివని అన్నారు. ఇండియాకు అతి సమీప దేశం, సన్నిహిత స్నేహతుడు మాల్దీవులని, సరిహద్దు దేశాలతో భారత్ విధానంలోనూ, సాగర్ విజన్‌లోనూ మాల్దీవులకు కీలక భూమిక ఉందన్నారు. మాల్దీవులకు ఏ కష్టమొచ్చినా తొలుత స్పందించడంలో భారత్ ఎప్పుడూ కీలకంగా నిలుస్తుందని చెప్పారు. పొరుగుదేశాల పట్ల భారత్ ఎప్పుడూ బాధ్యతాయుతంగా ఉంటుందని, సమగ్ర ఆర్థిక, తీర ప్రాంత భద్రతా భాగస్వామ్యం విషయంలో ఇరుదేశాల మధ్య పరస్పర సహకారం వ్యూహాత్మక దిశలో ముందుకు తీసుకువెళ్లేందుకు ఉభయదేశాలు నిర్ణయించినట్టు చెప్పారు.

**భారత్‌కు ముయిజ్జు కృతజ్ఞతలు**

పలు ప్రాజెక్టులను ప్రారంభించడం ద్వారా మాలే, మాలే ప్రజలకు న్యూఢిల్లీ ఎప్పుడూ చేయూతనిస్తుండటం పట్ల ముయిజ్జు కృతజ్ఞతలు తెలిపారు. మాల్దీవుల అవసరాలకు అనుగుణంగా 400 మిలియన్ డాలర్లు, రూ.300 కోట్ల కరెన్సీ స్వాప్ అగ్రిమెంట్‌పై సంతకాలు చేసినట్టు చెప్పారు. తమ దేశం సంక్షోభంలో ఉన్నప్పుడల్లా భారత్ స్నేహహస్తం అందిస్తూనే ఉందన్నారు. అందుకు తాము కృతజ్ఞతలు చెప్పుకుంటున్నామని అన్నారు. మాల్దీవుల్లో సామిజక-ఆర్థిక, మౌలిక వసతుల అభివృద్ధిలో భారత్ కీలక భాగస్వామి అని చెప్పారు. ఏళ్ల తరబడి భారత్ అందిస్తున్న ఉదార సాయం, సహకారానికి గాను ప్రధాని మోదీ, భారత ప్రభుత్వం, దేశ ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నానని అన్నారు.

# మళ్లీ పెరిగిన టమాట ధర.. రంగంలోకి దిగిన కేంద్రం



**న్యూఢిల్లీ- నవభూమి:** దేశవ్యాప్తంగా దసరా వేడుకలు జరుగుతున్నాయి. మరో వైపు నిత్యవసర ధరలు ఆకాశానంటుతున్నాయి. ఇప్పటికే పప్పులు, ఉప్పులు ధరలు భారీగా పెరిగాయి. ఇక వంట నూనెల ధరలు అయితే సలసలా కాగుతున్నాయి. అలాగే కూరగాయలు ధరలు సైతం పప్పులు, ఉప్పులు, వంట నూనెల ధరలతో పోటి పడుతున్నాయి. ఇక దేశ రాజధాని న్యూఢిల్లీలో కూరగాయల మార్కెట్‌లో కిలో టమాట ధర రూ. 100కు చేరింది.
%ఇటువంటి పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం రంగంలోకి దిగింది. వినియోగదారులకు సబ్సిడీ మీద కేజీ టమాట రూ. 65లకే అందజేయాలని నిర్ణయించింది. నేషనల్ కో ఆపరేటివ్ కన్స్యూమర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ (ఎన్‌సీసీఎఫ్) ద్వారా టమాట విక్రయించేందుకు ఏర్పాట్లు చేస్తుంది. దీని ద్వారా ఢిల్లీ మహానగరంలోని వివిధ ప్రాంతాల్లో మొబైల్ వ్యాన్లు ఏర్పాటు చేసి... వినియోగదారులకు టమాట విక్రయించనుంది. ఈ మేరకు వినియోగదారుల వ్యవహారాల శాఖ కార్యదర్శి నిధి ఖేరే సోమవారం న్యూఢిల్లీలో వెల్లడించారు.
మరో మూడు నాలుగు రోజుల్లో టమాట ధరలు తగ్గుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఢిల్లీలోని దాదాపు 50 కాలనీల్లో మొబైల్ వ్యాన్ల ద్వారా టమాటలను విక్రయిస్తామని చెప్పారు. గతంలో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి టమాట దిగుబడి బాగానే ఉండేదన్నారు. కానీ ఇటీవల ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్రల్లో ఏర్పడిన ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా టమాట పంట దిగుబడి బాగా తగ్గిందని వివరించారు. ఈ నేపథ్యంలో టమాట ధర అమాంతంగా పెరిగిందని చెప్పారు. పండగ సమయం కావడంతో టమాట వినియోగం సైతం అధికంగా ఉంటుందన్నారు. ఇక న్యూఢిల్లీలో బంగాళదుంప కేజీ రూ. 40 ఉందన్నారు. అలాగే ఉల్లిపాయ కేజీ రూ. 58 రూపాయిలుగా ఉందని వినియోగదారుల వ్యవహారాల శాఖ కార్యదర్శి నిధి ఖేరే వివరించారు. మరోవైపు తెలుగు రాష్ట్రాల్లో సైతం టమాట ధర రూ. 100 ఉంది. దాంతో వాటిని సబ్సిడి మీద వినియోగదారులకు అందజేసేందుకు ఆయా ప్రభుత్వాలు సైతం రైతులతో చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తుంది.
ఏదీఏమైనా.. కూరగాయాలన్నింటిలోకి టమాటాకు ఒక ప్రత్యేక స్థానం ఉంది. ఏడాదిలో ఒకొక్కసారి కేజీ టమాటా ధర రాకెట్ స్పీడ్‌తో ఆకాశాన్ని చేరుతుంది. దీంతో కేజీ టమాట ధర రూ. 150 నుంచి రూ. 200 వరకు ఉంటుంది. మరికొన్ని సమయాల్లో మాత్రం.. అదే కేజీ టమాట ధర రూ. 5 లేదా రూ. 10గా ఉంటుంది. అయితే ఆకాశంలో లేకుంటే నేల మీద ఉండే ఒకే ఒక్క కూరగాయి టమాట. ఇక మరి కొన్ని సందర్భాల్లో ఇదే టమాటకు మద్దతు ధర లేక రోడ్లపై రైతులు పారబోసిన సందర్భాలు సైతం తెలుగు రాష్ట్రాల్లో కొకొల్లలు ఉన్నాయన్న సంగతి అందరికీ తెలిసిందే.

## అమిత్‌షా సమావేశంపై నారాయణ సంచలన వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ- నవభూమి:** వామపక్ష తీవ్రవాదంపై కేంద్రమంత్రి అమిత్ షా అధ్యక్షతన జరుగుతున్న సమావేశంపై సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ సంచలన వ్యాఖ్యలు చేశారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ... దేశంలో రేప్‌లు, మర్డర్స్ జరుగుతున్నాయని ముందు వాటిపై ఫోకస్ పెట్టాలని హితవుపలికారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఇజ్రాయెల్ మోడల్‌ను అమలు చేస్తున్నారని మండిపడ్డారు. అన్నలు ఆలోచించాలని.. మారిన పరిస్థితులకు అనుగుణంగా ఉద్యమాల్లో మార్పులు తెచ్చుకోవాలని సూచించారు. ప్రజలతో కలిసి అన్నలు పోరాడాలని అన్నారు. రేప్‌లు చేసే వాళ్లకు బెయిల్ ఇస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. డేరా బాబాకు బెయిల్ ఇచ్చారని.. ఎన్నికలు వచ్చాయనే ఆయనకు బెయిల్ ఇచ్చారంటూ వ్యాఖ్యలు చేశారు.
ఘోరాతి ఘోరాలు చేసిన డేరా బాబాకు పంజాబ్, హర్యానా ఎన్నికల సమయంలో బెయిల్ ఇచ్చారన్నారు. వరవరరావు లాంటి వాళ్లకు మాత్రం బెయిల్ రాదని.. ఆయన మాత్రం బాంబేలోనే ఉండాలంటూ విరుచుకుపడ్డారు. జమ్ము కాశ్మీర్‌లో దొడ్డి దారిన ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు బీజేపీ ప్రయత్నాలు మొదలుపెట్టిందన్నారు. జమ్ము కాశ్మీర్‌లో ఐదు మంది ఎమ్మెల్యేలను ముందే నామినేట్ చేశారన్నారు. రేపు ఓట్ల లెక్కింపు సమయంలో సీట్లు గెలవకుండా ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు బీజేపీ ప్రయత్నాలు చేస్తోందని ఆరోపించారు. ప్రజల మద్దతు ఉంటే బీజేపీ ఇలా ఎందుకు చేస్తుందని ప్రశ్నించారు. ప్రధాని మోడీ విదేశీ పర్యటనలన్నీ నిష్ప్రయోజనమన్నారు. బీహార్, మణిపూర్లలో ప్రధాని పర్యటించరని.. బీహార్‌లో వరదలు వచ్చి జనం ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. మణిపూర్ రావణ కష్టంలా కాలుతోందన్నారు. అయినప్పటికీ ప్రధాని చాలా ఘోరంగా వ్యవహరిస్తున్నారని దుయ్యబట్టారు. బీహార్ వరదలను జాతీయ విపత్తుగా తక్షణం గుర్తించాలని డిమాండ్ చేశారు.

## హర్యానా, జమ్మూకశ్మీర్ ఎన్నికల ఫలితాలను తేల్చిచెప్పిన చిదంబరం



**తిరుచిరాపల్లి: నవభూమి:** హర్యానా , జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై ఉత్కంఠ నెలకొన్న నేపథ్యంలో గెలుపెవరిదో కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం తేల్చిచెప్పారు. కాంగ్రెస్ చిరకాల విధానాలను ప్రజామోదం కనిపిస్తోందన్నారు. హర్యానాలో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని, జమ్మూకశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుందని ధీమా వ్యక్తం చేశారు. "చిరకాలంగా కాంగ్రెస్ పార్టీ ఏ విధానాలకు కట్టుబడి ఉందో వాటిని ప్రజలు ఆమోదించనున్నారు. కొద్దికాలం వేరే వాళ్ల సిద్ధాంతాలు, విధానాలు గెలిచినట్టు కనిపించ వచ్చు. అయితే దీర్ఘకాలంలో కాంగ్రెస్ పార్టీ విధానాలు, సిద్ధాంతాలకు ప్రజామోదం ఉంటుంది. నా వాదనకు హర్యానా, జమ్మూకశ్మీర్ ఎన్నికల ఫలితాలే బలం చేకూరుస్తాయని ఆశిస్తున్నాను" అని చిదంబరం అన్నారు. చెన్నై ఎయిర్ షో సందర్భంగా తీవ్ర ఉష్ణోగ్రతలు, ఇతర మెడికల్ కండిషన్ల కారణంగా ఐదుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరమని చిదంబరం అన్నారు. మృతుల కుటుంబాలకు తమిళనాడు ప్రభుత్వం పెద్దమనసుతో పరిహారం ఇస్తుందని ఆశిస్తున్నట్టు చెప్పారు. కాగా, హర్యానా, జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు అక్టోబర్ 8వ తేదీన వెలువడనున్నాను. హర్యానాలో కాంగ్రెస్ విజయం ఖాయమని, జమ్మూకశ్మీర్‌లో నేషనల్ కాన్ఫరెన్స్-కాంగ్రెస్ కూటమి తమ ప్రత్యర్థుల కన్నా మెరుగైన ఫలితాలు సాధిస్తుందని పలు ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి.

## హెూంటౌన్ షూటింగ్‌లో కల్యాణ్ రామ్ డైరెక్టర్.. వివరాలివే..!



నందమూరి కల్యాణ్ రామ్ నటించిన డెవిల్ సినిమాతో అందరికీ హాయ్ చెప్పాడు డైరెక్టర్ నవీన్ మేడారం ఈ డైరెక్టర్ మరోవైపు సినిమాలు, వెబ్‌సిరీస్ తెరకెక్కిస్తూ నిర్మాతగా కూడా బిజీ అయిపోయాడు.
ఈ టాలెంటెడ్ డైరెక్టర్ 90.. ఏ మిడిల్ క్లాస్ బయోపిక్‌ను తెరకెక్కించగా.. పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం ఈటీవీ విన్‌లో ప్రీమియర్ అయిన ఈ చిత్రం సూపర్ హిట్‌గా నిలిచింది. నవీన్ మేడారం ప్రస్తుతం కొత్త ప్రాజెక్ట్‌ను ప్రకటించాడు. ఈ సారి చేస్తుంది మాత్రం సినిమా కాదు.. ఆహా వెబ్ సిరీస్‌ను తెరకెక్కిస్తున్నాడు నవీన్ మేడారం. హెూంటౌన్ టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ వెబ్ సిరీస్‌లో రాజీవ్ కనకాల లీడ్ రోల్‌లో నటిస్తున్నాడు. ఈ వెబ్ ప్రాజెక్ట్ షూటింగ్ నేడు మొదలైంది. ఈ విషయాన్ని తెలియజేస్తూ లొకేషన్‌లో క్లిక్ మనిపించిన స్టిల్‌ను సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు నవీన్ మేడారం. స్పాట్‌లో రాజీవ్ కనకాల, నవీన్ మేడారం ఉన్న స్టిల్ నెట్టింట చక్కర్లు కొడుతోంది. త్వరలోనే వెబ్ సిరీస్‌పై పూర్తి వివరాలు వెల్లడించనున్నారు మేకర్స్. ఇంతకీ నవీన్ మేడారం ఈ వెబ్‌సిరీస్‌ను డైరెక్ట్ చేస్తున్నాడా..? నిర్మిస్తున్నాడా..? అనేది తెలియాల్సి ఉంది.

నవచిత్ర






## నిధి అగర్వాల్.. పట్టుచీరలో చందమామలా..

నిధి అగర్వాల్ ఎప్పటికప్పుడు తన గ్లామరస్ ఫోటోషూట్లతో అభిమానులను కట్టిపడేస్తోంది. ఇటీవల షేర్ చేసిన ఫొటోలలో ఆమె సంప్రదాయ చీరలో పట్టు చీర కట్టుకుని, అందమైన ఆభరణాలు ధరించి కనిపిస్తోంది. ఆమె పసుపు రంగు చీరలో, విభిన్నమైన ఆభరణాలతో తన అందాన్ని మరింత హైలైట్ చేయడం జరిగింది. నిధి సింపుల్ అండ్ ఎలిగెంట్ లుక్‌తో తన అభిమానులను మరోసారి అలరించింది. ఈ ఫోటోల్లో నిధి అగర్వాల్ సంప్రదాయ లుక్‌కి తోడు, ఆమె పెట్టుకున్న గజరాలు, అందమైన నగలు ఆమెను మరింత రాచరికమైన లుక్‌కి చేరువ చేశాయి. సోషల్ మీడియాలో ఆమె అభిమానులు ఈ లుక్‌కి ఫిదా అయ్యారు., I am their Bangaram అనే క్యాప్షన్‌తో ఈ ఫోటోను షేర్ చేసిన నిధి తన గ్లామర్‌కి ఎలాంటి సరిహద్దు ఉండదని మరోసారి నిరూపించింది. పబ్లిక్ సాక్షిగా ఆలియాకు ఊహించని షాక్ ప్రస్తుతం 'హరిహర వీరమల్లు' సినిమాలో పవన్ కళ్యాణ్ సరసన నటిస్తూ ఉన్న నిధి అగర్వాల్, తన కెరీర్‌లో దూసుకుపోతుంది. ప్రస్తుత తెలుగు సినిమాల్లో మంచి స్థానం సంపాదించుకున్న నిధి, వరుస సినిమాలతో బిజీగా ఉంది. ఈ చీరలో కనిపించిన ఆమె లుక్‌కి సంబంధించిన ఫోటోలు అభిమానుల నుంచి విపరీతమైన రెస్పాన్స్ అందుకుంటున్నాయి. నిధి అగర్వాల్ నటనతో పాటు తన ఫ్యాషన్ ఎంపికలతో కూడా అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. టాలెంట్‌తో పాటు గ్లామర్‌కి కూడా తగిన ప్రాధాన్యం ఇవ్వడం వల్లే ఆమెకు ఇంతటి ఫాలోయింగ్ ఉందని చెప్పవచ్చు. ఇక అమ్మడికి అర్జెంటుగా ఒక మంచి సక్సెస్ రావాల్సిన అవసరం ఉంది. ప్రస్తుతం చేస్తున్న సినిమాలలో బిగ్ మూవీగా హరహర వీరమల్లు తెరకెక్కుతోంది. మరి నిధికి ఆ సినిమా ఎలాంటి విజయాన్ని అందిస్తుందో చూడాలి.

## ఏంటీ ఇలాంటి టైంలో రవితేజ రిస్క్ చేస్తున్నాడా..?




ఇండస్ట్రీలో సూపర్ ఫ్యాన్ ఫాలోయింగ్ ఉన్న లీడింగ్ యాక్టర్లలో ఒకరు రవితేజ ఈ స్టార్ యాక్టర్ క్రాక్ తర్వాత గ్రాండ్ హిట్ కొట్టి మార్కెట్‌ను అమాంతం పెంచేసుకున్నాడు. ఆ తర్వాత 2022లో వచ్చిన ధమాకా సినిమాతో మరో బ్లాక్ బస్టర్‌ను ఖాతాలో వేసుకున్నాడు. ఆ తర్వాత చిరంజీవి టైటిల్ రోల్‌లో నటించిన వాల్తేరు వీరయ్యలో కీలక పాత్రలో మెరిశాడు. ఈ సినిమా హిట్ టాక్ తెచ్చుకున్నప్పటికీ క్రెడిట్ మాత్రం చిరు ఖాతాలోకి వెళ్లిపోయింది. ధమాకా తర్వాత రవితేజకు బ్యాక్ టు బ్యాక్ ఫ్లాపులు పలుకరిస్తున్నాయని తెలిసిందే. ఇక భారీ అంచనాల మధ్య ఇటీవలే విడుదలైన మిస్టర్ బచ్చన్ బాక్సాఫీస్ వద్ద ఊహించని విధంగా డిజాస్టర్ టాక్ తెచ్చుకుంది. ఇక నెక్ట్స్ ఫిలిం ఆర్‌టీ 75 షూట్‌లో గాయం కాగా.. సర్జరీ చేయించుకుని విశ్రాంతి తీసుకున్నాడు రవితేజ. ఇదిలా ఉంటే రెస్ట్ టైంలో కొత్త సినిమాల కోసం కథలు వినే పని పెట్టుకున్నాడట. తాజా టాక్ ప్రకారం పాపులర్ కోలీవుడ్ డైరెక్టర్ సుందర్ సీ కథ చెప్పగా రవితేజకు నచ్చిందట. త్వరలోనే దీనిపై ఓ నిర్ణయానికి కూడా వచ్చే అవకాశాలున్నాయని తెలుస్తోంది. రజినీకాంత్‌తో అరుణాచలం లాంటి ఇండస్ట్రీ ఆల్‌టైమ్ బ్లాక్ బస్టర్ తెరకెక్కించిన సుందర్ సీ ట్రాక్ రికార్డు గురించి ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. అయితే కొంతకాలంగా ఈయన కాంపౌండ్ నుంచి వస్తున్న సినిమాలు ఫెయిల్యూర్ టాక్ తెచ్చుకుంటున్నాయి. అసలే వరుస ఫెయిల్యూర్స్‌తో ఉన్న రవితేజ ఇలాంటి టైంలో సుందర్ సీ సినిమాకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి రిస్క్ చేస్తాడా..? ఏంటీ అని ఇండస్ట్రీ సర్కిల్‌లో ఓ వార్త రౌండప్ చేస్తోంది. మరి దీనిపై త్వరలో ఏమైనా క్లారిటీ ఇస్తాడేమో చూడాలంటున్నారు సినీ జనాలు. రవితేజ త్వరలోనే ఆర్‌టీ 75 షూట్‌లో జాయిన్ కాబోతున్నట్టు సమాచారం.

## మహేశ్ బాబు నయా స్టైల్



తెలుగు, తమిళంతోపాటు పాన్ ఇండియా మూవీ లవర్స్ ఎక్జయిటింగ్‌గా ఎదురుచూస్తున్న సినిమా ఎస్ఎస్ఎంబీ 29. టాలీవుడ్ సూపర్ స్టార్ డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి -మహేశ్ బాబు కాంబోలో గ్లోబల్ అడ్వెంచరస్ ప్రాజెక్టుగా తెరకెక్కనున్న ఈ సినిమాపై అంచనాలు భారీగానే నెలకొన్నాయి. మహేశ్ బాబు ఈ సినిమా కోసం కంప్లీట్ కొత్త అవతారంలో కనిపించబోతున్నాడని ప్రత్యేకించి చెప్పనవసరం లేదు. ఇప్పటికే లాంగ్ హెయిర్, పోనీ టెయిల్‌తో కనిపించిన ఈ స్టార్ యాక్టర్ మరో లుక్‌లో కనిపించి టాక్ ఆఫ్ ది టౌన్‌గా నిలుస్తున్నాడు. ఈ సినిమా కోసం మహేశ్ బాబు మరోసారి మేకోవర్ మార్చేసుకుని.. కొత్త కొత్త గెటప్స్‌లో కనిపిస్తూ నెట్టింట సందడి చేస్తున్నాడు. తాజాగా మహేశ్ బాబు ఫ్యామిలీతో కలిసి వెకేషన్‌కు వెళ్తున్న సమయంలో ఎయిర్‌పోర్టులో లాంగ్ హెయిర్, గడ్డం, రెడ్ క్యాప్, హూడీ వేసుకుని స్టైలిష్‌గా నడిచి వస్తుండగా.. అక్కడే ఉన్న కెమెరాలు క్లిక్‌మనిపించాయి. తాజాగా ఫొటోలు జక్కన్న సినిమాపై క్యూరియాసిటీ మరింత పెంచేస్తున్నాయి. ఆఫ్రికన్ అడ్వెంచరస్ ప్రాజెక్ట్‌గా ఇంటర్నేషనల్ యాక్షన్ డ్రామా నేపథ్యంలో రాబోతున్న ఈ చిత్రాన్ని దుర్గా ఆర్ట్స్ బ్యానర్‌పై కేఎల్ నారాయణ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. కాగా ఈ చిత్రంలో మహేశ్ బాబు పాత్ర డైలాగ్ డెలివరీ మాండలికం, పదాల ఉచ్చరణ వంటి అంశాలను పాపులర్ యాక్టర్ నాజర్ దగ్గరుండి చూసుకోనున్నా రంటూ ఇప్పటికే ఓ వార్త నెట్టింట చక్కర్లు కొడుతోంది. ఈ చిత్రాన్ని 2027 మొదటి త్రైమాసికంలో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల చేయాలని జక్కన్న టీం ప్లాన్ చేస్తున్నట్టు సమాచారం.

## ఇద్దరు తండ్రులు, కొడుకు మధ్య సంఘర్షణే మా నాన్న సూపర్ హీరో : సుధీర్ బాబు




టాలీవుడ్ యాక్టర్ సుధీర్‌బాబు నటిస్తోన్న తాజా చిత్రం 'మా నాన్న సూపర్ హీరో' ఇప్పటికే విడుదల చేసిన పోస్టర్లు టీజర్, ట్రైలర్‌కు మంచి స్పందన వస్తుంది. 'లూసర్' వెబ్‌సిరీస్ ఫేం అభిలాష్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ చిత్రం అక్టోబర్ 11న గ్రాండ్‌గా విడుదల కానుంది. ప్రమోషన్స్‌లో భాగంగా సుధీర్ బాబు ఆసక్తికర విషయాలు షేర్ చేసుకున్నాడు. సినిమా గురించి మాట్లాడుతూ.. మా నాన్న సూపర్ హీరో యూనివర్సల్ సబ్జెక్ట్ అని అన్నాడు సుధీర్ బాబు. కథ ఇద్దరు తండ్రులు, ఒక కొడుకు మధ్య జరిగే సంఘర్షణ నేపథ్యంలో ఉంటుంది. ఈ సినిమాలోని భావోద్వేగాలకు ప్రతీ ఒక్కరూ కనెక్ట్ అవుతారని నమ్ముతున్నానన్నాడు సుధీర్ బాబు. ఈ చిత్రాన్ని వి సెల్యులాయిడ్, సీఏఎమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థలు సంయుక్తంగా తెరకెక్కిస్తున్నాయి. ఈ మూవీలో సాయిచంద్, షాయాజీషిండే, రాజు సుందరం, శకాంక్, ఆమని, హర్షిత్ రెడ్డి ఇతర నటీనటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ మూవీకి జై క్రిష్ సంగీతం అందిస్తుండగా.. సునీల్ బలుసు తెరకెక్కిస్తున్నారు. తండ్రీకొడుకుల అనుబంధం నేపథ్యంలో విభిన్న కథాంశంతో ఈ చిత్రాన్ని తెరకెక్కించనున్నట్టు ఇప్పటికే క్లారిటీ ఇచ్చేశాడు దర్శకుడు.

## రాణించిన లారా, మరినేకాప్.. ఇంగ్లండ్ లక్ష్యం..?



**న్యూదిల్లీ-నవభూమి:** మహిళల టీ20 వరల్డ్ కప్ రెండో మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా ను ఇంగ్లండ్ తక్కువ స్కోర్‌కే కట్టడి చేసింది. ఇంగ్లండ్ స్పిన్నర్ సోఫీ ఎకిల్‌స్టోన్(2/15) తిప్పేయడంతో ప్రధాన ప్లేయర్లు డగౌట్‌కు చేరారు. ఆరంభంలో దూకుడుగా ఆడిన సఫారీలు మిడిల్ ఓవర్లలో తడబడ్డారు. ఓవైపు వికెట్లు పడుతున్నా కెప్టెన్ లారా వొల్వార్డ్(42) మరోసారి కీలక ఇన్నింగ్స్ ఆడింది. ఆఖర్లో సీనియర్ ఆల్‌రౌండర్ మరినే కాప్(19) రాణించడంతో దక్షిణాఫ్రికా 6 వికెట్ల నష్టానికి 124 పరుగులు చేసింది. వరల్డ్ కప్‌లో వెస్టిండీస్‌పై 10 వికెట్ల తేడాతో సూపర్ విక్టరీ కొట్టిన దక్షిణాఫ్రికాకు ఇంగ్లండ్ బౌలర్లు షాకిచ్చారు. టాస్ గెలిచి బ్యాటింగ్ తీసుకొని తొలి ఓవర్ నుంచే ఎదురు దాడికి దిగిన ఓపెనర్ తంజిమ్ బ్రిట్స్(13)ను లిన్సే స్మిత్ పెవిలియన్ పంపింది. 31 పరుగులకే తొలి వికెట్ పడినా.. కెప్టెన్ లారా వొల్వార్డ్(42) పట్టుదలగా ఆడింది.

## కోచింగ్ ఇస్తూనే.. ఫుట్‌బాల్ దిగ్గజం కన్నుమూత



**న్యూదిల్లీ-నవభూమి:** నెదర్లాండ్స్ ఫుట్‌బాల్ దిగ్గజం జొహన్ నీస్కెన్స్ కన్నుమూశాడు. డచ్ జట్టుకు ఆడిన గొప్ప మిడ్‌ఫీల్డర్లలో ఒకడైన జొహన్ 73 ఏండ్ల వయసులో మరణించాడు. తమ దేశపు సాకర్ లెజెండ్ ఇక లేరనే విషయాన్ని సోమవారం డచ్ ఫుట్‌బాల్ అసోసియేషన్ ఓ ప్రకటన ద్వారా వెల్లడించింది. కోచింగ్ ప్రాజెక్ట్ కోసం అల్జీరియాలో ఉంటున్న జొహన్ అక్కడే మృతి చెందాడని ఆ సంఘం తెలిపింది. %'జొహన్ నీస్కెన్స్ ఇకలేరు. ఈ విషాద సమయంలో మాటలు రావడం లేదు. ఈ కష్ట సమమయంలో అతడి భార్య మర్లిస్, పిల్లలు, కుటుంబ సభ్యుల గురించి మేము ప్రార్థిస్థాం 'అని ఓ పోస్ట్ పెట్టింది. అయితే.. జొహన్ మరణానికి కారణం ఏంటనేది మాత్రం తెలియాల్సి ఉంది. సాకర్ లెజెండ్‌ను కోల్పోవడం బాధాకరమని పలువురు సంతాపం తెలియజేస్తున్నారు.

నవక్రీడ

## భారత పేసర్‌కు ఐసీసీ మందలింపు.. ఏమైందంటే..?



**న్యూదిల్లీ-నవభూమి:** మహిళల టీ20 వరల్డ్ కప్‌లో బోణీ కొట్టిన టీమిం డియా సెమీస్ లక్ష్యంగా శ్రీలంకతో తలపడనుంది. ఇకపై ప్రతి మ్యాచ్ గెలవాల్సిన దశలో భారత జట్టుకు షాకింగ్ న్యూస్. పాకిస్థాన్‌పై సూపర్ బౌలింగ్‌తో 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకున్న పేసర్ అరుంధతీ రెడ్డి()ని ఐసీసీ మందలించింది. దాయాదితో మ్యాచ్ సందర్భంగా పేసర్ ఐసీసీ నియమావళిని ఉల్లంఘించింది. ఈ విషయమై రిఫరీ ఫిర్యాదు చేయగా.. అరుంధతీ కూడా తన తప్పును అంగీకరించింది. దాంతో, ఐసీసీ క్రమశిక్షణ కమిటీ ఆమెకు ఒక డీమెరిట్ పాయింట్ కేటాయించింది. పాకిస్థాన్‌తో ఉత్కంఠ రేపిన మ్యాచ్‌లో అరుంధతీ రెడ్డి బంతితో మెరిసింది. 4 ఓవర్లలో 19 పరుగులకే మూడు కీలక వికెట్లు తీసింది. 20వ ఓవర్లో నిదా దార్(23)ను బౌల్డ్ చేసిన ఈ స్పీడ్‌స్టర్ భావోద్వేగాన్ని నియంత్రించుకోలేకపోయింది. పెవలియన్ అటు అంటూ నిదాకు చూపిస్తూ వికెట్ సెలబ్రేట్ చేసుకుంది. అరుంధతీ తీరును తప్పుబట్టిన రిఫరీ ఆమె లెవల్ 1 కోడ్ ఉల్లంఘనకు పాల్పడిందని ఫిర్యాదు చేశాడు. దాంతో.. క్రమశిక్షణ కమిటీ ఆమెకు ఒక డీమెరిట్ పాయింట్ విధించింది. ఇదే సీజన్‌లో మరో మూడు డీ మెరిట్ పాయింట్లు వస్తే.. అరుంధతిపై ఒక మ్యాచ్ నిషేధం పడే అవకాశం ఉంది.

Printed,Published & Owned by SHAIK SHAHANAZ, Printed at SUPER PRINTERS Web offset Printers 2-3-655/C/118,Azad Nagar,Amberpet Circle 23,HYDERABAD -500113(T.S.), and Published D.No: 10-2-287/1/,Ground Floor,Santhinagar,A.C Guards,Masabtank,HYDERABAD - 500028,State TELANGANA (India). Editor: **SHAIK SHAHANAZ**, Phone: 9246213493,Email : navabhoomidaily@gmail.com,navabhoomi1@gmail.com **RNI No: TEL TEL: 82083**